
శనివారం 4, జూలై 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**పొగాకు రైతులకు గిట్టుబాటు ధరే ప్రభుత్వ లక్ష్యం**

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

12



# ఆంధ్రప్రదేశ్ ఇక.. ఉక్కు రాష్ట్రం

- జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం
- రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడి.. 2028 నాటికి ఉత్పత్తి
- సున్నపురాళ్లపల్లిలో స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగా, విజయనగరం జిల్లాలో పారిశ్రామిక పార్కుకు వర్చువల్‌గా శంకుస్థాపన

*రాయలసీమ అంటే కరువు నేల కాదు.. పచ్చని పరిశ్రమల క్షేత్రం అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చాటిచెప్పారు. ఐదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి శుక్రవారం ఆయన కడప జిల్లా సున్నపురాళ్లపల్లిలో శ్రీకారం చుట్టారు. విశాఖ స్టీల్, అనకాపల్లి ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్‌లకు కడప స్టీల్ తోడవడంతో ఆంధ్రప్రదేశ్ ఇక దేశంలోనే 'ఉక్కు రాష్ట్రం'గా మారబోతోందని సీఎం వ్యాఖ్యానించారు. రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడి, వేలాది మంది ఉద్యోగాల లక్ష్యంతో మొదలవుతున్న ఈ మెగా ప్రాజెక్టు 2028 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తుందన్నారు. జేఎస్‌డబ్ల్యూ ఛైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మలతో కలిసి రాయలసీమ స్టీల్ ప్లాంట్, దానికి అనుబంధంగా నిర్మిస్తున్న జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులను సీఎం ప్రారంభించారు. విజయనగరం జిల్లాలో రూ.531 కోట్లతో నిర్మించే జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.*

2





జేఎస్‌డబ్ల్యూ సహకారంతో

## రాష్ట్రంలో వరల్డ్ క్లాస్ స్పోర్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

6

**ఎలైట్ ప్లేయర్స్‌తో 'డిన్నర్ మీట్'లో మంత్రి లోకేష్**

ఏపీని అంతర్జాతీయ క్రీడా పటంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో కూడిన 'వరల్డ్ క్లాస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏపీలో ఏర్పాటు చేసేందుకు ప్రముఖ పారిశ్రామిక దిగ్గజ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ముందుకొచ్చిందని మంత్రి లోకేష్ ప్రకటించారు. అంతర్జాతీయ వేదికలపై రాణిస్తున్న రాష్ట్ర ఎలైట్ అథ్లెట్లకు ఆయన ఉండవల్లిలోని తన నివాసంలో 'డిన్నర్ మీట్' ఇచ్చారు.

## ప్రతి కుటుంబానికీ ఉపాధి.. ప్రతి యువతకీ ఉద్యోగం

- 'స్వర్ణ కుప్పం-పెట్టుబడుల వేదిక' బహిరంగ సభలో సీఎం చంద్రబాబు
- రూ.9,322 కోట్ల పెట్టుబడుల అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి
- గుడుపల్లె మండలం పొగురుపల్లిలో వివిధ పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, వర్చువల్ శంకుస్థాపనలు, ఎంవోయూలు

4



*"ఒకప్పుడు మారుమూల వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కుప్పం.. నేడు గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారి ప్రపంచ స్థాయి కంపెనీలతో పోటీపడుతోంది. గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసినప్పటి కంటే నా సొంత నియోజకవర్గమైన కుప్పంలో పరిశ్రమలకు భూమి పూజ చేస్తున్నప్పుడే నాకు అత్యంత సంతృప్తి, ఆనందం కలిగాయి" అని సీఎం చంద్రబాబు భావోద్వేగంతో ప్రకటించారు. ప్రతి కుటుంబానికీ ఉపాధి కల్పించడం... ప్రతి యువతకీ ఉద్యోగం ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గుడుపల్లె మండలం పొగురుపల్లిలో నిర్వహించిన 'స్వర్ణ కుప్పం-పెట్టుబడుల వేదిక' బహిరంగ సభలో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ఆధ్వర్యంలో సుమారు రూ.9,322 కోట్ల భారీ పెట్టుబడులతో 30 నూతన పరిశ్రమల స్థాపనకు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.*

## పోర్టు ఆధారిత వ్యవస్థగా ఏపీ



- షిప్ బిల్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పం ప్రభుత్వానిది
- కేంద్రానికి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విజ్ఞప్తి
- కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌తో విస్తృత భేటీ

15

## లిఫ్ట్ ఇరిగేషన్‌కు పూర్వ వైభవం



- పదేళ్ల నిర్వహణకు రూ.4,500 కోట్లతో టెండర్లు
- శాశ్వత సాగునీటి భద్రతే కూటమి లక్ష్యం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

15

చైతన్యరథం



# ఆంధ్రప్రదేశ్ ఇక... ఉక్కు రాష్ట్రం

- జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం
- రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడి.. 2028 నాటికి ఉత్పత్తి
- సున్నపురాళ్లపల్లిలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ, విజయనగరంలో పారిశ్రామిక పార్కుకు వర్చువల్‌గా శంకుస్థాపన



కడప (చైతన్యరథం): పరిశ్రమలు, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం సహా, ఆర్సెల్లార్ మిట్టల్, వైజాగ్ స్టీల్‌తో ఆంధ్రప్రదేశ్ ఉక్కు రాష్ట్రంగా మారుతుందన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లిలో జిందాల్ సౌత్ వెస్ట్ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి శుక్రవారం ప్రారంభించారు. జేఎస్‌డబ్ల్యూ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మలతో కలిసి ప్లాంట్ పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు అనుబంధంగా నిర్మిస్తున్న జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులనూ సీఎం ప్రారంభించారు. ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కానుంది. ఉక్కు ఉత్పత్తి, సోలార్ ప్రాజెక్టు ద్వారా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. 3,850 మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేసేలా నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. రూ.20,350 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. జమ్మలమడుగు నుంచి విజయనగరం జిల్లాలోని జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కును కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. విజయనగరం జిల్లాలో 1,166 ఎకరాల్లో అత్యాధునిక పారిశ్రామిక పార్కును జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.531 కోట్లను జిందాల్ సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

### దశాబ్దాల నిరీక్షణ నిజమైంది

రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. "రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం గురించి దశాబ్ద కాలం పాటు ఎదురుచూశాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ హామీ నెరవేరింది. రాయలసీమ అంటే ఇప్పుడు హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్-రాయల్ ఎన్‌ఫీల్డ్, కియా కార్లు, హీరో బైక్స్, డ్రోన్లు, ఫైటర్ జెట్లు, ఎలక్ట్రానిక్స్ గ్రీన్ ఎనర్జీ... సీమ ఇకపై ఏమాత్రం కరువు నేల కాదు. జలకళ ఉట్టిపడే పచ్చని ప్రాంతం. పరిశ్రమలు, రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో నవ శకం మొదలైంది. విభజన తర్వాత ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, అనుమానాలు దాటుకుని రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించాం. గత పాలకులు మోసపూరితంగా శంకుస్థాపనలు చేశారు. 2019లో ఓసారి, 2023లో మరోమారు శంకుస్థాపన, భూమి పూజలు చేశారు. ఐదేళ్ల కాలంలో శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టాం. పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో ఉక్కు ఉత్పత్తి చేస్తారు. విశాఖ ఉక్కు సంక్షోభంలో ఉన్నప్పుడు కేంద్రంతో మాట్లాడి రూ.11,440 కోట్ల ఆర్థిక సాయంతో ఆదుకున్నాం. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. జేఎస్‌డబ్ల్యూ బళ్లారి ప్లాంట్ కంటే అధిక సామర్థ్యంతో రాయలసీమ ప్లాంటును తీర్చిదిద్దాలి. గండికోట నుంచి 15 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసి 2 టీఎంసీల నీటిని స్టీల్ ప్లాంట్ కు సరఫరా చేస్తాం. రాయలసీమ ప్రాంతంలో ఉన్న అత్యంత నాణ్యమైన ముడి ఇనుము ఖనిజాన్ని కూడా ప్లాంటుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.




### గత పాలనలో రాయలసీమ నష్టపోయింది

'రాయలసీమ ఎవరి వల్ల నష్టపోయిందో ప్రజలు గుర్తించాలి. దేశవ్యాప్తంగా పోటీ ఉన్నా 2017లో అనంతపురం జిల్లాకు కియా కార్ల పరిశ్రమను తీసుకువచ్చాం. 536 ఎకరాలను కేటాయించి, నీళ్లు ఇచ్చి ఉత్పత్తికి అన్ని విధాలా సహకరించాం. మేం తెచ్చిన కియా కంపెనీ 19 లక్షల కార్లు ఉత్పత్తి చేసింది. ఇందులో మూడు లక్షల కార్లు 90 దేశాలకు పైగా ఎగుమతి అయ్యాయి. కియాతో అనంతపురం దశ, దిశ మారింది. గతంలో కొందరు స్వార్థపరులు కేవలం సొంత ప్రయోజనాల కోసమే పనిచేసి అక్రమాలు చేశారు. 2007లో 14వేల ఎకరాలను బ్రాహ్మణి స్టీల్స్ కు భూములు ఇచ్చి భ్రమలు కల్పించారు. ఎయిర్‌పోర్టు కడతామన్నారు. ఇప్పటిదాకా అతీగతీ లేదు. క్యాప్టివ్ మైనింగ్ అని చెప్పి ఓబుళాపురం గనుల నుంచి దోపిడీ చేశారు. ముడి ఇనుము ఖనిజాన్ని విదేశాలకు స్మగ్లింగ్ చేశారు. అసలు ప్లాంటే పెట్టలేదు. దేశానికి ఉపయోగపడాల్సిన సంపద విదేశాలకు తరలిపోయింది. తప్పు చేసిన వ్యక్తులు జైలుకు వెళ్లారు. ఈ ఒక్క ఉదాహరణతోనే ఎవరిది విశ్వసనీయతో, ఎవరు మోసగాళ్లో అర్థమవుతోంది. రాయలసీమ సంపద ఈ ప్రాంత అభివృద్ధికే ఉపయోగపడాలి. ఇక్కడి ముడి ఇనుముతో ఇక్కడే ఉక్కు తయారు కావాలి. రాష్ట్రానికి చెందిన యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పిస్తాం. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి కడప జిల్లాకు, రాయలసీమకు ఏమీ చేయలేదు." అని సీఎం అన్నారు.

### విశ్వసనీయత లేని పార్టీకి విలువెక్కడ

'గత పాలకులు రాయలసీమలో ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేక పోయారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ త్వరలోనే ఇస్తాం. సాగునీరు, తాగునీటి అవసరాలు తీరుస్తాం. అవుకు టన్నెల్ పూర్తి చేసి పులివెందులలో చీని తోటలు కాపాడాం. ఎర్రబెల్లి చెరువుకు నీళ్లు ఇచ్చి రైతుల కష్టాలు తీర్చాం. సీమలో స్పేస్,

(తరువాయి 3లో..)






# ఆంధ్రప్రదేశ్ ఇక.. ఉక్కు రాష్ట్రం













(2వ పేజీ తరువాయి..)

ఏరో స్పేస్, డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయి. స్పేస్ సిటీలో, డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు జేఎస్‌డబ్ల్యూ ముందుకు వచ్చింది. నమ్మకంతో, విశ్వాసంతో పాలన అందిస్తున్నాం కాబట్టే పెట్టుబడులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానంతో ఆటలు ఆడుకోవద్దని చెప్తున్నాను. గత పాలనలో మన రాజధాని ఏమిటో ఎక్కడుందో కూడా చెప్పలేని పరిస్థితి. వారికి విశ్వసనీయతే లేదు. నిన్న మావిగన్ అన్నారు. నేడు విజయవాడ అంటున్నారు. మతిస్థిమితం లేని వ్యక్తులు రాజకీయం చేస్తున్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని, ప్రజల్ని తీవ్రంగా నష్టపరిచారు. ప్రజలంతా కాలరెత్తుకుని చెప్పుకునేలా అమరావతిని అభివృద్ధి చేస్తాం. హింస, నేరాలతో కాదు.. ప్రజల కోసం బాధ్యతగా రాజకీయాలు చేయాలి. విజయవాడ యువకుడి అదృశ్యం ఘటనను కూడా రాజకీయం చేసేలా వైసీపీ వ్యవహరిస్తోంది. పోలీసులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారు. శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉన్నారు. విధ్వంసమే గొడ్డలి పార్టీకి అజెండా. గంజాయి బ్యాచ్ విషయంలో కఠినంగా ఉండాలని ఆదేశించాను. మా హయాంలో శాంతిభద్రతలకే పెద్ద పీట. అలాగే హార్టీకల్చర్ సాగుతో లింగాల మండలంలో రాష్ట్రంలోనే అత్యధిక తలసరి ఆదాయం వస్తోంది. ఆగస్టు 15 నాటికి గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌కు మదనపల్లిలో శంకుస్థాపన చేస్తాం. రాయలసీమ హార్టీకల్చర్ హబ్ కోసం పూర్వోదయ పథకం కింద రూ.40వేల కోట్లు వ్యయం చేస్తాం. ప్రైవేటు రంగం నుంచి మరో రూ.60వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి. అమెరికాలో ఉన్న గ్రాండ్ కాన్యాన్‌కు దీటుగా మన గండికోటను అభివృద్ధి చేస్తాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

### విజనరీ నేతతో పనిచేయడం గౌరవం- సజ్జన్ జిందాల్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లాంటి విజన్ ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉన్నారని జిందాల్ సౌత్ వెస్ట్ లిమిటెడ్ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్ అన్నారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్, నియో ఎనర్జీ ప్లాంట్, విజయనగరం పారిశ్రామిక పార్కు పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే 25ఏళ్లలో చేయాల్సిన పనుల గురించి చంద్రబాబు ముందుచూపుతో ఆలోచన చేస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి కోసం నిత్యం పనిచేసే చంద్రబాబు లాంటి నేతలతో కలిసి పనిచేయడం పారిశ్రామిక వేత్తగా తనకు గౌరవమని ఆయన వ్యాఖ్యానించారు. ఏడాదికి 2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మితమవుతున్న రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను మరింతగా విస్తరిస్తామని తెలిపారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో స్థానిక యువతీ, యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ తరపున దాదాపు రూ.50వేల కోట్ల మేర ఏపీలో పెట్టుబడులు పెడతామని.. తద్వారా 50వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. అంతకుముందు స్టీల్ ప్లాంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను, మినియేచర్ మోడళ్లను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు గురించి సజ్జన్ జిందాల్ సీఎంకు వివరించారు. దాని సమీపంలో పర్యాటక రిసార్ట్ ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ ప్లాంట్‌లో తమ సంస్థ రూపొందించిన డిఫెన్స్ డ్రోన్ షీల్డ్ ఏఐ గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి తిరుపతి స్పేస్ సిటీ సహా కర్నూలు డ్రోన్ సిటీలో వసతులను వినియోగించుకోవాలని కోరారు. ప్రకృతి విపత్తులు, డిఫెన్స్ అవసరాల కోసం వినియోగించే ప్రత్యేక వాహనాన్ని జిందాల్‌తో కలిసి సీఎం పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికీ ఉపాధి.. ప్రతి యువతకీ ఉద్యోగం

- అడిడాస్ నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ వరకు కుప్పానికి కంపెనీల క్యూ
- కుప్పం ఒకప్పుడు మారుమూల ప్రాంతం... ఇప్పుడు అభివృద్ధి కేంద్రం
- 'స్వర్ణ కుప్పం-పెట్టుబడుల వేదిక' బహిరంగ సభలో సీఎం చంద్రబాబు
- రూ.9,322 కోట్ల పెట్టుబడుల అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి
- గుడుపల్లెలో వివిధ పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, వర్చువల్ శంకుస్థాపనలు, ఎంవోయూలు



కుప్పం (చైతన్యరథం): గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసినప్పుడు కంటే మించిన సంతోషం కుప్పంలో కంపెనీలకు శంకుస్థాపనలు చేస్తున్నప్పుడు కలుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులు, అత్యాధునిక పరిశ్రమలకు గమ్యస్థానంగా కుప్పం వేగంగా రూపుదిద్దుకుంటోందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ సంస్థ నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ ట్రైనింగ్ విమానాల తయారీ వరకు కుప్పానికి కంపెనీలు క్యూ కడుతున్నాయని సీఎం పేర్కొన్నారు. గుడుపల్లె మండలం పొగురుపల్లిలో శుక్రవారం నిర్వహించిన 'స్వర్ణ కుప్పం-పెట్టుబడుల వేదిక' బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొని వివిధ పరిశ్రమలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. అదే వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) సమక్షంలో పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. భారీ పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలకు మార్గం సుగమం చేసే ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 పరిశ్రమలు కుప్పంలో ఏర్పాటు కానున్నాయని ప్రకటించారు. ఈ పరిశ్రమల ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుందని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ పరిశ్రమలను కుప్పానికి తీసుకురావడమే తన లక్ష్యమని, కుప్పాన్ని దేశంలోనే ఆదర్శ పారిశ్రామిక నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కుప్పంలో పరిశ్రమలకు ఒకేసారి శ్రీకారం చుట్టడం అంతకంటే ఎక్కువ సంతృప్తినిచ్చింది అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## కుప్పం చరిత్రలో ప్రత్యేక ఘట్టం

కుప్పం ప్రజలే తనకు శ్రీరామరక్ష అని ఎక్కడ ఉన్నా తన ఆలోచనలు కుప్పంపైనే ఉంటాయని సీఎం చెప్పారు. ఒకే వేదికపై ఇంత పెద్ద సంఖ్యలో పరిశ్రమలు కుప్పానికి రావడం చరిత్రలోనే ప్రత్యేక ఘట్టమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ ఉపాధి, ప్రతి యువకుడికీ ఉద్యోగం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన మానవ వనరులను ప్రభుత్వం సిద్ధం చేస్తుందని, ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని ఆకాం క్షించారు. 44 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఎంఎస్‌ఎంఈ పార్కులో 167 పారిశ్రామిక ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయని, యువత కాలేజీ దశ నుంచే ఉద్యోగాల కోసం కాకుండా వ్యాపార అవకాశాల కోసం ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే 1.49 లక్షల మంది డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని గుర్తు చేశారు.

కుప్పం జీఎస్‌డీపీ 38 శాతం పెరిగిందని, తలసరి ఆదాయం రూ.2.11 లక్షలకు చేరిందని ముఖ్యమంత్రి తెలిపారు. హంద్రీ-నీవా ద్వారా సాగునీరు, డ్రిప్ ఇరిగేషన్, పాల ఉత్పత్తి పెరిగాయని, గండికోట నుంచి మరింత నీరు తీసుకొచ్చి తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కుప్పంలో 70 శాతం గ్రీన్ కవర్‌ను పరిరక్షిస్తూ పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 8వేల కుటుంబాలను దత్తత తీసుకున్నట్టు వివరించారు. పొగురుపల్లిలో అత్యుత్తమ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ అభివృద్ధి చేస్తామని, అభివృద్ధిని అడ్డుకునే శక్తులను ప్రజలు తిరస్కరించాలని సూచించారు. ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం.... ఇప్పుడు ప్రపంచ స్థాయి కంపెనీలు పెట్టుబడులకు పోటీపడుతున్న ప్రాంతంగా మారింది. ఫుట్‌వేర్ నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ వరకు, బ్యాటరీల నుంచి బయోటెక్ వరకు, ప్రపంచ స్థాయి పరిశ్రమలు కుప్పానికి రావడంతో ఈ ప్రాంత భవిష్యత్తు మారుతుందన్నారు. రాబోయే రోజుల్లో కుప్పాన్ని దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక, ఉపాధి, అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.



## శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలు ప్రకటించండి

శంకుస్థాపన సందర్భంగా ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడారు. ఆయా సంస్థల పురోగతి, ఉత్పత్తులు, పెట్టుబడులపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇస్తూ శంకుస్థాపన జరిగిన రోజునే ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేసుకుని ఆ లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి సూచనతో పలు కంపెనీల ప్రతినిధులు వేదికపైనే తమ పరిశ్రమల ప్రారంభోత్సవ తేదీలను ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వేగవంతమైన సహకారం చూసిన తర్వాత ప్రాజెక్టులను మరింత త్వరగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలిగిందని పారిశ్రామిక వేత్తలు తెలిపారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, కుప్పం స్థానిక నేతలు పాల్గొన్నారు.







# పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా వర్క్ ఫోర్స్

- ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలి
- పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది... సద్వినియోగం చేసుకునే బాధ్యత ప్రజలది
- కుప్పంలో ఏబీఐఎస్ ప్రోటీన్స్, ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- రూ.200 కోట్ల పెట్టుబడితో ఏబీఐఎస్ ప్రోటీన్స్ చెందిన చికెన్ ప్రాసెసింగ్ యూనిట్





కుప్పం (చైతన్యరథం): మూడు రోజుల పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం కుప్పం నియోజకవర్గానికి చేరుకున్నారు. జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం  ఆయన నేరుగా కుప్పం వచ్చారు. నియోజకవర్గంలోని గుడుపల్లె మండలం పొగురుపల్లెలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ.200కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఏబీఐఎస్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చికెన్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు  ఏపీఐఐసీ ధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఎంఎస్ఎంఈ పార్క్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ రెండు ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి, రైతులకు మార్కెట్, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించనున్నాయి. గుడుపల్లె మండలం పొగురుపల్లె గ్రామంలో 30.75 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఏబీఐఎస్ ప్రోటీన్స్ గ్రీన్‌ఫీల్డ్ పౌల్ట్రీ, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. ఈ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు ప్లాంట్ పనితీరును  పరిశీలించారు. ప్లాంట్లో ఏయే విభాగాలు ఏ విధంగా పని చేస్తాయన్న అంశాన్ని చంద్రబాబుకు కంపెనీ యాజమాన్య ప్రతినిధులు వివరించారు. ఆ సంస్థ నిర్వహించిన జాబ్ ఫెయిర్‌లో ఉద్యోగాలు పొందిన యువతకు సీఎం నియామక పత్రాలు అందించారు.

ఆ సంస్థ ఈ నెల నుంచే వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించనుంది. ఈ పరిశ్రమ ద్వారా మొత్తం 1,400 మందికి ఉపాధి లభించనుండగా... 700 ప్రత్యక్ష, 700 పరోక్ష ఉద్యోగాలు ఉన్నాయి. ప్రారంభ దశలోనే 300 నుంచి 400 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ యూనిట్ ద్వారా స్థానిక పౌల్ట్రీ రైతులకు గిట్టుబాటు ధరలకు మార్కెట్ లభించడంతో పాటు ఒప్పంద పద్ధతిలో కోళ్ల పెంపకానికి అవకాశాలు ఏర్పడనున్నాయి. ఫీడ్ సరఫరా, రవాణా, అనుబంధ రంగాలకు కూడా ఈ పరిశ్రమ ఊతం ఇవ్వనుంది. పొగురుపల్లెలో 44.58 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఎంఎస్ఎంఈ పార్కును కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ పార్కులో 167 పారిశ్రామిక ప్లాట్లను  జూలై నెల నుంచే పారిశ్రామికవేత్తలకు కేటాయింపు ప్రక్రియ ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులను ఒకేచోట కల్పించడం ద్వారా కొత్త పరిశ్రమలు వేగంగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీనివల్ల స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు... కుప్పం పారిశ్రామిక హబ్‌గా మరింత వేగంగా అభివృద్ధి చెందేందుకు ఈ పార్క్ దోహదపడనుంది. ఇక 7,489 మంది ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూరేలా రూ.28 కోట్లతో ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టును సీఎం ప్రారంభించారు. కనమానపల్లి, గంగాపురం, టి.సముద్రం, కృష్ణానగర్, బళ్ల గ్రామాల్లో రూ.25కోట్లతో రెస్కోకు చెందిన ఐదు సబ్ స్టేషన్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

### పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం

కుప్పం చేరుకున్న ముఖ్యమంత్రికి ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు, ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పొగురుపల్లెకు బయల్దేరిన సీఎంకు దారి పొడవునా గ్రామస్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'కుప్పం నియోజకవర్గ చరిత్రలో ఇవాళ మరిచిపోలేని రోజు. ఏబీఐఎస్ ప్రోటీన్స్ సంస్థ ఇప్పటికే 400 మందికి ఉపాధి కల్పించింది. గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఆధునిక టెక్నాలజీతో దేశంలో అతి పెద్ద చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉంది. స్థానిక కోళ్ల పెంపకందారులు ఈ సంస్థ ద్వారా లబ్ధి పొందుతారు. రైతులకు ప్రయోజనం కలగడంతో పాటు  పరోక్షంగా చాలా మందికి ఉపాధి లభిస్తుంది. చాలా తక్కువ సమయంలో ఈ ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి కార్యకలాపాలను ప్రారంభించేలా చేసినందుకు సంస్థకు అభినందనలు. కుప్పం నియోజకవర్గానికి రైల్, రోడ్, ఎయిర్ కనెక్టివిటీని పెంచుతున్నాం. ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు.. జీవన ప్రమాణాలను పెంచేలా పరిశ్రమలు తెచ్చాం. వస్తున్న పరిశ్రమలకు అనుగుణంగా వర్క్ ఫోర్స్ కూడా సిద్ధం కావాలి. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో దృష్టి పెట్టాలి. కుప్పానికి పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది...దాన్ని అందిపుచ్చుకునే బాధ్యత ప్రజలది. పరిశ్రమలు, సేవా, వ్యవసాయ రంగాల్లో కుప్పాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పులివెందులలో లింగాల మండలంలో ఉద్యాన పంటలపై దృష్టి పెడితే.. అక్కడి ప్రజలు దాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వారి తలసరి ఆదాయం రూ. 7.30 లక్షలు. రాయలసీమకు పూర్వోదయ ప్రాజెక్టును తెస్తాం. యువత ఉద్యోగాలు చేయడమే కాదు.. ఉద్యోగాలిచ్చే స్థితికి చేరాలి. నైపుణ్యాలు పెంచుకుని.. వినూత్నంగా ఆలోచిస్తే యువత అభివృద్ధి సాధ్యమవుతుంది." అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, చిత్తూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.








చైతన్యరథం



# రాష్ట్రంలో వరల్డ్ క్లాస్ స్పోర్ట్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్





- జేఎస్‌డబ్ల్యు సంస్థ సహకారంతో ఏర్పాటు చేస్తాం
- క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 3శాతం రిజర్వేషన్
- 'ఎలైట్ ప్లేయర్స్'తో మంత్రి లోకేష్ విందు సమావేశం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి వరల్డ్ క్లాస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు జేఎస్‌డబ్ల్యు సంస్థ ముందుకు వచ్చిందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. కామన్ వెల్త్, ఆసియా గేమ్స్ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఎలైట్ ప్లేయర్స్‌తో శుక్రవారం రాత్రి ఆయన ఉండవల్లిలోని తన నివాసంలో డిన్నర్ మీట్ నిర్వహించారు. ఆద్యంతం ఆహ్లాదంగా సాగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై క్రీడాకారుల నుంచి సలహాలు స్వీకరించారు. క్రీడాకారుల కుటుంబ నేపథ్యం, ప్రారంభంలో వారు ఎదుర్కొన్న సవాళ్లు, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహం వంటి వాటిపై క్రీడాకారులను వాకబుచేశారు. పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ... గతంలో ఆంధ్రప్రదేశ్‌లో మంచి కోచ్‌లు ఉండేవారని, 2019లో ప్రభుత్వం మారాక వారందరినీ తొలగించారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అప్పట్లో గుంటూరులో చంద్రబాబు విదేశీ కోచ్ లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీనికి మంత్రి లోకేష్ స్పందిస్తూ... పాలకులు మారినా పాలసీలు మారకూడదన్నారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచ స్థాయి అత్యుత్తమ కోచ్‌లను ఏపీలో ఏర్పాటుచేసి... సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తీసుకొస్తామన్నారు. రాష్ట్ర అత్యుత్తమ క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు జేఎస్‌డబ్ల్యు సంస్థ అంగీకారం తెలిపిందని, ఇందుకు అవసరమైన ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆస్ట్రేలియాలో గ్రిఫిత్ యూనివర్సిటీ విద్యతో క్రీడలకు ప్రత్యేక శిక్షణ అందిస్తోందని తెలిపారు. అక్కడ కరిక్యులమ్‌ను అథ్లెటిక్స్‌కు అనుగుణంగా రూపొందించారన్నారు.

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. స్పోర్ట్స్ ట్రైనింగ్, ఎడ్యుకేషన్‌పై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నామన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్... క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలనూ ప్రోత్సహిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ ఎకో సిస్టమ్ అభివృద్ధికి తాము పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ ఎరెనా ఉండాలన్నదే తమ అభిమతంగా పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహించడంపై తల్లిదండ్రుల్లో కూడా అవేర్‌నెస్ రావాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగానే గతేడాది నిర్వహించిన డీఎస్సీలో తొలిసారిగా క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ అమలుచేశామని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామ న్నారు. మహిళా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామన్నారు. విశాఖ క్రికెట్ స్టేడియంలో ఒక స్టాండ్ కు భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరుపెట్టామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'గా ప్రకటించి విద్యార్థుల ఆసక్తి మేరకు వారిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మాట్లాడుతూ... కొరియాలో ఆర్చరీ క్రీడాకారులకు రోబోతో ముందస్తు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. స్పోర్ట్స్ ఆడే సమయంలో క్రీడాకారులు గాయపడినపుడు రికవరీ చాలా ముఖ్యమని, దేశంలో కొన్నిచోట్ల మాత్రమే రికవరీ సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది భారత అథ్లెట్లు 26 జాతీయ రికార్డులను బ్రేక్ చేశారని క్రీడాకారులు చెప్పగా... లోకేష్ అభినందనలు తెలిపారు. సింగపూర్ స్పోర్ట్స్ కాలేజీలో ఏఐ ద్వారా బౌలింగ్‌ను కోచ్‌లు పర్యవేక్షించడం చూశానన్నారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించుకుని అందుకు అనుగుణంగా మారాలని క్రీడాకారులకు సూచించారు. తాము తమ కేడర్ శిక్షణలో భాగంగా వారి ఆరోగ్య పరిస్థితులు, ఫిట్‌నెస్‌ను ఏఐ ద్వారా ఎసెస్ చేస్తున్నామని చెప్పారు.

డిన్నర్ మీట్‌లో కామన్ వెల్త్, ఆసియా గేమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు... పీవీ సింధు (బ్యాడ్మింటన్), సాత్విక్ సాయిరాజ్ (బ్యాడ్మింటన్), జ్యోతికశ్రీ (అథ్లెటిక్స్), భవానీ కార్తీక్ (పారా స్విమ్మింగ్), వెంకటరామిరెడ్డి (అథ్లెటిక్స్), ఆర్.స్వాతి (అథ్లెటిక్స్), భవానీయాదవ్ (అథ్లెటిక్స్), కుసుమ రావాడ (అథ్లెటిక్స్), గణేష్ మణిరత్నం (ఆర్చరీ), రష్మి (అథ్లెటిక్స్), మల్లల అనూష (అథ్లెటిక్స్), శిరీష (అథ్లెటిక్స్), కుంజా రజిత (అథ్లెటిక్స్), యుక్తశ్రీ (ఆర్చరీ), తీర్థసామదేవ్ (స్విమ్మింగ్) పాల్గొన్నారు.

### క్రీడాకారులకు ఆర్థిక సాయం మంజూరు

ఈ ఏడాది ఆసియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్, పారా కామన్ వెల్త్ గేమ్స్‌కు ఎంపికైన 18 మంది అథ్లెట్ల శిక్షణ కోసం ప్రభుత్వం రూ.2.23 కోట్లు విడుదల చేసింది. క్రీడాకారుల అవసరాన్ని బట్టి మరింత సాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి రాష్ట్రాన్ని ప్రపంచ క్రీడాపటంలో నిలపాలని మంత్రి లోకేష్ కోరారు.

















# డిన్నర్ మీట్ విత్ ఎలైట్ ప్లేయర్స్

***కామన్ వెల్త్, ఆసియా గేమ్స్‌లో పాల్గొనబోతున్న ఎలైట్ ప్లేయర్స్‌కు మంత్రి నారా లోకేష్ శుక్రవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో డిన్నర్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల మనోగతాలు ఇలా ఉన్నాయి.***



**పతకం సాధించకమునుపే ప్రోత్సాహం : భవానీ కార్తిక్, ఏషియన్ పారా గేమ్స్ సిల్వర్ మెడలిస్ట్**

చక్రదారపల్లిలో నారా చంద్రబాబునాయుడు ప్రారంభించిన వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 2019లో నా స్విమ్మింగ్ ప్రయాణం మొదలైంది. 2020 వరకు అక్కడే శిక్షణ పొంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. కొవిడ్ కారణంగా అకాడమీ తాత్కాలికంగా మూతపడినా నా సాధన మాత్రం ఆగలేదు. అనంతరం 'శాప్' స్విమ్మింగ్ పూల్‌లో నిరంతరం ప్రాక్టీస్ కొనసాగించాను. ఆ కృషి ఫలితంగా 2024 జాతీయ పారా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించాను. అనంతరం జరిగిన ఏషియన్ పారా గేమ్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి రజత పతకం గెలుచుకున్నాను. క్రీడల్లో రాణించడం కష్టమని చాలా మంది భావిస్తారు. కానీ ప్రతిభతో పాటు సరైన ప్రభుత్వ ప్రోత్సాహం, అవకాశాలు ఉంటే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చనడానికి నా ప్రయాణమే నిదర్శనం. సాధారణంగా పతకం గెలిచిన తర్వాతే క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుంది. అయితే మన రాష్ట్రంలో మంత్రి నారా లోకేష్... పతకం సాధించక ముందే క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తున్నారు. మాతో కలిసి డిన్నర్ చేయడం, ఆత్మీయంగా మాట్లాడడం, మా లక్ష్యాల గురించి తెలుసుకోవడం వంటి కార్యక్రమాలు మాలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. ఇలాంటి ప్రోత్సాహం ప్రతి క్రీడాకారుడికి గొప్ప ప్రేరణ.

**స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలిచ్చి అండగా నిలుస్తున్నారు: వెంకటరామిరెడ్డి, అండర్-20 ఏషియన్ అథ్లెటిక్స్ గోల్డ్ మెడలిస్ట్**

ప్రతిభ, పట్టుదలతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే గొప్ప విజయాలు సాధించవచ్చని నా ప్రయాణం నిరూపించింది. ఆ ప్రోత్సాహంతోనే 2026 అండర్-20 ఏషియన్ అథ్లెటిక్స్‌లో స్వర్ణ పతకం సాధించాను. ప్రస్తుత ప్రభుత్వం క్రీడాకారులకు క్యాష్ ఇన్సెంటివ్‌లు, అవార్డులు, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కల్పిస్తూ అండగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి నేరుగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం క్రీడాకారుల భవిష్యత్తుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చూపిస్తోంది. ఇలాంటి ప్రోత్సాహం ప్రతి క్రీడాకారుడికీ మరింత స్ఫూర్తినిస్తుంది.

**మౌలిక వసతులు కల్పించాలి: యుక్తశ్రీ, ఎన్‌టీపీసీ జాతీయ ఆర్చెరీ చాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్**

మంత్రి నారా లోకేష్ క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. క్రీడల్లో రాణించాలంటే ప్రతిభతో పాటు అవకాశాలు, ప్రభుత్వ మద్దతు చాలా ముఖ్యం. ప్రత్యేకత ఏమిటంటే... ప్రభుత్వం మా దగ్గరకే వచ్చి క్రీడాకారులకు ఏమి అవసరమో, ఇంకా ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయో మా అభిప్రాయాలను తెలుసుకుంటోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి దేశానికి పేరు తీసుకురావడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించ డంతో పాటు ప్రోత్సాహం అందిస్తోంది. దీనివల్ల మాలో ఆత్మవిశ్వాసం, మరింత మెరుగైన విజయాలు సాధించాలనే సంకల్పం పెరుగుతోంది.

**మంత్రి లోకేష్ ప్రోత్సాహం మరువలేనిది: తీర్థసామదేవ్, 79వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్**

మంత్రి నారా లోకేష్ క్రీడాకారుల సమస్యలను తెలుసుకుని వారికి మరింత ప్రోత్సాహం అందించేందుకు మాతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడటం ఎంతో ఆనందంగా అనిపించింది. చిన్న వయసులోనే విద్యార్థులు క్రీడలపై దృష్టి సారిస్తే వారి వ్యక్తిత్వ వికాసంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతాయి. అందుకే పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'నో బ్యాగ్ డే' వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి క్రీడల్లో రాణించేందుకు ముందడుగు వేయాలి. ప్రస్తుతం ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సాహిస్తూ అవకాశాలు కల్పిస్తోంది. వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను.

**వ్యక్తిగతంగా గుర్తించి అభినందించడం ఇదే మొదటిసారి: జ్యోతికశ్రీ, ఏషియన్ అథ్లెటిక్స్ గోల్డ్ మెడలిస్ట్**

నేను 12 సంవత్సరాలుగా అథ్లెటిక్స్‌లో కొనసాగుతున్నాను. ఈ ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించినప్పటికీ, ఇంతకు ముందు నాకు ఈ స్థాయిలో ప్రోత్సాహం లేదా వ్యక్తిగత గుర్తింపు లభించలేదు. నా ప్రతిభను గుర్తించి ప్రత్యేకంగా పిలిచి మాట్లాడటం, అభినందించడం ఇదే మొదటిసారి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడాకారులకు అన్ని విధాలా మద్దతు లభిస్తోంది. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ మాతో వ్యక్తిగతంగా సమావేశమై మా అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఇలాంటి ప్రోత్సాహం, సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగితే నేను మాత్రమే కాదు రాష్ట్రంలోని ప్రతి క్రీడాకారుడు మరింత ఉత్సాహంతో శ్రమించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరిన్ని పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్‌కు గొప్ప పేరు తీసుకొస్తారని విశ్వసిస్తున్నాను.

**కూటమి ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోంది: రావాడ కుసుమ, ఇండియన్ ఓపెన్ జంప్స్ పోటీ బ్రాంజ్ మెడలిస్ట్**

ఇప్పటివరకు నాకు ఏ ప్రభుత్వం సపోర్ట్ ఇవ్వలేదు. నా అంతట నేను నా ప్రతిభతో ముందుకు నడిచాను. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. యువత భవిష్యత్ ఉన్నత స్థాయికి వెళ్ళాలంటే క్రీడలు కూడా ఒక మార్గం. మన ప్రతిభను బయటకు తీసి కనబరిస్తేనే మన రాష్ట్రానికి గొప్ప పేరు వస్తుంది. ఇందుకోసం నారా లోకేష్ ఎంతగానో కృషి చేస్తున్నారు. భవిష్యత్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచి మన ఆంధ్ర రాష్ట్రానికి గొప్ప పేరు తీసుకురావడమే నా ఆకాంక్ష.

**మా సలహాలు తీసుకోవడం ఆనందం: మల్లల అనూష, జాతీయ ఇండోర్ అథ్లెటిక్స్ గోల్డ్ మెడలిస్ట్**

గతంలో ఎన్నడూ లేని విధంగా నారా లోకేష్ మాతో ఇంటరాక్ట్ అయ్యి మా సమస్యలు అడిగారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ఏం చేస్తే బాగుంటుంది అనే సలహాలు మా నుంచి తీసుకోవడం ఆనందంగా ఉంది. క్రీడాకారులకు ప్రభుత్వం ఇస్తున్న మద్దతు అభినందనీయం. ఇలానే మమ్మల్ని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మెరుగైన ప్రదర్శన కనబరుస్తాం.

**మహిళా క్రీడాకారులకు 33శాతం ప్రోత్సాహం సంతోషం: ఎం.శిరీష, అండర్-23 అథ్లెటిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్**

నేను 12 సంవత్సరాలుగా క్రీడల్లో ఉన్నాను. శ్రీకాకుళం నుంచి వచ్చిన నాకు నేటి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ముఖ్యంగా నారా లోకేష్ మహిళా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయం. మన రాష్ట్రంలో మహిళా క్రీడాకారులకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తోంది. మాకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ఎంతో సంతోషకరంగా ఉంది. ఇటువంటి అవకాశాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి లోకేష్‌కి, 'శాప్'కి ప్రత్యేక ధన్యవాదాలు.











చైతన్యరథం



# మంగళగిరి క్షేత్రానికి మహర్దశ

**దిగువ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన యాగశాల నిర్మాణం**

**- వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణం**

**- శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణకు భూమి పూజ**

**- రూ.6.3 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి లోకేష్**





మంగళగిరి (చైతన్యరథం): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంగళగిరి దిగువ సన్నిధిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రి ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం నూతన యాగశాల నిర్మాణంతో పాటు వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణం, శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ పనులకు మంత్రి లోకేష్ భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆలయ అధికారులు ఏర్పాటుచేసిన నమూనా చిత్రాలను పరిశీలించారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామిని, రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మంత్రికి అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దేవాదాయ శాఖ నిధులు రూ.6.3 కోట్లతో శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణతో పాటు యాగశాల, గంటా మండపం, వాహనశాల పునర్నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. మంత్రి లోకేష్ ఆలయం మొత్తం కలియతిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు కావాల్సిన వసతులు, ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా ఆయా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కల్పించడంతో పాటు నిత్య ప్రసాదానికి చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరిణిని పరిశీలించి పలు సూచనలు చేశారు.

అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందరితో కలిసి ఫొటోలు దిగారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనరు కె.రామచంద్ర మోహన్, ఆలయ ఈవో కోగంటి సునీల్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయ్, టీడీపీ గుంటూరు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి పట్టణ శాఖ అధ్యక్షుడు పడవల మహేష్, తాడేపల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.













# ప్రతిధ్వనించిన 'జై అమరావతి' నినాదం

**- రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభోత్సవంలో సీఎంతో పాటు నినదించిన జనం**

**- స్థిరమైన వ్యక్తిత్వం లేకుండా రోజుకో ప్రాంతాన్ని రాజధాని అంటున్నారని జగన్‌కు చంద్రబాబు చురక**

కడప (చైతన్యరథం): రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జై అమరావతి నినాదం ప్రతిధ్వనించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు సభకు విచ్చేసిన జనమంతా జై అమరావతి అంటూ నినదించారు. రాష్ట్ర ప్రజలంతా గర్వంగా కాలరెగరేసి చెప్పుకునేలా అమరావతి రాజధానిని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలకులు విధ్వంసమే అజెండాగా పనిచేశారని, విశ్వసనీయత లేని పార్టీకి విలువలూ లేవని వ్యాఖ్యానించారు. అమరావతి రాజధానిగా అంగీకరించి అధికారంలోకి కాగానే మూడు ముక్కలాట ఆడారన్నారు. కేంద్రం చట్టం చేసిన తర్వాత మావిగన్ అంటూ డ్రామాలు మొదలు పెట్టారని... నిన్న విజయవాడ అన్నారని, రేపు ఏమంటారో తెలీదని సీఎం వ్యాఖ్యానించారు. నమ్మకంతో, విశ్వాసంతో పాలన అందిస్తున్నాం కాబట్టే పెట్టుబడులు వస్తున్నాయని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానంతో ఆటలు ఆడుకోవద్దని హితవు పలికారు. గత పాలనలో మన రాజధాని ఏమిటో ఎక్కడుందో కూడా చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని, ప్రజల్ని తీవ్రంగా నష్టపరిచారని ఆక్షేపించారు.









## సీనియర్ జర్నలిస్టు పుట్టా శ్రీనివాసరావు మృతికి మంత్రి నారా లోకేష్ సంతాపం

మంగళగిని (చైతన్యరథం): మంగళగిరికి చెందిన సీనియర్ జర్నలిస్టు, సాహితీవేత్త పుట్టా శ్రీనివాసరావు మృతికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సంతాపం తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సుదీర్ఘకాలం పాత్రికేయ బాధ్యతలు నిర్వహించడమే కాకుండా, సాహిత్య, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారన్నారు. శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.



## పరిశ్రమల హబ్‌గా రాయలసీమ




అమరావతి (చైతన్యరథం): 'సీమ ప్రజల దశాబ్దాల కల నెరవేర్చడంలో భాగంగా రాయలసీమ స్టీల్‌ప్లాంట్ పనుల ప్రారంభంతో మరో చారిత్రాత్మక అడుగు వేశాం. ఇచ్చిన మాట ప్రకారం క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేశాం. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రాయలసీమ ప్రాంతం ఒక మేజర్ ఇండస్ట్రియల్ హబ్‌గా మారబోతోంది. జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లిలో రెండు మిలియన్ టన్నుల సామర్థ్యంతో గ్రీన్ స్టీల్‌ప్లాంట్, 350 మెగావాట్ల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ప్లాంట్, విజయనగరంలో జేఎస్ డబ్ల్యూ పారిశ్రామిక పార్కు పనులకు ఇవాళ శ్రీకారం చుట్టాం. ఏపీని అభివృద్ధి పథాన నిలపాలన్న కూటమి ప్రజా ప్రభుత్వ ఉక్కు సంకల్పానికి నిదర్శనం ఈ స్టీల్ ప్లాంట్. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ఏపీని మళ్లీ ప్రగతిపథంలో నిలుపుతాం.' అంటూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు.

# వికాశకులు విలన్లు..
# విధ్వంసకులు హీరోలా..?

- ఏపీ పునఃనిర్మాణ స్థాపకుడు చంద్రబాబుపై విమర్శలా?
- సజ్జలా.. రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పు
- అమరావతిపై పూటకో మాట, గడియకో అబద్ధం మానుకోరా?
- ఎవరెన్ని కుట్రలు పన్నినా అమరావతి అజేయం... శాశ్వతం
- 'సకల సజ్జల'కు మంత్రి పార్థసారథి స్ట్రాంగ్ కౌంటర్



అమరావతి (చైతన్య రథం): ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ సకల సజ్జల అవాకులు, చెవాకులు పేలడం హాస్యాస్పదంగా ఉందని గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రాజధాని పేరుతో కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని చెప్పిన సజ్జల, కళ్లు పెట్టుకుని ఒక్కసారి అమరావతిలో పర్యటించి, జరుగుతున్న పనులను చూడాలని సవాల్ విసిరారు. రాజధాని పేరుతో ఎంతైనా దోచుకోవచ్చని సజ్జల వ్యాఖ్యానించడం.. వైసీపీ సహజమైన దోచుకునే బుద్ధిని బయటపెట్టుకోవడమేనని కౌంటరిచ్చారు. "అధికారంలో ఉన్నపుడు మూడు రాజధానులు అన్నారు. అంటే ఇంకా అత్యధికంగా మూడు ప్రాంతాలను దోచుకుందామనే ఉద్దేశంతోనే ఆ ప్రతిపాదన చేశారా? రాష్ట్ర ప్రజలకు ఈ విషయంపై సజ్జల సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నా" అని మంత్రి కొలుసు ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే ఆరోపణలు చేస్తున్నారంటున్న సజ్జల..... ఊరికే ఆరోపణలు ఎవరూ చేయరని, తప్పులు చేసిన వారిపైనే ఆరోపణలు చేస్తారనే విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. ఐదేళ్లపాటు అమరావతిని నిట్టనిలువునా కూల్చేసిన వైసీపీ.. నేడు అమరావతి గురించి నీతివాక్యాలు వల్లించడం, రాష్ట్రాభివృద్ధి గురించి మాట్లాడడం నీతిమాలిన బుద్ధికి నిదర్శనమని ఘాటుగా వ్యాఖ్యానించారు. "రాజధానికి అమరావతి నేల పనికిరాదన్నారు. మరి మీ నాయకుడు చెప్పిన మావిగన్‌లో గుంటూరు కూడా ఉందన్న విషయం మీకు తెలియదా? అమరావతి గుంటూరు జిల్లాలో ఉందన్న ఇంగితజ్ఞానం లేదా? మీకు గుంటూరు జిల్లా రాజధానిగా కావాలి. కానీ అమరావతిలో వద్దు అంటే.... మీకు అమరావతి అంటే పూర్తిగా విద్వేష భావజాలం. అమరావతిలో భూములు ఇవ్వని రైతులు ఇబ్బందిపడుతున్నారని మీరు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది. ఐదేళ్లపాటు అమరావతి రైతులను నిర్బంధాలు,అక్రమ అరెస్టులు, అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు, కక్షసాధింపులతో ఎంత ఇబ్బందిపెట్టాలో అంత ఇబ్బందిపెట్టిన మీరు రైతులు ఇబ్బందిపడుతున్నారని చెప్పడం మీ ద్వంద్వ వైఖరికి నిలువుటద్దం. అమరావతి అసాధ్యమని అంటున్న సజ్జల అమరావతి అజేయం.... శాశ్వతమనే విషయాన్ని కలలో కూడా మరచిపోవద్దని" హెచ్చరించారు.

చంద్రబాబు విలన్‌లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేసిన సజ్జల రామకృష్ణారెడ్డి.. ఏవిధంగా చంద్రబాబు విలన్ అయ్యారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తే విలన్ అవుతారా? రాష్ట్రంలో నిలిచిపోయిన పోలవరంలాంటి ప్రాజెక్టులను పరుగులు పెట్టిస్తే విలన్ అవుతారా? ఐదేళ్లు కుప్పకూల్చిన అమరావతికి ప్రాణం పోసి బ్రతికించడంవల్ల విలన్ అయ్యారా? సీఎంఆర్ఎఫ్‌తో పేదవారి ప్రాణాలను నిలబెడుతున్నందుకు విలన్ అయ్యారా? యువతకు 20 లక్షల ఉద్యోగాలు తెచ్చేందుకు నిద్రలేని రాత్రులు గడుపుతున్నందుకు విలన్ అయ్యారా? గడ్డకట్టే చలిలో సైతం పెట్టుబడులను వేటాడి ఏపీకి తీసుకొచ్చినందుకు విలన్ అయ్యారా? పెన్షన్లను అమాంతం పెంచి పేదవారి కళ్లల్లో ఆనందం నింపినందుకు విలన్ అయ్యారా? ఐదేళ్లు రోడ్లకు మీరు పెట్టిన పెద్దపెద్ద గుంతలు పూడ్చి, కొత్త రోడ్లు వెయ్యడంవల్ల విలన్ అయ్యారా? రాష్ట్ర భవిష్యత్తును నిలబెడుతున్నందుకు విలన్ అయ్యారా? ఏం చెయ్యడం వల్ల చంద్రబాబు విలన్ అయ్యారో సజ్జల, జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని గట్టిగా నిలదీశారు. మీ దృష్టిలో రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంతో ముందుకు తీసుకెళుతుంటే విలన్లు...... రాష్ట్రాన్ని జేసీబీలతో కుప్పకూలిస్తే హీరోలని రాష్ట్ర ప్రజలకు కూడా అర్థమైంది. పోలీసు వ్యవస్థను కూటమి ప్రభుత్వం వాడుకుని ప్రశ్నించిన వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతోందని సజ్జల నిస్సిగ్గుగా మాట్లాడడం దారుణం. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు పోలీసులను ప్రైవేటు సైన్యంగా మార్చలేదా? సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లి అక్రమ అరెస్టులు చెయ్యలేదా? ఆడబిడ్డలు బెడ్‌రూమ్‌లో పిల్లలకు పాలు ఇస్తున్నారని కూడా చూడకుండా ప్రశ్నించిన వారిని అరెస్టులు చెయ్యలేదా? అక్రమ కేసులు పెట్టలేదా? చివరకు ఐపీఎస్ అధికారులను కూడా అనధికార కార్యక్రమాలకు వాడి వారి భవిష్యత్తును అంధకారం చేసింది మీరు కాదా? ఈరోజు పోలీసుల గురించి మీరు మాట్లాడటం నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న చందంగా ఉంది. జగన్మోహన్ రెడ్డి తలకిందులుగా తపస్సు చేసినా.... మావిగన్ కాదు ఎన్ని గన్నులతో ప్రతిపాదనలు తెచ్చినా... ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా.... రాష్ట్రమంతా అమరావతితోనే ఉంటుంది. అమరావతి అజేయం... అమరావతే శాశ్వతం.... అమరావతిని పీకేస్తాం అనడం కాదు... అమరావతిలో చిన్న మొక్క కూడా పీకలేరని మంత్రి కొలుసు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఐదు కోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతిపై పూటకొకమాట, గడియకొక అబద్ధం, నిమిషానికొక విష ప్రచారంతో జగన్మోహన్ రెడ్డి, వైసీపీ పార్టీ నేతలు రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురిచేయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు మధ్యే నిర్మాణమవుతున్న రాజధానికి మావిగన్ అనే పేరు పెట్టి తాను ఏదోక కొత్త ప్రతిపాదన చేసినట్టు జగన్ బిల్డప్ ఇవ్వడం సిగ్గుచేటు. రాష్ట్రానికి రాజధాని అక్కర్లేదు అని భావించే జగన్.... తాను సీఎంగా ఉన్న ఐదేళ్లలో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన విషయాన్ని మర్చిపోయారా? విశాఖ రాజధాని అని చెప్పి, తన సామంతరాజులను విశాఖలో దింపి, పేదవారి భూములన్నీ కబ్జాచేసి, వేలాది ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసిన విషయాన్ని జగన్ విస్మరిస్తున్నారా? జగన్ తన అరాచకాలకు, దోపిడీలు, కబ్జాలకు అడ్డుపడుతున్నాడనే కారణంతో సాక్షాత్తూ వైసీపీ ఎంపీనే వైసీపీ గూండాలు కిడ్నాప్ చేసిన ఘటన విశాఖలో చోటుచేసుకున్న విషయం వాస్తవం కాదా? ప్రజాధనం రూ.700 కోట్లతో తన విలాసాల కోసం రుషికొండపై ప్యాలెస్ కట్టుకున్న విషయం వాస్తవం కాదా? మొదట అమరావతిలో రాజధాని నిర్మాణానికి తాను అనుకూలమని జగన్ అసెంబ్లీ సాక్షిగా చెప్పలేదా? ఆ తర్వాత మూడు రాజధానుల పాట పాడలేదా? అధికారం కోల్పోయేసరికి తాను అమరావతికి వ్యతిరేకం కాదని మడమను 360 డిగ్రీల కోణంలో తిప్పలేదా? మళ్లీ ఇప్పుడు రెండు రోజుల క్రితం మావిగన్‌కి కట్టుబడి ఉన్నానని అనలేదా? ఇలా ప్రకటించిన రెండో రోజునే ఏపీ రాజధానిగా విజయవాడేనని జగన్ ప్రకటించలేదా? తన మతిలేని ప్రవర్తనతో రాష్ట్ర ప్రజలను ఇలా గందరగోళానికి గురిచేయడం చూస్తుంటే.. జగన్‌ను నమ్ముకున్నవాళ్లు కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్టేనని మంత్రి ఎద్దేవా చేశారు. ఏపీ పునర్మిర్మాణంలో భాగంగా నిర్మాణాత్మక అభివృద్ధి సాధిస్తోన్న సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేసే అడ్డదిడ్డమైన విమర్శలకు ప్రజలే బుద్ధిచెబుతారని మంత్రి కొలుసు హెచ్చరించారు.

## స్వచ్ఛ భారత్ మిషన్ తాజా నిబంధనల ప్రకారం

- సిమెంట్ కంపెనీలు 6 శాతం ఆర్డీఎఫ్ వినియోగించాలి
- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

విజయవాడ (చైతన్య రథం): 2026 ఏప్రిల్ 1న జారీ అయిన స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) తాజా నిబంధనల ప్రకారం సిమెంట్ కంపెనీలు తమ ఇంధన అవసరాల్లో కొంతభాగాన్ని రాష్ట్రంలో త్వరలో ప్రారంభమయ్యే ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాలు, ప్రస్తుత బయోమైనింగ్ లెగసీ వేస్ట్ ద్వారా వచ్చే రిఫ్యూజ్ డిరైవ్డ్ ఫ్యూయల్ (ఆర్డీఎఫ్)ను తప్పనిసరిగా వినియోగించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన సిమెంట్ కంపెనీల ప్రతినిధులతో విజయవాడ గురునానక్ కాలనీలోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) కార్యాలయం పర్యావరణ్ భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెంట్ కంపెనీలు లెగసీ వేస్ట్, ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాలలో తయారయ్యే ఆర్డీఎఫ్‌లో ఆరుశాతం తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ప్రతి కంపెనీ ఎస్‌బీఎం నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. సిమెంట్ కంపెనీలు ఆర్డీఎఫ వినియోగంపై ఖచ్చితమైన టైమ్‌లైన్ అందజేయాలని కోరారు. సిమెంట్ కంపెనీలు ఆర్డీఎఫ్ వాడకానికి తగిన యంత్రాలను రిట్రోఫిటింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏ కంపెనీ ఎంత ఆర్డీఎఫ్ వినియోగిస్తున్నారో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారన్నారు. అలాగే, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక మోనిటరింగ్ సెల్‌ని కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్‌బీఎం నిబంధనల ప్రకారం ఆర్డీఎఫ్ వినియోగించని కంపెనీలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి కృష్ణయ్య చెప్పారు. సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఎండీ బి అనిల్‌కుమార్ రెడ్డి, పీసీబీ మెంబర్ ఆర్ శర్వణ, చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం రాజశేఖర్, మూడు జిల్లాల సిమెంట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



### గర్భ కండ్రిక, చుక్కల భూముల
## సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

**మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



ప్రకాశం /తూర్పు నాయుడుపాలెం (చైతన్య రథం): గర్భ కండ్రిక, చుక్కల భూముల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం టంగుటూరు మండలం తూర్పునాయుడు క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ.. 2900 ఎకరాల గర్భ కండ్రిక భూములకు హక్కులు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని, అందుకు సంబంధించిన ఉత్తర్వులు కలెక్టర్‌కి ఇవ్వడం జరిగిందన్నారు. చుక్కల భూములు, గర్భ కండ్రిక భూములతోపాటు సర్వీస్ ఇనాం భూముల సమస్యలు పరిష్కరించాలన్నారు. దయాల్ భూముల వివరాలు సేకరించి త్వరితగతిన ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. గత ప్రభుత్వం భూసమస్యలు పరిష్కరించకుండా పబ్లిసిటీ పిచ్చితో పాసు పుస్తకాలపై బొమ్మలు వేసుకుని ప్రజాధనం దుర్వినియోగం చేస్తే నేడు కూటమి ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

### తోతాపురి మామిడి రైతుల సమస్యలపై

## ఐసీఏఆర్ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ

**వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**



అమరావతి (చైతన్య రథం): తోతాపురి మామిడి రైతులుఎదుర్కొంటున్న ధరల పత నం సమస్యను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో తీసుకుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన విజ్ఞప్తికి వెంటనే స్పందించిన కేంద్రంకీలక నిర్ణయం తీసుకుందని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ పర్యటన సందర్భంగా కేంద్ర వ్యవ సాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తోతాపురి మామిడి రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారని మంత్రి తెలిపారు.రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కేంద్ర మంత్రి, ఈఅంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారని వెల్లడించారు. కమిటీలో ఐసీఏఆర్‌కుచెందిన సీనియర్ శాస్త్రవేత్తలు, ఆంధ్రప్రదేశ్ ఉద్యాన విశ్వవిద్యాలయ నిపుణులు, రాష్ట్ర ఉద్యానశాఖ అధికారులు సభ్యులుగా ఉన్నారన్నారు. తోతాపురి మామిడి సాగు ప్రాంతాలను సందర్శించి రైతులు,పల్ప్ పరిశ్రమలు,ఎగుమతిదారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రభుత్వ అధికారులతో చర్చించి సమస్యల మూలాలను అధ్యయనం చేసి ఆచరణ సాధ్యమైన సూచనలు అందించనుందని చెప్పారు. ఈ కమిటీకి రాష్ట్రప్రభుత్వం సంపూర్ణసహకారం అందిస్తుందని, అవసరమైన సమాచారం, సమన్వయం కల్పించి త్వరితగతిన నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, ఉద్యానరంగాన్ని మరింత బలోపేతం చేయడం రాష్ట్రప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తుండటంతో తోతాపురి మామిడి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తోందని, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై ఇదేవిధంగా చొరవతో చర్యలు కొనసాగిస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### దివ్యాంగుల సాధికారతపై జాతీయ

## అవార్డులకు నామినేషన్లు ఆహ్వానం

అమరావతి (చైతన్య రథం): దివ్యాంగుల సాధికారతపై జాతీయ అవార్డులకు అర్హులైన వ్యక్తులు, సంస్థల నుండి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్టు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారత విభాగం ప్రకటించినట్లు రాష్ట్ర దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్స్ శాఖ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. దివ్యాంగుల సాధికారతకు వినూత్నరీతిలో విశేష కృషి చేసి వారి జీవన విధానాన్ని మెరుగుపర్చేందుకు పాటుపడిన వారిని గుర్తించి గౌరవించే లక్ష్యంతో కేంద్రం దివ్యాంగుల సాధికారత జాతీయ అవార్డులను ఇవ్వనుందని తెలిపారు. దివ్యాంగుల సాధికారతకు సంబంధించి నేషనల్ అవార్డు ఫర్ ఇండివిడ్యువల్ ఎక్సెలెన్స్ 2026, నేషనల్ అవార్డ్స్ ఫర్ ఇనిస్టిట్యూషన్స్ ఎంగేజ్డ్ ఇన్ ఎంపవరింగ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్-2026 పేరిట జాతీయ అవార్డులను ప్రదానం చేయనుందని డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలియజేశారు. అవార్డులకు సంబంధించిన పూర్తి ఎలిజిబిలిటీ క్రైటీరియా, నామినేషన్లు పంపే విధానం తదితర వివరాలు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో జాతీయ అవార్డు మార్గదర్శకాల్లో పొందుపర్చారన్నారు. అవార్డులకు సంబంధించిన దరఖాస్తులు, నామినేషన్లను ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు అందుబాటులో ఉంటుందని డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు. రాష్ట్రంలోని అందరు జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల విభాగాధిపతులు సమాచారాన్ని క్షేత్రస్థాయి వరకూ చేరవేసి అర్హులైన వ్యక్తులు, సంస్థలనుండి దరఖాస్తులు, నామినేషన్లు సకాలంలో చేరేలా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

# ఔషధ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రత్యేక కమిటీ

- **రోగుల అవసరాలకు తగ్గట్టు తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు**
- **పరికరాలు, మిషన్ల కొనుగోలు, సరఫరాకు నిర్దిష్ట క్యాలెండర్**
- **ఆసుపత్రుల భవన నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచాలి**
- **వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి ఆదేశం**
- **సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష**



అమరావతి (చైతన్య రథం): ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేసే మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుత వ్యవస్థలో ఉన్న లోపాలను సరిచేసి, రోగులకు మందులు అందుబాటులో ఉంచడంలో ఎటువంటి ఇబ్బందిలేని విధంగా కొత్త వ్యవస్థను రూపొందించాలని మంత్రి తెలిపారు. ఇందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ నేతృత్వంలో ప్రజారోగ్య శాఖ సంచాలకులతోపాటు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సీనియర్ అధికారి, రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపిఎంఎస్ఐడిసి) అధికారి (డ్రగ్స్ విభాగం), ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులతో కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సాయంత్రం మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేసే మందులు, సర్జికల్స్, పరికరాల కొనుగోలు విధానం, పంపిణీ తీరు, ఆసుపత్రుల నిర్మాణాల పురోగతి, ఇతర అంశాలపై వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర అధికారులతో సుదీర్ఘంగా సుమారు 4 గంటలపాటు చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా ప్రభుత్వాసుపత్రులకు జరిగే మందుల కొనుగోలు, సదరు ఆసుపత్రుల ద్వారా స్థానికంగా జరిగే మందుల కొనుగోలు (లోకల్ పర్చేజ్), పంపిణీ, ఇతర అంశాలగురించి మంత్రికి వివరించారు. ఆసుపత్రుల నుంచి వచ్చే డిమాండ్ల అనుసరించి త్రైమాసిక (క్వార్టర్లీ) విధానంలో మందులను పంపుతున్నామని అధికారులు తెలిపారు. అనంతరం మంత్రి సత్యకుమార్ స్పందిస్తూ ప్రస్తుత విధానంలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు.

అన్ని కోణాలనుంచి అధ్యయనం జరగాలి

ఆసుపత్రులకు రోగులు ఎంత మంది వస్తున్నారు? ఓపీ, ఐపీ ఎలా ఉంటుంది?, మందుల అవసరం ఎలా ఉంది,? డిమాండ్లను ఎలా ప్రస్తుతం పంపుతున్నారు? అన్ని ఆసుపత్రులనుంచి వచ్చే డిమాండ్లను ఏవిధంగా క్రోడీకరిస్తున్నారు? మందుల కంపెనీలకు ఎలా ఆర్డర్లు ఇస్తున్నారు? ఎంత సమయంలో ఆసుపత్రులకు చేరుతున్నాయి? జాప్యం జరిగితే ఆసుపత్రుల మెడికల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? డిమాండుకు తగ్గట్టు మందుల సరఫరా జరుగుతోందా? లేదా? మందుల అవసరాల డేటాలో ఎంతవరకు కచ్చితత్వం ఉంటుంది? ఎక్కడెక్కడ లోపాలున్నాయి? వాటిని ఎలా మెరుగుపరచాలి? తమిళనాడులో ఎలాంటి ప్రమాణాలు అనుసరిస్తున్నారు? అక్కడి ఉత్తమ విధానాలపై కమిటీ అధ్యయనం చేయాలి. ఇతర అంశాలపై లోతుగా, క్షుణ్ణంగా అధ్యయనం చేసి, రెండు వారాల్లో ప్రభుత్వానికి కమిటీ రిపోర్టు ఇవ్వాలి" అని మంత్రి స్పష్టం చేశారు.

### పరికరాల కొనుగోలుకు క్యాలెండర్ రూపొందించాలి

ఆసుపత్రులనుంచి పరికరాలు, మిషన్ల కోసం ఏపీఎంఎస్ఐడీసీకి వచ్చే ఇండెంట్ల విధానంలోనూ మార్పులు రావాలన్నారు. ఆసుపత్రుల సూపరింటెండెంట్ల నుంచి వచ్చే పరికరాల కొనుగోలు ఇండెంట్లు, సరఫరా నిర్దిష్ట సమయంలో జరిగేలా ప్రత్యేకంగా క్యాలెండర్ విధానాన్ని రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. దీనివల్ల టెండర్లను పలుమార్లు పిలిచే అవకాశం తలెత్తదని, సుహృద్భావ వాతావరణంలో పోటీ ఏర్పడి ధరలు తగ్గే అవకాశం ఉందని మంత్రి సత్యకుమార్ సూచించారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా త్వరలో ప్రారంభించనున్న 'క్రిటికల్ కేర్' బ్లాక్‌ల నిర్మాణాల పురోగతి, సన్నాహక ఏర్పాట్లను మంత్రి అధికారులతో చర్చించారు. పూర్తయిన 9 క్రిటికల్ బ్లాక్‌ల నిర్మాణాలను, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీలను కూడా కేంద్ర మంత్రి ఏకకాలంలో ప్రారంభిస్తారని, దీనికి అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టంచేశారు. సమీక్షా సమావేశంలో ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ రూ.44 కోట్లతో చేపట్టిన 150 ఆయుష్ డిస్పెన్సరీల పునర్నిర్మాణాలు, నూతన భవన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయని మంత్రికి వివరించారు. అలాగే 6 ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణాల (రూ.90 కోట్ల వ్యయం)కు అవసరమైన స్థల సేకరణ, రూ.210 కోట్లతో మూడు జూ.ఆయుష్ కళాశాల ఏర్పాటు చర్యలను మంత్రికి వివరించారు. విశాఖలోని ఆయుష్ శాఖకు చెందిన ల్యాబరేటరీ నిర్మాణం పూర్తయిందన్నారు. 'ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద' ఏర్పాటుకు అవసరమైన ఆమోదంపై కేంద్ర ప్రభుత్వంతో జరుగుతున్న సంప్రదింపులపైనా మంత్రి అధికారులతో చర్చించారు.

### పిహెచ్‌సీ, సిహెచ్‌సి, ఇతర నిర్మాణాల పురోగతిపై ఆరా

గడిచిన రెండేళ్లలో జాతీయ ఆరోగ్య మిషన్, పీఎం అభిమ్, 15వ ఆర్థిక సంఘంకింద రూ.1,450 కోట్లతో చేపట్టిన 100 పీహెచ్సీలు, తొమ్మిది సీహెచ్సీలు, సుమారు 4,500 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల భవన నిర్మాణాల పురోగతి, 20 పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాల పురోగతిని మంత్రి సమీక్షిస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులను ఆదేశించారు. అలాగే, పాడేరు, పిడుగురాళ్ళ, మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాల పురోగతిని మంత్రి సమీక్షిస్తూ త్వరగా పనులు పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలన్నారు. అదేవిధంగా 11 పూర్వ వైద్య కళాశాలల్లో జరుగుతోన్న రకరకాల నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేయాలన్నారు. విద్యార్థుల సౌకర్యాలు పరిగణనలోనికి తీసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.

### ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్‌కు అక్రిడిటేషన్ తెప్పించాలి

తిరుపతి, విశాఖలో రూ.45 కోట్లతో అత్యాధునిక పరికరాలు/ మెషిన్లతో సిద్ధమైన స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీలు రాబోయే మూడునెలల్లో ఎన్ఎబీఎల్ అక్రిడిటేషన్ తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలిచ్చారు. ఈ రెండు లేబరేటరీల్లో నియామకాలు పూర్తయ్యాయన్నారు. తిరుమలలో స్టేట్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్, విశాఖలో ల్యాబ్‌లో నమూనాల పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపిన 78 ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, 72 ఇతర పోస్టుల (కొత్తవి) భర్తీకి ఆర్థిక శాఖ నుంచి ఆమోదం పొందాలని తెలిపారు. ఇవికాకుండా రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి వచ్చిన 278 శాంక్షన్డ్ పోస్టుల్లో సుమారు 150 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని కూడా త్వరితగతిన భర్తీచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

విశాఖ, గుంటూరు తిరుమల, తిరుపతి, కర్నూలు స్టేట్ ఫుడ్ ల్యాబుల్లో ఈ నియామకాలు జరిగేందుకు ప్రత్యేకంగా చొరవ చూపాలని వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబును ఆదేశించారు.

# కడపలో స్టీల్ ప్లాంట్ ప్రారంభం

- రాష్ట్రానికి శుభపరిణామం
- రూ.2,000 కోట్లతో 400 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మాణం
- దేశంలో తొలి గ్రీన్ ఎనర్జీ ఆధారిత ఉక్కు కర్మాగారం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



అమరావతి(చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కడపలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో కీలక ఘట్టమని ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. దేశంలో గ్రీన్ ఎనర్జీ ఆధారంగా నిర్మితమవుతున్న తొలి ఉక్కు కర్మాగారం ఇదేనని తెలిపారు. రూ.2,000కోట్ల పెట్టుబడితో, 400 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యిమందికి ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు లభిస్తాయని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలో దేశానికి ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించగా, రాష్ట్ర ప్రభుత్వం 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని వివరించారు. సోలార్, విండ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు (పీఎస్‌పీ), గ్రీన్ హైడ్రోజన్, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంపై విశ్వాసంతోనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# పొగాకు రైతులకు గిట్టుబాటు ధరే ప్రభుత్వ లక్ష్యం

**కొనుగోలులో అక్రమాలు, కంపెనీల సిండికేట్‌ను సహించం**

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



అమరావతి (చైతన్య రథం): వర్జీనియా పొగాకు కొనుగోలు ప్రస్తుత పరిస్థితిపై వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉన్నతస్థాయి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా ఎస్‌బీవీ స్వామి, టొబాకో బోర్డు ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీతోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని పొగాకు ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లను వెంటనే పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు సంస్థ తప్పనిసరిగా ఆక్షన్లలో పాల్గొనాలని, ఆక్షన్లకు దూరంగా ఉండే కంపెనీలపై టొబాకో బోర్డు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పొగాకు కొనుగోలులో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా టొబాకో బోర్డు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించిన మంత్రి, కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి నాణ్యమైన బేల్స్‌పైనా సీలింగ్ విధించి కృత్రిమంగా ధరలు తగ్గించే ప్రయత్నాలు చేస్తే ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని హెచ్చరించారు. అలాంటి చర్యలు నిర్ధారణ అయితే సంబంధిత కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు అధికారులను ఆదేశించారు.

పొగాకు రిజెక్షన్ రేటును గణనీయంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించిన మంత్రి, అన్ని గ్రేడ్ల పొగాకును కంపెనీలు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులు టొబాకో బోర్డు సూచనల మేరకు మాత్రమే తమ పొగాకును ఆక్షన్‌కు తీసుకురావాలని కోరారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధర లభించడంతోపాటు రిజెక్షన్ రేటు కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. పొగాకును వెంటనే విక్రయించకుండా నిల్వ ఉంచాలనుకునే రైతులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా టొబాకో బోర్డు, బ్యాంకర్లతో చర్చించి రుణ సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు. రైతులకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, పొగాకు రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సహచర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు స్వయంగా ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడైనా కంపెనీల సిండికేట్ లేదా అక్రమాలు వెలుగుచూస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు ప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పొగాకు కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరిగే పరిస్థితిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదు. ప్రతి రైతుకు న్యాయమైన ధర లభించేలా, కొనుగోళ్లలో పూర్తి పారదర్శకత ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. అక్రమాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# మూసేసే దుకాణంలో గుమస్తాలా సజ్జల తీరు

- రాష్ట్రం అభివృద్ధిపథంలో దూసుకెళ్తుంటే వైసీపీ ఓర్వలేకుంది
- కార్పొరేటర్‌గానూ గెలవలేని సజ్జలకు అమరావతిపై మాట్లాడే అర్హత లేదు
- కత్తులు గొడ్డళ్ల సంస్కృతి తప్ప జగన్, సజ్జలకు వేరే ఏమీ తెలీదు..
- నిలకడలేని రాజకీయాలకు కేరాఫ్ వైసీపీ..
- దౌర్భాగ్యపు రాజకీయాలకు.. వైసీపీ నేతలే తలలు పట్టుకుంటున్నారు
- ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ ధ్వజం

మంగళగిరి (చైతన్య రథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజలందరి పూర్తి మద్దతుతో, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ స్పష్టం చేశారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను, 'సూపర్ సిక్స్' హామీలను నెరవేరుస్తూ, అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నామని ఆయన తెలిపారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నుండి ఊహించిన దానికన్నా ఎక్కువ నిధులు, బడ్జెట్, ప్రతిష్టాత్మక సంస్థలను సాధించి ఏపీని అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలుపుతుంటే వైసీపీ నాయకులు ఓర్చుకోలేకపోతున్నారు. వైసీపీ అనే మూతపడే దుకాణానికి సజ్జల రామకృష్ణారెడ్డి ఒక గుమస్తా లాంటివాడు. కనీసం ఒక కార్పొరేటర్‌గా కూడా గెలవలేని సజ్జల, ఈ రోజు ప్రెస్ మీట్ పెట్టి అమరావతి గురించి మాట్లాడటం హాస్యాస్పదం. అసలు ఆయనకు అమరావతిపై మాట్లాడే నైతిక హక్కు ఎక్కడుంది? అని రాకేష్ ప్రశ్నించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రజలందరికీ నడిబొడ్డున, అత్యంత సౌలభ్యంగా ఉంటుందనే ఉద్దేశంతోనే అమరావతిని మహా రాజధానిగా ఎంపిక చేయడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. కేవలం సెక్రటేరియట్ మాత్రమే కాకుండా శాసనసభ, హైకోర్టు, జుడిషియల్ భవనాలు, కేంద్ర ప్రభుత్వ కాంప్లెక్స్‌లు, అంతర్జాతీయ విద్యాసంస్థలు అమరావతిలో కేంద్రీకృతం అవుతుంటే వైసీపీ నేతలు మళ్లీ బురదజల్లే ప్రయత్నాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. నాడు అసెంబ్లీలో అమరావతికి 30 వేల ఎకరాలు ఉండాలని మద్దతు తెలిపిన జగన్ మోహన్ రెడ్డి, ఆ తర్వాత మూడు రాజధానులంటూ డబుల్ గేమ్ ఆడారు. పోనీ ఆ మూడు రాజధానులకైనా ఐదేళ్లలో ఏమైనా చేశారా అంటే అదీ లేదు. మళ్లీ ఇప్పుడు వచ్చి కొత్త రాగాలు అందుకుంటున్నారు. కత్తి, కొడవలి, గన్, గొడ్డలి సంస్కృతి తప్ప జగన్‌కు, ఆయన గుమస్తా సజ్జలకు వేరే ప్రపంచం తెలియదని ఎద్దేవా చేశారు. వైసీపీ అధినాయకత్వానికి అసలు దిశా-నిర్దేశం లేదని, ఉదయం ఒక మాట, రాత్రికి ఒక మాట మారుస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ దౌర్భాగ్యపు రాజకీయాలు చూసి ఆ పార్టీలోని నాయకులే 'ఏంట్రా బాబు మాకు ఈ కర్మ' అని తలలు పట్టుకుంటున్నారని దూండి రాకేష్ అన్నారు. ఏపీకి పెట్టుబడులు రావడం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావడం జగన్ రెడ్డికి ఇష్టం లేదా అని ఆయన నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ, ప్రజా నిర్ణయాలకు కట్టుబడి పనిచేస్తుందని.. అమరావతిపై విషం కక్కే ప్రయత్నం చేస్తే రాబోయే రోజుల్లో ప్రజలే వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రాష్ట్ర రాజధాని అమరావతిపై వైసీపీ పార్టీ నాయకులు పూటకో మాట, నిలకడలేని రాజకీయాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు వైస్సార్సీపీ నాయకులు ఏం మాట్లాడుతున్నారో వాళ్లకైనా అర్థమవుతోందా? ఇందాక ఒకాయన రాజధాని దొనకొండలో పెడదాం అంటాడు, మళ్లీ విజయవాడ అయితే బాగుంటుంది అంటాడు. రేపు పొద్దున వచ్చి తాడేపల్లి అయితేనే మా ఇల్లు సేఫ్ అంటారేమో! అసలు రాజ్యాంగంలో రాజధాని అనే పదమే ఉందా అంటూ వితండవాదాలు చేస్తున్నారు. పొద్దున ఒక మాట, మధ్యాహ్నం ఒక స్టాండ్, రాత్రికి మరో స్టాండ్ మార్చే వీరికి అసలు ఒక విధానం అంటూ ఉందా? రాత్రి కలలో ఏది వస్తే ఉదయాన్నే దాన్ని ప్రజలపై రుద్దడం ఏంటి? అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పెట్టుబడి కంపెనీలు, పెద్ద పెద్ద విద్యాలయాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు వచ్చి బ్రహ్మాండంగా అభివృద్ధి పనులు జరుగుతుంటే, వీరు పొద్దున్న లేచింది మొదలు విషం కక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడం, యువతకు ఉద్యోగాలు రావడం, వ్యాపారాలు వృద్ధి చెంది ప్రజలు సంపాదించుకోవడం వీరికి ఇష్టం లేదా? రాష్ట్ర ప్రగతిని చూసి ఎందుకు ఏడుస్తున్నారు? అమరావతిలో అవినీతి జరిగిందని మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డి.. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు? అప్పుడు వ్యవస్థలన్నీ మీ చేతుల్లోనే ఉన్నాయి కదా, ఎందుకు కమిషన్ వేయలేదు? ఎందుకు విచారణ జరిపించి కేసులు పెట్టలేదు, అరెస్టులు చేయలేదు? అప్పుడు చేతగాక కూర్చొని, ఇప్పుడు మళ్లీ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. గత ఐదేళ్లలో అమరావతిలో వైస్సార్సీపీ నాయకులు చేసిన ఘనకార్యాలు ఏంటో అందరికీ తెలుసు. అక్కడ అప్పటికే వేసిన రోడ్లను సైతం తవ్వేశారు. రాజధాని పనుల కోసం తెచ్చి ఉంచిన గ్రావెల్‌ను (మట్టిని) దొంగతనం చేశారు. చివరికి అమరావతి వీధుల్లో వేసిన కరెంట్ స్తంభాలను, కరెంట్ తీగలను సైతం వదలకుండా దొంగిలించుకుపోయిన దౌర్భాగ్య చరిత్ర వైస్సార్సీపీ నాయకులది. ఇలాంటి వారు ఈరోజు రాజధాని అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. అన్నింటికంటే ఘోరం ఏంటంటే.. రాజధాని కోసం నమ్మి భూములిచ్చిన అమరావతి రైతులకు మీరు చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. తమ న్యాయమైన హక్కులకోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న అమరావతి ఆడబిడ్డలను, రైతులను నడిరోడ్డుపై పొట్టల్లో తన్నారు. మన ఇంటి ఆడబిడ్డలని కూడా చూడకుండా వారి జుట్టు పట్టుకుని రోడ్లపై లాక్కెళ్లిన ఘనత మీ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానిది కాదా? అంతలా మహిళలను హింసించి, కన్నీరు పెట్టించిన పాపంమీది. ఇంతటి దారుణాలకు, దౌర్జన్యాలకు పాల్పడిన వైస్సార్సీపీ నాయకులు.. ఈరోజు మళ్లీ అమరావతి గురించి నీతులు మాట్లాడటం కంటే దౌర్భాగ్యం మరొకటి లేదు.

జగన్మోహన్ రెడ్డి, అండ్ కో పూర్తిగా దివాలా తీయడానికి రెడీగా ఉంది. అందుకే గత ఎన్నికల్లో ప్రజలందరూ కలిసి వారిని తరిమి కొట్టారు. ప్రజలు ఇచ్చిన ఆ తీర్పు కంటే అద్భుతమైన తీర్పు రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా రాబోతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 80శాతానికి పైగా ప్రజలు కూటమి ప్రభుత్వంపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటప్పుడు జగన్మోహన్‌రెడ్డిని గానీ, ఆయన కింద పనిచేసే పేటీఎం బ్యాచ్‌ను గానీ, ఆ గుమస్తా సజ్జల రామకృష్ణారెడ్డిని గానీ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. కేవలం అమరావతిపై విషం కక్కడానికి తప్ప వీరు దేనికీ పనికిరారనే సంగతి అందరికీ అర్థమైపోయింది. ఇందాక సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాలో ఒక అద్భుతమైన పదం వాడారు.. అమరావతిలో భూమి కుంగిపోతుందంట! ఎక్కడి నుంచి ఎక్కడికి కుంగిందయ్యా నీ బాధ ఏంటీ? కాసేపేమో హైదరాబాద్ 10 ఏళ్లు కామన్ రాజధానిగా ఉంటే బాగుండు అంటారు.. ఇంకోసారేమో భూమి కుంగింది, నీళ్లు వచ్చేసాయి, రోడ్డు ఊగుతోంది అంటూ పిచ్చి కూతలు కూస్తున్నారు. అసలు వీళ్ల బాధ ఏంటో ఎవరికీ అర్థం కావడం లేదు. ఏదో ఒక రకమైన అబద్ధాలు ప్రచారం చేస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను అడ్డుకోవడమే జగన్, సజ్జల రామకృష్ణారెడ్డిల అసలు అజెండా అని ప్రజలందరికీ స్పష్టంగా అర్థమైపోయింది. రాష్ట్రం బాగుపడుతుంటే వీరు తట్టుకోలేకపోతున్నారు. వీరు ఆడుతున్న నాటకాలను ప్రజలందరూ గమనిస్తున్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏ ఎలక్షన్ వచ్చినా.. ఈసారి ప్రజలే స్వయంగా చేతిలోకి బెత్తం పట్టుకుని వైస్సార్సీపీ నాయకులకు బుద్ధి చెప్పే రోజులు చాలా దగ్గరలోనే ఉన్నాయి. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునే ఎవరినీ ప్రజలు వదిలిపెట్టరని దూండి రాకేష్ హెచ్చరించారు.






## డిప్యూటీ సీఎంను కలిసిన ఈగల్ వింగ్ చీఫ్

మంగళగిరి (చైతన్య రథం): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఈగల్ విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను డిప్యూటీ సీఎం పవన్‌కు నివేదించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నివారణకు ఈగల్ విభాగం తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపర్చారు. సోషల్ మీడియా వేదికలపై, ట్రోలింగ్ అంశాలతోపాటు మహిళలను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులుపెట్టే వారిపై సైబర్ క్రైమ్ విభాగం ద్వారా తీసుకుంటున్న కఠిన చర్యలను డిప్యూటీ సీఎం పవన్‌కు వివరించారు.

# కడప ఉక్కు పరిశ్రమ పునరుద్ధరణ

### రాయలసీమ చిరకాల స్వప్న సాకారం దిశగా అడుగులు: మంత్రి ఫరూక్

నంద్యాల (చైతన్య రథం): రాయలసీమ ప్రజల దశాబ్దాల కల అయిన కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మళ్లీ మార్గం సుగమమైందని, జమ్మలమడుగులో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు కూటమి ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేసిందని, సీఎం చంద్రబాబు పనులను అధికారికంగా శుక్రవారం పునఃప్రారంభించారని న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జేఎస్‌డబ్ల్యూ సంస్థతో కలిసి ప్రాజెక్టును చేపడుతున్నామని, రెండు దశల్లో రూ.16,350 కోట్ల పెట్టుబడితో (మొదటి దశ రూ. 4,500 కోట్లు, రెండో దశ రూ. 11,850 కోట్లు) కర్మాగారాన్ని నిర్మిస్తున్నామన్నారు. రెండు దశలు పూర్తయితే 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి జరగడమే కాకుండా, లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. పర్యావరణహితమైన 'గ్రీన్ స్టీల్' ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించామని, సంప్రదాయ బొగ్గు ఆధారిత పద్ధతికి బదులుగా, పునరుత్పాదక ఇంధనంతో పనిచేసే 'స్క్రాప్ ఆధారిత ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్' సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన 1,100 ఎకరాల భూమిని కేటాయించడంతోపాటు, గండికోట నుంచి 2 టీఎంసీ నీరు, 40 కోట్లతో 12



కి.మీమేర 4 లైన్ల రోడ్డు, ముద్దనూరు నుంచి రైల్వేలైన్ అనుసంధానం, మరియు విద్యుత్ సబ్ స్టేషన్లవంటి భారీ మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. 2028నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ఐదేళ్ల కాలంలో జగన్ రెడ్డి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ పేరుతో కేవలం శంకుస్థాపనలకే పరిమితమైందని, కనీస పనులు కూడా చేపట్టలేదన్నారు. మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి, ఐదేళ్లయినా అంగుళం పనులు ముందుకు సాగలేదని, పైగా అక్రమ మైనింగ్ మరియు నిధుల మళ్లింపుతో రాయలసీమ ప్రజల ఆశలను దెబ్బతీశారన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చొరవతో కడప జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడమే కాకుండా, స్థానికంగా పారిశ్రామికీకరణ వేగవంతం కానుందని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు.

# అమరావతిపై వినాశకుడి విన్యాసాలు!!

రామాయణంలో మారీచుడి పాత్ర అత్యంత కీలకమైనది. త్రేతాయుగంలో లంకేశుడి ఆదేశంతో మారీచుడు బంగారు లేడి రూపం దాల్చాడు. ఆ మాయ లేడి అందానికి మురిసిపోయి సీతమ్మ ఆ కపట మృగాన్ని తెచ్చివ్వమని కోరింది. రాముడు హెచ్చరించినా, లక్ష్మణుడు అది మాయ అని వారించినా. ఆ క్షణంలో ఆ స్వర్ణమృగం కల్పించిన భ్రమే గెలిచింది. వివిధ రూపాలను మార్చగల నైపుణ్యం కలిగిన రాక్షసుడు మారీచుడు. ఆకాశం నుండి రక్తం కురిపించడం, క్షణంలో మాయమైపోవడం మారీచుడికి వెన్నతో పెట్టిన విద్య. విశ్వామిత్ర మహర్షి యజ్ఞం చేస్తుంటే మారీచుడు, సుబాహుడు కలిసి మాయా రూపాలతో వచ్చి యజ్ఞ కుండాన్ని అపవిత్రం చేసేవారు. ఆనాటి పురాణ కాలపు కథకు, నేడు 21వ శతాబ్దపు ఆధునిక ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు అచ్చంగా సరిపోయే పోలిక జగన్‌రెడ్డి మావిగన్., నేడు ప్రజాస్వామ్య వ్యవస్థలో సరికొత్త ఆధునిక మారీచుడు జగన్‌మోహన్‌రెడ్డి. పైకి సాధువులా నటించడం మారీచుడి చరిత్ర. కానీ ఆధునిక మారీచుడు జగన్‌రెడ్డి పైకి సాధువులా కనిపించినా, ఆయన కపటరూపం ఎత్తడంలో దిట్ట. మారీచుడు బంగారు లేడి రూపంలో వచ్చి సీతమ్మను మోసం చేసినట్లు, కలియుగంలో ఆధునిక మారీచుడు మాయాస్త్రంతో జనాన్ని మోసం చేసేందుకు మావిగన్ అంటూ బయలుదేరాడు. నాలుకను అడ్డదిడ్డంగా మడతేయడంలో జగన్‌రెడ్డి రాజకీయ ఊసరవెల్లి. రాజధాని అమరావతి విషయంలో పూట కొక మాట మాట్లాడుతూ నిలకడ లేని వైఖరి ప్రదర్శిస్తూ రాజధాని అభివృద్ధికి అడ్డుపడుతున్న ఇటువంటి రాజకీయ పార్టీ అవసరమా? అని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అమరావతిలో రాజధాని ఏర్పాటు చేస్తే చంద్రబాబుకి పేరు వస్తుందన్న అక్కసు, దుర్బుద్ధితోనే ఆ వికృత రాజకీయానికి పూనుకొన్నారు. రాజధానిగా అమరావతి వేగంగా రూపుదిద్దుకొనే శుభ తరుణంలో సంకుచిత వాదనలతో, స్వార్థ బుద్ధితో, అక్కసుతో ప్రమాదకర రాజకీయ క్రీడను ఆరంభించి పసలేని, పనికిమాలిన వాదన చేస్తున్నారు. జగన్ తన తుచ్ఛ రాజకీయంతో రాజధానిపై బస్మాసుర హస్తం పెట్టాలని చూస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ రాజధాని నిర్మాణంపై ఇంత ద్వేషం, ఈర్ష్య, కుళ్ళు రాజకీయం లేదు. ఆంధ్రప్రదేశ్ భ్రష్టుపట్టించాలనే ఉద్దేశ్యంతో అమరావతిపై పగపట్టారు. ఆంధ్రప్రదేశ్ కోలుకుంటే తనకి రాజకీయంగా కష్టమన్న దుర్బుద్ధి, కుట్రతో అమరావతికి అడుగడుగునా అడ్డుపడుతున్నారు.

**రాష్ట్రానికి శాపం జగన్ రాజకీయం!**

అంతర్జాతీయస్థాయిలో అమరావతి నగరం నిర్మాణమైతే ఆ ఘనత చంద్రబాబుకి దక్కుతుందన్న ఆవేదన ఆయనను నిద్రపోనివ్వడం లేదు. ఈ అక్కసుతోనే అమరావతిని అడ్డుకోవడానికి ఎన్ని కుతంత్రాలు చేయాలో అన్నీ చేస్తున్నారు. అమరావతి అనే పేరును చెరిపేయాలని, ఆ ప్రాంతానికి రావలసిన గుర్తింపును దెబ్బతీయాలని దుర్బుద్ధితో చేస్తున్న ప్రయత్నమిది. ప్రజలు అమరావతిని రాజధానిగా ఆమోదించి, చంద్రబాబు నాయకత్వానికి పట్టంగట్టారు. దీన్ని జీర్ణించుకోలేక, మళ్లీ పాత అజెండాతో ప్రాంతాలమధ్య చిచ్చు పెట్టాలని జగన్ ప్రయత్నిస్తున్నారు. విఫల నాయకుడి, విషపు మాటలు, అమరావతిని అడ్డుకోవాలని చూడటం ఆయన రాజకీయ పరిపక్వత లేమికి నిదర్శనం. కానీ చరిత్ర క్షమించదు. అమరావతి కలను భగ్నంచేసి, ఒక వ్యక్తిపై ఉన్న అసూయతో అభివృద్ధిని అడ్డుకున్న నాయకుడిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. రాజకీయాల్లో నాయకుల మధ్య పోటీ ఉండటం సహజం. కానీ ఒక నాయకుడికి ప్రజల్లో వస్తున్న గుర్తింపును, ఆయన చేపట్టిన ఒక చారిత్రాత్మక అమరావతి రాజధానిని చూసి ఓర్వలేక, రాష్ట్రాన్ని అగాథంలోకి నెట్టాలని చూడటం ఏ విధమైన రాజకీయమో అర్థం కావడం లేదు. అమరావతి విషయంలో జగన్ రెడ్డికి రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కంటే, చంద్రబాబు నాయుడికి దక్కనున్న 'క్రెడిట్'ను ఎలా అడ్డుకోవాలన్న దుర్బుద్ధే జగన్ రెడ్డిలో కనిపిస్తోంది. అసూయ, ద్వేషంతో ఐదు కోట్ల ప్రజల కలల రాజధానిని బలిపెట్టే జగన్ వైఖరి చూస్తుంటే, ఆయనకీ రాష్ట్రం పట్ల ఎంత బాధ్యత ఉందో ప్రజలే అర్థం చేసుకోవాల్సి వుంది. అమరావతి అభివృద్ధి చెందితే, తన మూడు రాజధానుల వినాశకర అజెండా ఫెయిల్ అవుతుందన్న భయమే జగన్ రెడ్డిని వెంటాడుతోంది. రాష్ట్రానికి శాపంగా మారిన జగన్ రాజకీయాలు, ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి గద్దె దిగాక కూడా అవే విధ్వంసకర రాజకీయాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలబడాల్సిన జగన్ తన సొంత అహంకారాన్ని సంతృప్తి పరుచుకోవడం కోసం ఏ స్థాయిలో దిగజారిపోయారో ప్రజలు తెలుసుకోవాలి. అహంకారంతో రాజధానికి అడ్డుపడుతున్న ఇలాంటి పార్టీని, ఇలాంటి నేతను రాష్ట్రం ఎందుకు మోయాలో ప్రజలే ఆలోచించాలి. రాజకీయాన్ని రాష్ట్ర అభివృద్ధికి కాకుండా ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి, రాజధానిని శ్మశానంగా మార్చాలని చూస్తున్న జగన్ రెడ్డి రాష్ట్రానికి అవసరమా? అమరావతికి అడ్డుపడాలని చూస్తున్న జగన్ రెడ్డిని రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలు మరోసారి పాతరేయడం ఖాయం. స్వార్థ రాజకీయంతో రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టడం ఇలా దిగజారుడుతనంతో వ్యవహరించడం రాజకీయ ఆత్మహత్యతో సమానం.

ఒక విధానం లేదు, సిద్ధాంతం లేదు, లక్ష్యం లేదు!

మూడు రాజధానులు పోయాయి. 'మావిగన్' నినాదంతోనే వచ్చే ఎన్నికలకు వెళ్తున్నామని కూడా ప్రకటించి అమరావతిపై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. ఇప్పుడు రాష్ట్రానికి సోకాల్డ్ రాజధాని అమరావతి కాదని విజయవాడే అసలు రాజధాని అని జగన్ వ్యాఖ్యానించడంతో పక్కనే ఉన్న వైసీపీ నాయకులు ఆశ్చర్యపోయారు. రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో పార్లమెంట్‌లో కూడా రాష్ట్ర ప్రయోజనాలు కన్నా తనకి స్వార్థ ప్రయోజనాలే ముఖ్యమన్న విధంగా వ్యవహరించారు జగన్ రెడ్డి. దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అమరావతికి అనుకూలంగా గళం విప్పితే, రాష్ట్రానికి చెందిన ఒక ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధినేత జగన్ మాత్రం 'మావిగన్' అనే విచిత్రమైన సాకుతో సభ నుంచి వాకౌట్ చేయడం చూసి రాజకీయ విశ్లేషకులు ఆశ్చర్యపోయారు. జగన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కి చెందిన రాజకీయ నాయకుడేనా అన్నారు. 'మావిగన్' అనే ఒక అసంబద్ధమైన పదాన్ని అడ్డుపెట్టుకుని, సభ నుంచి బయటకు వెళ్లి తాము అమరావతికి వ్యతిరేకం అని నిరూపించారు. పార్లమెంటు వేదికగా దేశమంతా రాష్ట్ర ప్రయోజనాల కొరకు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తే, జగన్ మాత్రం రాష్ట్ర ప్రయోజనాల పట్ల తనకి బాధ్యత లేనట్లుగా వ్యవహరించారు. కేవలం సొంత రాజకీయ అజెండాతో వ్యవహరించడం దురదృష్టకరం. రాష్ట్ర రాజధానికి సంబంధించిన విషయంలో ఇలాంటి చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసం? జగన్ తీరుపై ఇప్పుడు సొంత పార్టీ నేతలే బహిరంగంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక విధానం లేదు, సిద్ధాంతం లేదు, ఒక లక్ష్యం లేదు. కేవలం ఐదేళ్లకో మాట మార్చుకుంటూ పోతే పార్టీని నమ్ముకున్న వాళ్ళ పరిస్థితి ఏమిటని వైసీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అమరావతిని సమాధి చేసి ఇప్పుడు మళ్లీ అదే ప్రాంతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం జగన్ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. అమరావతిని విధ్వంసం చేసి రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దెబ్బతీసినందుకే ప్రజలు చిత్తుగా ఓడించి రెండు పంగనామాలు పెట్టారు. జగన్ మాత్రం తన ఓటమి నుంచి పాఠం నేర్చుకోకుండా మళ్లీ అదే మాయాజాలాన్ని నమ్ముకున్నారు. 'మావిగన' అనేది రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయం కాదు, అమరావతిని అడ్డుకునేందుకు సృష్టించిన మరొక 'ప్రాంతీయ విభజన' అజెండా అని ప్రజలు ఇప్పటికే గ్రహించారు. తన రాజకీయ భవిష్యత్తు కోసం రాష్ట్ర రాజధానిని మళ్లీ చర్చలోకి తీసుకువచ్చారు.

**భారత దేశానికే తలమానికం అవుతుందని!**

ఎంతో నమ్మకంతో వేలాది ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారు. రైతుల త్యాగాలతో రాజధాని నిర్మాణ సమయంలో 'మావిగన్'వంటి కొత్త నామకరణం చెయ్యడం రైతుల నమ్మకాన్ని దెబ్బతీయడమే. అంతేకాదు పెట్టుబడిదారుల దృష్టిలో ఈ విధమైన వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరం. రాజధాని విషయంలో స్పష్టత లేకపోతే, దీర్ఘకాలిక పెట్టుబడులు ఎలా వస్తాయి? అభివృద్ధి ప్రాజెక్టులు ఎలా ముందుకు సాగుతాయి? అందరికి నమ్మకం కలిగించాల్సిన సమయంలో రాజధాని పై మరోసారి జగన్ రెడ్డి విషం కక్కడాన్ని మించిన విషాదం ఏముంటుంది? ఏది ఏమైనా ప్రపంచం దృష్టిని ఆకర్షించే విధంగా రాజధాని అమరావతి నిర్మాణం జరిగితే అది భారత దేశానికే తలమానికం అవుతుందని, అటువంటి గొప్ప నగరాన్ని నిర్మించిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందన్న అక్కసుతో అమరావతి విషం కక్కుతున్నాడు జగన్ రెడ్డి. అమరావతి పట్ల ఒక ఫాసిస్టులా వ్యవహరిస్తున్నారు. అమరావతిపై జగన్ ఎన్ని మాయలు చేసినా, మాటలు మార్చినా కుట్రలు, కుతంత్రాలు పన్నినా జగన్ అనే గోముఖ వ్యాఘ్రాన్ని జనం నమ్మరు!

- నీరుకొండ ప్రసాద్

# రైతు పొట్టగొట్టే కుట్రలా?

- అబద్ధపు రాతలతో భయాందోళనలకు గురిచేస్తారా?
- జగన్ అబద్ధాలకు అంబాసిడర్... సాక్షి అసత్యాలకు వేదిక
- ఈ-పంట నమోదులో కూటమిది సాంకేతిక విప్లవం
- ప్రజలు అన్నీ గమనిస్తున్నారు...
- ప్రభుత్వంపై ఎంత విష ప్రచారం చేసినా నిజాలు దాచలేరు
- కూటమి విజయాలు చూసి జగన్‌కు మతిపోయింది
- సాక్షి విష ప్రచారంపై విరుచుకుపడిన మంత్రి అచ్చెన్న
- సాక్షి అబద్ధాలను గణాంకాలతో తిప్పికొట్టిన మంత్రి



అమరావతి (చైతన్య రథం): ఈ-పంట నమోదుపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జగన్, ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తున్న సాక్షి పత్రిక చేస్తున్న అసత్య ప్రచారం పూర్తిగా నిరాధారమని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఖండించారు. అబద్ధాలకు అంబాసిడర్ జగన్ అయితే, వాటికి వేదిక సాక్షి పత్రిక అని దుయ్యబట్టారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన పత్రిక, వాస్తవాలను కప్పిపుచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తూ రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. సాక్షి రాసే అసత్యాలను ప్రజలు గుడ్డిగా నమ్మే పరిస్థితి లేదని, ప్రజలన్నీ గమనిస్తున్నారని మంత్రి అచ్చెన్న పేర్కొన్నారు. ఈ-పంట నమోదుపై జగన్ చేస్తున్న ఆరోపణలను గణాంకాలే తిప్పికొడుతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్-2024లో కేవలం 41.87 లక్షలమంది రైతుల 96.78 లక్షల ఎకరాలు మాత్రమే నమోదు కాగా, కూటమి ప్రభుత్వం ఖరీఫ్-2025లో 53.32 లక్షలమంది రైతుల 117.39 లక్షల ఎకరాలు నమోదు చేసి గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. అలాగే ల్యాండ్ పార్సిల్స్ నమోదు 106.38 లక్షలనుంచి 198.93 లక్షలకు పెరిగిందని, రబీ 2025-26లో 99.7 శాతం ఈ-పంట నమోదు పూర్తి చేశామని తెలిపారు. ఖరీఫ్-2026లో ఏపీఏఐఎంఎస్ 2.0 ద్వారా అత్యాధునిక సాంకేతికతతో డిజిటల్ పంట నమోదు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. జియో-రెఫరెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఉపగ్రహ సాంకేతికత, మూడు దశల ఎస్ఎమ్ఎస్ సమాచారం, రైతులు స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యం, గ్రీవెన్స్ వ్యవస్థవంటి అనేక పారదర్శక విధానాలు ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

ఖరీఫ్-2026లో ఇంతవరకు 11.75 లక్షల ఎకరాలలో సాగు అయినప్పటికీ, ఈ-పంట నిబంధనల ప్రకారం 30 రోజుల వయసు దాటిన పంటలనే నమోదు చేయవలసి వుంటుంది. ఇంతవరకు 1,62,396 మంది రైతులకు సంబంధించిన 4,03,150 ఎకరాలను ఈ-పంట నమోదు పూర్తి చేశామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా సేకరించిన పంట విస్తీర్ణ వివరాలు అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉన్నందున, పంటల విస్తీర్ణ ఉత్పత్తి, ఉత్పాదకత అంచనాల కోసం కేంద్ర ప్రభుత్వ గణాంక వ్యవస్థ వాటిని వినియోగించడం విశిష్టమైన గుర్తింపుగా నిలిచిందన్నారు.

రైతులకు సబ్సిడీలు, బీమా, పెట్టుబడి సాయంవంటి పథకాలు వేగంగా, పారదర్శకంగా అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వివరించారు. వాస్తవాలతో సమాధానం చెప్పలేక అబద్ధాల ప్రచారం చేయడం జగన్‌కు అలవాటైందని, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రచారాలతో కాదు... పనితీరుతోనే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటోందని స్పష్టం చేశారు.

### కొబ్బరి ధరలపై తప్పుడు కథనాలు.. జగన్ కుట్ర కోణం ఏంటి?

గత రెండేళ్లుగా కొబ్బరి రైతులకు మంచి ధరలు లభిస్తున్నాయని, 2024-25లో బంతి కొబ్బరి వెయ్యి కాయలకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు, కోప్రా రూ.15,500 నుంచి రూ.19,500 వరకు ధర లభించిందన్నారు. 2025-26లో బంతి కొబ్బరి రూ.18 వేలనుంచి రూ.27 వేల వరకు, కోప్రా రూ.17 వేల నుంచి రూ.28,500 వరకు విక్రయమై రైతులకు మంచి ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో కొన్ని మార్కెట్ పరిస్థితులవల్ల స్వల్ప ఒడిదుడుకులు ఎదురైనా, ప్రస్తుతం మార్కెట్ మళ్లీ పుంజుకుని బంతి కొబ్బరి వెయ్యి కాయలకు రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు, కోప్రా రూ.15 వేలనుంచి రూ.24 వేల వరకు ధరలు లభిస్తున్నాయన్నారు. ఇలాంటి సమయంలో సొంత పత్రికలో "కొబ్బరి ధరలు లేవు" అంటూ తప్పుడు కథనాలు ప్రచారం చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి జగన్? మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపించి కొబ్బరి ధరలు పడిపోయేలా చేయడమే నీ కుట్రనా? ప్రస్తుతం రైతులకు వస్తున్న మంచి ధరలను దెబ్బతీసి, వ్యాపారులు తక్కువ ధరలకు కొబ్బరి కొనుగోలు చేసేలా చేయడానికే తప్పుడు ప్రచారమా? రైతుల్లో భయాందోళనలు సృష్టించి, మార్కెట్‌లో గందరగోళం నెలకొల్పి రైతుల పొట్ట కొట్టడమే నీ లక్ష్యమా? రాష్ట్రంలో రైతులకు మేలు జరుగుతుంటే అది చూడలేక, నీ రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల జీవితాలతో కూడా చెలగాటమాడుతున్నావా? మార్కెట్ కోలుకుని రైతులకు ఊరటనిస్తున్న సమయంలో ఇలాంటి నిరాధార కథనాలు ప్రచురించడం అత్యంత బాధ్యతారాహిత్యం కాదా?" అని మంత్రి అచ్చెన్న నిలదీశారు. రైతులకు వాస్తవాలు తెలియజేయాల్సిన పత్రికను రాజకీయ కుట్రలకు వేదికగా మార్చవద్దని, తప్పుడు ప్రచారాలతో మార్కెట్‌ను ప్రభావితం చేసే ప్రయత్నాలు వెంటనే మానుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు హితవు పలికారు.

## తీరానికి పర్యాటక శోభ!

- సంకల్పానికి విఘ్నాలు లేకుండా విజయగణపతి విగ్రహ నిర్మాణం
- ప్రముఖ ఆలయాల నమూనాల నిర్మాణానికీ శ్రీకారం
- మంగినపూడి బీచ్ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): మంగినపూడి బీచ్‌ను రాష్ట్రస్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర గనులు,భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఈమేరకు మచిలీపట్నంలోని మంగిన పూడి బీచ్‌వద్ద 63అడుగుల విజయ గణపతి మట్టి విగ్రహం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "మహా గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో మంగినపూడి బీచ్‌వద్ద 63 అడుగుల మహాగణపతి విగ్రహాన్ని పూర్తి మట్టి విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేయడం ఆనందంగా ఉంది. ఖైరతా బాద్ వినాయకునికి ఉన్న గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా మంగినపూడి సముద్ర తీరంలో విగ్రహం ఏర్పాటు చేసుకున్నాం. 63అడుగుల విజయ గణపతి ఆలయ నిర్మాణంతో పాటుగా.. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాలైన కాణిపాకం, తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలం మల్లిఖార్జున స్వామి ఆలయం, విజయ వాడ కనకదుర్గమ్మ ఆలయం, అయోధ్య రామందిర నమూనా ఆలయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరి గింది. గతంలో ఇదే ప్రాంతంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించాం. ఇప్పుడు కూడా అంతేస్థాయిలో సదుపాయాలు కల్పిస్తాం. రాష్ట్ర ప్రజలందరికీ స్వామి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలి" అని మంత్రి పేర్కొన్నారు.

"వచ్చే ఏడాదికి బందరు పోర్టు పూర్తి కానుంది. పదుల సంఖ్యలో పరిశ్రమలు వస్తున్నాయి. పర్యాటకంగా మచిలీపట్నా నికి గుర్తింపు తీసుకొస్తున్నాం. బీచ్ పరిసరాల్లో 250 ఎకరాల భూముల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నాం. రాబోయే ఏడాదిలో ఈప్రాంతం స్వ రూపం పూర్తిగా మారుస్తాం. అమరావ తికి దగ్గరలోవున్న పోర్టు కావడంతో మచిలీపట్నాన్ని గేట్ వే ఆఫ్ అమరావతి గా అభివృద్ధి చేస్తున్నాం. ఈ అభివృద్ధికి ఎలాంటి విఘ్నాలు ఎదురవకుండా విఘ్నేశ్వరుడు అండగా ఉండాలనే లక్ష్యంతో వినాయక చవితి నిర్వహణకు శ్రీకారంచుట్టామని మంత్రికొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్,టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోపు సత్యన్నా రాయణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్ తదితర నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం దృష్టిలో

## పొగాకు రైతు సమస్య

- ఆరుగాలం శ్రమించే రైతన్నలను నష్టపోనివ్వం
- వ్యాపారులు వేలంలో పాల్గొని రైతులకు సహకరించాలి
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విజ్ఞప్తి
- కొండపిలో పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించిన మంత్రి



ప్రకాశం/కొండపి(చైతన్యరథం): పొగాకు రైతుకు పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి స్పష్టంచేశా రు. శుక్రవారం కొండపి పొగాకు వేలం కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వేలం కేంద్రంలో జరు గుతున్న పొగాకుకొనుగోలు ప్రక్రియ,రైతు లకు అందుతున్న ధరలను పర్యవేక్షించా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ... "పొగాకు రైతులు ఎదుర్కొంటు న్న ప్రతిసమస్య ప్రభుత్వం దృష్టిలో ఉంది. వేలం ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది.ఎండనక, వాన నక కష్టపడి పంట పండించే రైతన్నలు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభు త్వంపై ఉంది. రైతులకు కచ్చితంగా లాభ సాటి ధర లభించేలా చర్యలు తీసుకుం టాం" అని మంత్రి హామీ ఇచ్చారు. వేలం కేంద్రంలో ఏ ఒక్క రోజూ 'నో బిడ్' (వ్యాపారులు కొనుగోలు చేయకుండా నిలిపివేయడం) అనే పరిస్థితి రాకుండా పొగాకు బోర్డు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిరంతరం నిఘా ఉంచాలని మంత్రి ఆదేశించారు. పొగాకు వ్యాపారు లు, కంపెనీల ప్రతినిధులు ఉత్సాహంగా వేలంలో పాల్గొని,నాణ్యతకు తగ్గట్టుగా పోటీపడి మంచి ధరలు పలకడం ద్వారా రైతులకుఅండగా నిలవాలని మంత్రి పిలు పునిచ్చారు. రైతులకు ఎలాంటి సాంకేతిక లేదా రవాణా ఇబ్బందులు కలగకుండా వేలం కేంద్రాల్లో మౌలిక వసతులు మెరు గుపరచాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

చైతన్యరథం

# పోర్టు ఆధారిత వ్యవస్థగా ఏపీ

- షిప్ బిల్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పం ప్రభుత్వానిది
- పోర్టులు, తీర ప్రాంత మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించండి
- కేంద్రానికి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి విజ్ఞప్తి
- కేంద్ర మంత్రి సర్భానంద సోనోవాల్‌తో విస్తృత భేటీ



న్యూఢిల్లీ (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో మారిటైమ్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిదని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తెలిపారు.తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రధాన పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థగా, షిప్ బిల్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం, పరిశ్రమల భాగస్వామ్య సంస్థలతో సమన్వయంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నామని వివరించారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్భానందా సోనోవాల్‌ను ఆయన కార్యాలయంలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కలిశారు. సోనోవాల్‌ను శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను మంత్రి జనార్ధన్‌రెడ్డి అందించారు. అనంతరం రాష్ట్రంలో చేపడుతున్న కీలక మారిటైమ్ అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు సైతం పాల్గొన్నారు. రాష్ట్రంలో తీర ప్రాంత మౌలిక సదుపాయాల వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, పోర్టు ఆధారిత అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయడం, కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో చేపట్టాల్సిన కీలక ప్రాజెక్టులపై మంత్రులు ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా మూలాపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు అభివృద్ధిలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ భాగస్వామ్యాన్ని కల్పించాలని కోరారు. అలాగే పోర్టు సంబంధిత మౌలిక సదుపాయాల అభివృద్ధికోసం అవసరమైన ఉప్పు భూములను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించేలా కేంద్రం సహకరించాలని మంత్రి జనార్ధన్‌రెడ్డి కోరారు అదేవిధంగా,సాగర్‌మాల పథకం కింద గంగవరం పోర్టు, అనకాపల్లి జిల్లాలోని ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పోర్టులకు అనుసంధాన రహదారులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సాగర్‌మాల 2.0కింద ప్రతిపాదించిన ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టులకు ఆర్థికసాయం అందించడంతో పాటు, దుగ్గరాజపట్నం మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్, అంతర్గత జలమార్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, షిప్ బిల్డింగ్ క్లస్టర్లు, నౌకా మరమ్మతు కేంద్రాలు, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, పోర్టు ఆధారిత పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పోర్టు కనెక్టివిటీ ప్రాజెక్టులువంటివ్యూహాత్మక మారిటైమ్ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం ఎంతో సమర్థవంతంగా అమలు చేస్తోందని కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సరుకు రవాణా, ఎగుమతులు, దిగుమతులకు అనుకూలమైన అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పోర్టులు, జలమార్గాల అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపునిచ్చే దిశగా ప్రభుత్వం కార్యాచరణను కొనసాగిస్తోందని తెలిపారు.

ముఖ్యమంత్రి మార్గనిర్దేశకత్వంలో రాష్ట్రంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలనే వ్యూహాత్మక లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని మంత్రి జనార్ధన్‌రెడ్డి వెల్లడించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ ఇరిగేషన్‌కు పూర్వ వైభవం

- పదేళ్ల నిర్వహణకు రూ.4,500 కోట్లతో టెండర్లు
- శాశ్వత సాగునీటి భద్రతే కూటమి లక్ష్యం
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

జగ్గయ్యపేట (చైతన్యరథం): రాష్ట్రంలో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చి 8.2 లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం పర్యటించారు. 15కోట్లతో అక్కడి వేదాద్రికంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను ప్రారంభించారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల రిపేర్లు,పదేళ్లపాటు నిర్వహణ పనులకు రూ.4,500కోట్లతో టెండర్లు పిలుస్తున్నట్టు రామానాయుడు చెప్పారు. వైసీపీ పాలనలో ఇరిగేషన్ రంగానికి 18 వేల కోట్లు అప్పుపెట్టి వెళ్లిపోయాడన్నారు. పోలవరం డయాఫ్రమ్ వాల్, అన్నమయ్య తదితర ప్రాజెక్టుల విధ్వంసానికి జగన్ కారకుడయ్యాడన్నారు. నిర్వహణ పనులు కోసం ఐదేళ్లలో వైసీపీ రూ.200 కోట్లు కేటాయిస్తే..కూటమి ప్రభుత్వ హయాంలో రెండేళ్లలోనే రూ.1200కోట్లు ఖర్చు చేసినట్టు రామానాయుడు చెప్పారు. రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల కింద 8.2లక్షలు ఎకరాలు ఆయకట్టు ఉండగా..గొడ్డలి పార్టీ విధ్వంసంవల్ల నాలుగు లక్షల ఎకరాలు కుచించుకుపోయిందన్నారు. వైకాపా హయాంలో మరమ్మత్తులకు ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో లిఫ్ట్ స్కీములు మూతపడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1023లిఫ్ట్ స్కీములు ఉంటే కేవలం 166మాత్రమే పనిచేస్తున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 2021నుండి వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం పనిచేయపోవటానికి వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే కారణమని మంత్రి నిమ్మల దుయ్యబట్టారు. రూ.15 కోట్లతో చేపడుతున్న ప్రస్తుత పునరుద్ధరణ పనులుపూర్తయితే జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని 17,366 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించగలదన్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో, వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం నిర్వహణకు రూ.5.36 కోట్లు ఖర్చు చేసి సాగునీరందించామని గుర్తు చేశారు. 2027 ఖరీఫ్ సీజన్‌నాటికి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇరిగేషన్ రంగం విధ్వంసమైందనడానికి ఐడీసీనే ప్రత్యక్ష ఉదాహరణ అని మంత్రి నిమ్మల పేర్కొన్నార.

"రాజధాని విషయంలో జగన్ మావిగన్ అంటూ మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. పూటకో మాట, పేటకో మాట అన్న చందంగా ఉంది జనగ్ తీరు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతిని ఆహ్వానించి అధికారంలోకి వచ్చాక, మూడు రాజధానులంటూ మూడుముక్కలాటాడారు. తెలంగాణకు హైదరాబాదు, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధాని నగరాలుగా ఉంటూ లక్ష కోట్ల ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్నాయని గుర్తు చేస్తూ..అలాగే అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్‌గా ముఖ్యమంత్రి రూపకల్పన చేసిన ప్రాజెక్టు ఉత్తమమైనది గుర్తు చేశారు. అమరావతి రాజధాని ఫలితంగా ఏటా లక్ష కోట్లు ఆదాయం వస్తుందన్నారు. ఈ లక్ష కోట్లతో 175 నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చున్నారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీరామ్ తాతయ్య, తంగిరాల సౌమ్య, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఐడీసీఎండి తిరుమలరావు, కేడీసీ సీఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## విశాఖ -ముంబయి ఎల్‌టీటీకి
# నిడదవోలులో హాల్ట్ మంజూరు

**కేంద్రానికి ఎంపీ పురందేశ్వరి కృతజ్ఞతలు**

నిడదవోలు (చైతన్య రథం): నిడదవోలు రైల్వే స్టేషన్‌లో విశాఖపట్నం-ముంబై లోకమాన్య తిలక్ టెర్మినస్ (ఎల్‌టిటి) ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ మంజూరైనందుకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేస్తూ కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. "ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాను చేసిన విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే బోర్డు అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. ఈ హాల్ట్‌తో గోదావరి జిల్లాల ప్రజలకు దేశ ఆర్థిక రాజధాని ముంబైతో మరింత మెరుగైన రైల్వే అనుసంధానం ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు ఈ నిర్ణయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా రైల్వే మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ, రైల్వే సేవలను మరింత విస్తరిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలు అభినందనీయమని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు.



# హజ్-2026 విజయవంతం

**హాజీల ఖాతాల్లో ప్రభుత్వ సాయం రూ.లక్ష జమ**

**సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపిన కమిటీ చైర్మన్ భాషా**

విజయవాడ (చైతన్య రథం): హజ్ యాత్ర-2026కు ఏపీనుంచి వెళ్లిన యాత్రికులంతా సురక్షితంగా స్వదేశానికి చేరుకోవడం సంతోషంగా ఉందని హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ భాషా తెలిపారు. ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ భాషా శుక్రవారం విజయవాడ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది ఏపీ నుంచి విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ల ద్వారా 2వేలమంది హాజీలు పవిత్ర మక్కా యాత్రకు వెళ్లి, విజయవంతంగా పూర్తి చేసుకుని సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారన్నారు. యాత్ర మొత్తం రాష్ట్ర హజ్ ఇన్‌స్పెక్టర్లు, ఖాదీముల్ హుజ్జాజ్ హాజీలకు నిరంతరం సేవలందిస్తూ అన్ని విధాలా అండగా నిలిచారని వివరించారు.



ఎన్నికల హామీ మేరకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ద్వారా హజ్ యాత్రకు వెళ్లిన ప్రతి అర్హుడైన హాజీకి రూ.లక్ష ఆర్థిక సహాయం అందచేసి సీఎం చంద్రబాబు మాట నిలుపుకున్నారని హసన్ భాషా ఆనందం వ్యక్తం చేశారు. పవిత్ర మక్కా భూమిపై రాష్ట్ర ప్రజల సంక్షేమం, ప్రభుత్వ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్టు హాజీలు పేర్కొన్నారన్నారు. మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, ఐటీ మంత్రి లోకేష్, మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్‌కు ముస్లిం సమాజం, హాజీలు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారని బాషా పేర్కొన్నారు.

## విశాఖ డైరీ అక్రమాలపై
# 7న ప్రత్యేక హౌస్ కమిటీ భేటీ

అమరావతి (చైతన్య రథం): విశాఖ డైరీపై వచ్చిన అవినీతి అక్రమాల ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఈనెల 7న ఉదయం 11గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్లో ప్రత్యేక హౌస్ కమిటీ సమావేశం జరగనుందని రాష్ట్ర అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర వెల్లడించారు.
ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. వాస్తవానికి గతనెల 29న హౌస్ కమిటీ సమావేశం జరగాల్సి ఉండగా.. అనివార్య కారణాలవల్ల వాయిదా పడడంతో 7న నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

## ప్రభుత్వ విజయాల్ని ప్రజల్లోకి తీసుకుపోండి

### • మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సూచన



అరకు (చైతన్యరథం): అరకు పార్లమెంట్ పరిస్థితులపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ శు క్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అరకు పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి, సంక్షేమం, పార్టీ పరిస్థితులు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై మంత్రి సమగ్ర వివరాలు అందించారు. పార్టీ బలోపేతం కోసం ప్రస్తుత పరిస్థితిని మరియు చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రత్యేక సమాలోచనలు జరిగాయి. రాష్ట్రంలోని 9 ఐటిడిఏల ప్రస్తుత పరిస్థితులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై మంత్రి వివరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గిరిజన ప్రాంతాల్లో విషజ్వరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సూచన మేరకు వారం రోజుల్లో అరకు పార్లమెంట్ ఏడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో విస్తృత సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతంతో పాటు కార్యకర్తలకు ఉత్తేజం కలిగించేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణ చేపట్టాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి సూచించారు. పార్వతీపురం మన్యం, అరకు, పోలవరం జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.

## అమరావతి ద్రోహి జగన్‌రెడ్డి! 2029లో కూడా ఓటమి తప్పదు : ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు



అనకాపల్లి (చైతన్యరథం): 2024లో అమరావతికి మద్దతుగా ప్రజలిచ్చిన తీర్పుని జగన్ రెడ్డి అపహాస్యం చేస్తూ, అమరావతి విషయంలో వారానికి ఒకరోజు గంటలు తరబడి ప్రెస్ మీట్‌లు పెట్టి అమరావతికి వ్యతిరేకం కాదు అక్కడ అవినీతికి వ్యతిరేకమని ఒకరోజు, మరో వారంలో మూడు రాజధానిలకి కట్టుబడి ఉన్నామని మా పార్టీ విధానమని మరో నాయకుడు బొత్సతో మాట్లాడేస్తారని, ఇప్పుడు అమరావతి వర్సెస్ మవిగన్ అంటూ కొత్త డ్రామాలు మొదలు పెట్టారని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019కి ముందు అమరావతే రాజధాని, 50,000 ఎకరాలకు తక్కువ లేకుండా ఉండాలని శాసనసభలో మద్దతు తెలిపి, ప్రజలను నమ్మించి ఎన్నికల్లో లబ్ది పొందిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని అన్నారు. 2024 ఎన్నికలలో జగన్ రెడ్డి పార్టీకి 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా లేకుండా చేసినప్పటికీ ఇంకా జగన్ రెడ్డికి బుద్ధి రాలేదని, నిత్యం వంకర బుద్ధితో మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతూ క్రిమినల్స్‌ని ప్రోత్సహిస్తూ, వారిని పరామర్శిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తూ, మావిగన్ అంటూ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అమరావతి నిర్మాణంలో అవినీతి జరుగుతుందంటూ, ప్రపంచ బ్యాంకులకు పెట్టుబడిదారులకు మెయిల్స్ పంపిస్తూ బెదిరిస్తూ అమరావతిలో పరిశ్రమలు రాకుండా, పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టకుండా వెనక్కి పోయే విధంగా రాష్ట్రాన్ని అల్లకల్లాలం చేయడానికి, శాంతిభద్రతలు లేవని, రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేదని కూటమి ప్రభుత్వం అరాచకం చేస్తుందని జగన్ రెడ్డి మాటలు చూస్తుంటే దెయ్యాలు వేదాల వల్లించిన చందంగా ఉందన్నారు.

## సత్వరమే ప్రజా సమస్యలకు పరిష్కారం

### • అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



విజయనగరం (చైతన్యరథం): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను అధికారులు, ఉద్యోగులు తీసుకోవాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. శు క్రవారం తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సత్వరమే ప్రజా సమస్యలకు పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఉద్యోగులు, ప్రజలు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : మంత్రి వంగలపూడి



విజయనగరం (చైతన్యరథం): గంట్యాడ మండలం గొర్రెపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి జలాశయం నుంచి శుక్రవారం హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రజలందరూ ఆనందంగా జీవించాలని సీఎం చంద్రబాబు నాయుడు కోరుకుంటున్నారని చెప్పారు. ఆ దిశగా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని వివరించారు. రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు నీరు అందిస్తామన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా మొదటి ప్రాధాన్యత : ఎమ్మెల్యే సొంగా




చింతలపూడి (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత అని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. వారి సమస్యలు విన్న ఎమ్మెల్యే.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, సత్వర పరిష్కారం చూపడం తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## 900, 999 నెంబర్ బస్సులు పునరుద్ధరించాలి

### : పీజీఆర్ఎస్‌లో అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గంటా




విశాఖపట్నం (చైతన్యరథం): భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జీవీఎంసీ పరిధిలోని వివిధ వార్డులతో పాటు భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి పలువురు సమస్యలపై అర్జీలు సమర్పించారు. భీమిలి పాలిటెక్నిక్ కాలేజీకి తిరిగే 900 నెంబర్ బస్సులను నిలిపివేయడం వల్ల రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థినులు చెప్పారు. ఈ కాలేజీ విద్యార్థినుల్లో ఎక్కువ మంది దిగువ మధ్యతరగతి వారేనని ప్రత్యామ్నాయ రవాణా మార్గాల ద్వారా రావడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని లెక్చరర్ రూప చెప్పారు. దీనిపై ఆర్టీసీ ఆర్.ఎం. అప్పలనాయుడుతో మాట్లాడి 900, 999 నెంబర్ బస్సులు పునరుద్ధరించాలని ఆదేశించారు. అలాగే 4 వార్డు ఐ.ఎన్.ఎస్. కళింగ, నిడిగట్టు తదితర ప్రాంతాల మీదుగా బస్సు నడపాలని స్థానికుల విజ్ఞప్తి పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వార్డులో మొదటిదశలో రూ.10 కోట్ల పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కోసం సీఎల్డీపీ కింద భూములు అప్పగించిన 520 మందికి గతంలో హామీ ఇచ్చిన విధంగా 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలివ్వాలని కోరారు. 1 వ వార్డులో రేషన్ డిపో మంజూరు చేయాలని, రోడ్డు నిర్మించాలని ఆ వార్డు నివాసితులు విన్నవించారు. సాయిబాబా ఆలయం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ 6 వార్డుకు చెందిన మాజీ ఏయూ ఉద్యోగి ప్రసాదరావు వినతి పత్రం సమర్పించారు. భీమిలి మండలంలో దాకమర్రి, మజ్జివలస, మజ్జిపేట, సింగనబందల్లో రీ సర్వే సరిగా చేయలేదని, మళ్లీ జరిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు కోరారు. ముకుందపురంలో సాగులో ఉన్న భూములను ఆక్రమించుకుని పెద్దఎత్తున నియమించుకున్న ప్రైవేట్ సెక్యూరిటీతో దౌర్జన్యం చేయిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయగా, ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని రెవిన్యూ సిబ్బంది నిగ్గు తేల్చాలని ఆదేశించారు. నేరళ్లవలసలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, నిర్మాణం మొదలు పెడితే రెవెన్యూ అధికారులు నిలిపివేస్తున్నారని మహిళలు కొందరు ఎమ్మెల్యేకు చెప్పారు. 5, 6, 8 వార్డుల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని ఆయా ప్రాంతాల ప్రజలు గంటా దృష్టి తీసుకురాగా తాత్కాలికంగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, రూ.750 కోట్ల తాగునీటి ప్రాజెక్టు పూర్తయితే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వెల్లడించారు. ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఎన్ని పరిష్కారమయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనేది సీవీఏపీ సిబ్బందితో సమీక్షించారు.

## విశాఖలో ఎం.వి.వి.ఎస్ మూర్తి 88వ జయంతి వేడుకలు... పాల్గొన్న ఎంపీ శ్రీభరత్



విశాఖపట్నం (చైతన్యరథం): రాజకీయ, సాంస్కృతిక, సామాజిక సేవారంగాల్లో చెరగని ముద్రవేసుకున్న ఎం.వి.వి.ఎస్ మూర్తి ఆశయసాధనకు ఒక మనమడుగా తన వంతు బాధ్యతను నెరవేరుస్తానని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో కీ.శే.డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి 88వ జయంతి వేడుకలను శుక్రవారం విశాఖలోని డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో పలువురు కళాకారులు ఆపాత మధుర గీతాలను ఆలపించారు. అనంతరం జరిగిన సభాకార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ... విశాఖపట్నంతో తాత ఎం.వి.వి.ఎస్ మూర్తికున్న అనుబంధం విడదీయలేనిదన్నారు. అన్నివర్గాల ప్రజలకు ఆప్తుడుగా ఆయన పొందిన కీర్తిని చూస్తోంటే తనకెంతో గర్వకారణంగా వుందన్నారు. ఆయనతో సన్నిహితంగా మెలిగిన వారు, శ్రేయోభిలాషులు తాత గురించి వారికుండే అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ వుంటే అయన మన మధ్యలోనే వున్నారనే భావన తనకు కలుగుతోందన్నారు. ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... పారిశ్రామికవేత్తగా, రాజకీయవేత్తగా, మానవతామూర్తిగా డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి విశాఖప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతారన్నారు. సాంస్కృతిక సేవారంగాల్లో కూడా ఆయన కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, ఆత్రేయ స్మారక కళాపీఠం నిర్వహకులు గంటి మురళి, సంఘసేవకులు చెరువురామకోటయ్య, ఎం.వి.వి.ఎస్ మూర్తి సమకాలీనులు, అభిమానులు, కళాభిమానులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆర్థిక సహాయం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): పేదరికం కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) మరోసారి తన సేవాభావాన్ని చాటిచెప్పారు. తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక 41వ డివిజన్‌కు చెందిన ఓ పేద విద్యార్థికి విద్యా ఫీజుల నిమిత్తం తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంటనే స్పందించి, ఉన్నత విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఫీజుల కోసం ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ "పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదు... చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి విద్యార్థికి తమ వంతు సహాయం అందించేందుకు భవాని చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజానికి సేవ చేయాలని, విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడితో సమానం" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కూడా విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు దాతల సహకారం కూడా పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో కూడా విద్య, వైద్యం, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వద్రే శ్రీనివాసరావు, కొల్లి బుజ్జి, చాపల చిన్నరాజు, సలాది ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి ఉద్యోగ కల్పనే లక్ష్యం

**●పోలవరం-ఏలూరు కాలువ అనుసంధానానికి రూ.38 కోట్ల నిధులు.. సీఎం చంద్రబాబుకు యార్లగడ్డ కృతజ్ఞతలు**

గన్నవరం (చైతన్యరథం): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలంలోని కోడూరుపాడు, శేరి నరసన్నపాలెం, వీరవల్లి గ్రామాల్లో రూ. 1.07 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వీరవల్లిలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో ఈ నెల 17న ఉచిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ ద్వారా బీఎస్సీ, బీకాం (కంప్యూటర్స్), బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ పొందితే ప్రముఖ ఐటీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందే వీలుంటుందని చెప్పారు. ఈ శిక్షణపై ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన యువతను నమోదు చేయించాలని పార్టీ నాయకులు, అధికారులను ఆదేశించారు. దేశంలో రాబోయే కాలంలో ఏఐ, సెమీకండక్టర్ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గన్నవరం నియోజకవర్గ యువతకు మంచి ఉద్యోగాలు రావడమే తనకు అత్యంత సంతృప్తినిచ్చే అంశమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో మౌలిక వసతులు దెబ్బతిన్నాయని, ప్రస్తుత ప్రభుత్వం నిధుల కొరత ఉన్నప్పటికీ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందన్నారు.

# ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం : ఎమ్మెల్యే నక్కా



వేమూరు (చైతన్యరథం): వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీమంత్రి నక్కా ఆనందబాబు భట్టిప్రోలు మండలంలోని మార్కెట్ యార్డ్, భట్టిప్రోలు గ్రామంలో నిర్వహించిన "మీకోసం" ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థనలను స్వయంగా స్వీకరించి ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి, తక్షణ చర్యలు తీసుకుని పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల నుండి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా అందేలా "మీకోసం" కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు మండలానికి చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు



బాపట్ల (చైతన్యరథం): నియోజకవర్గ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, వారికి మెరుగైన సేవలందించడమే ధ్యేయంగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగానే, బాపట్ల పట్టణ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని 'నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్' (పీ-4) కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్' నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, వార్డుల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మరాజు ప్రజల బాధలను, సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి నుండి వినతి పత్రాలను (అర్జీలను) స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ... "ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ఈ 'ప్రజాదర్బార్' ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలిస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం. ప్రజా సంక్షేమమే మా మొదటి ప్రాధాన్యత," అని ఆయన స్పష్టం చేశారు. వచ్చిన అర్జీలలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మిగిలిన సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే గారి చొరవ పట్ల, సమస్యలను స్వయంగా ఆలకించిన తీరు పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల కోసం వారధిగా నిలిచిన ఎమ్మెల్యే చింతమనేని

**●ఆటోలోనే ఉండి రాలేక పోయిన దివ్యాంగుల వద్దకు స్వయంగా వెళ్లి అర్జీలు స్వీకరించి మానవత్వం చాటుకున్న ప్రజాప్రతినిధి**



దెందులూరు (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి, వారి ముఖాల్లో ఆనందం నింపడమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఆశయమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం దెందులూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి అధ్యక్షతన "1 నెల - 1 నియోజకవర్గం - 4 పర్యటనలు" ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన ఉన్న స్థితిగతులపై పరిపూర్ణ అవగాహన కలిగిన ఒక అసలైన ప్రజా నాయకుడైన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తానే ఒక సారధిగా, వారధిగా నిలిచి నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన వందలాది మంది ప్రజల అర్జీల పరిష్కారంలో కీలక భూమిక పోషించి ప్రజల మన్ననలు అందుకున్నారు.

### ప్రజా సమస్యలపై సుదీర్ఘ చర్చ - కలెక్టర్ తక్షణ స్పందన

ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి సామాజిక, వ్యక్తిగత, భూ పట్టాలు, అనారోగ్య సమస్యలు, పింఛన్ల మంజూరు, ప్రభుత్వ పథకాల లబ్ధి, రెవెన్యూ ఇబ్బందులు, అర్హుల అభ్యర్థనలు మరియు గత ప్రభుత్వంలో జరిగిన అనర్హుల లబ్ధిపై ఫిర్యాదులతో ప్రజలు పోటెత్తారు. వచ్చిన ప్రతి అర్జీదారుని సమస్యను జిల్లా కలెక్టర్ సెల్వితో పాటు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కూడా స్వయంగా ఆలకిస్తూ, అటు ప్రజలకు ఇటు అధికారులకు మధ్య వారధిగా నిలిచి జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి అర్జీదారుల సమస్యలతో పాటు ఆయా గ్రామాల్లోని స్థితిగతులను, సమస్యలను సైతం క్షుణ్ణంగా వివరించారు. కలెక్టర్ వెట్రి సెల్వి కూడా ప్రతి అర్జీదారునితో ఎంతో ఓపికగా మాట్లాడి, సమస్యలను తెలుసుకుని సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. సీతంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జ్, రైతు భరోసా సాయం, న్యూ ఎన్టీఆర్ నగర్ మౌలిక వసతులు, నకిలీ పింఛన్ల ఏరివేత తదితర అంశాలపై వినతులు స్వీకరించారు.

### దివ్యాంగుల పట్ల కలెక్టర్, ఎమ్మెల్యే మానవత్వం

తమ శారీరక సమస్యతో సమావేశ ప్రాంగణంలోకి రాలేక బయట ఆటోలోనే ఉండిపోయిన కొవ్వలి గ్రామానికి చెందిన జామి సాయికుమార్, నేరుసు మణికంఠ అనే దివ్యాంగులను కలెక్టర్ వెట్రి సెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా వారి ఆటో వద్దకే వెళ్లి అర్జీలు స్వీకరించి సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. వచ్చే శుక్రవారంలోగా సమస్యలు పరిష్కారం కావాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

### కలెక్టర్‌కి ఎమ్మెల్యే చింతమనేని కృతజ్ఞతలు 22ఏ భూములపై ప్రత్యేక గ్రీవెన్స్

దెందులూరు నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం ద్వారా ముందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ శ్రీమతి వెట్రి సెల్వికి నియోజకవర్గ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చే శుక్రవారం నాడు పెదవేగి మండలంలోని 22ఏ నిషేధిత భూముల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఇక్కడే ప్రత్యేక గ్రీవెన్స్ కూడా నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. అదేవిధంగా మూడో శుక్రవారం నాడు మిగతా మూడు మండలాలైన దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల 22ఏ సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని, నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# పోలవరంలో టీడీపీ నేత బొరగం శ్రీనివాసులు ప్రజాదర్బార్



పోలవరం (చైతన్యరథం): పోలవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు శుక్రవారం బుట్టాయగూడెం మండలం పులిరామన్న గూడెం మరియు నియోజకవర్గం క్యాంప్ కార్యాలయం బుసరాజుపల్లిలో ప్రత్యేక "గ్రీవెన్స్" కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు, మహిళలు, రైతులు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను శ్రీనివాసులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఆయన, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి.. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ... "కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యకు న్యాయం జరుగుతుంది. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా ఈ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పోలవరం సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సున్నం నాగేశ్వరావు, బడిశా ముత్యాలరావు, మడి సోమరాజు, కాకి లక్ష్మి, కేరం వెంకటేశ్వరావు, మడకం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

# వేదాద్రి - కంచెల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

**● రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**



జగ్గయ్యపేట (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలోని వేదాద్రి--కంచెల ఎత్తిపోతల పథకంలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.33 లక్షలతో ఏర్పాటు చేసిన ఒక పంపును ప్రారంభించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.15 కోట్లతో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఘనంగా శంకుస్థాపన చేశారు.

**ఈ సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ...** జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని 17,366 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అత్యంత కీలకమైన పథకం వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకమని తెలిపారు. 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకం నిర్వహణ కోసం రూ.5.36 కోట్లు ఖర్చు చేసి రైతులకు సాగునీరు అందించిందన్నారు. అనంతరం గత ప్రభుత్వం నిర్వహణకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో 2021 నుంచి ఈ పథకం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 1,023 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల్లో కేవలం 166 మాత్రమే పనిచేసే పరిస్థితి గత పాలనలో ఏర్పడిందని, ఐదేళ్లపాటు మరమ్మతులు చేయకపోవడంతో లక్షలాది ఎకరాల ఆయకట్టు సాగునీటికి దూరమైందని అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ కింద ఉన్న 8.2 లక్షల ఎకరాల్లో దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

**విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ....**

వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ రైతులకు శుభదినమని పేర్కొన్నారు. ఈ పథకం కోసం ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రిని పలుమార్లు కలిసి సమస్యను వివరించామని చెప్పారు. ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), తంగిరాల సౌమ్యతో కలిసి ఎంపీ నిధుల నుంచి రూ.33 లక్షలు కేటాయించి పంపు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు.

**జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ...**

కంచెల-వేదాద్రి ఎత్తిపోతల పథకం జగ్గయ్యపేట రైతుల చిరకాల స్వప్నమని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. పోలంపల్లి ప్రాజెక్టు కూడా ఈ ప్రాంత వ్యవసాయాభివృద్ధికి అత్యంత కీలకమని పేర్కొంటూ, అది పూర్తయితే అనేక గ్రామాలకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

**ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ...**

వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకం రైతులకు ఎంతో కీలకమని, ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ఈ పథకం నిర్లక్ష్యానికి గురికావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని, అనంతరం వచ్చిన ప్రభుత్వం దానిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మోటార్లు, షట్టర్లు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యం : ఎమ్మెల్యే నసీర్




గుంటూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేశామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లో విద్యార్థులకు దాతల సాయంతో జామంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి ఒక్క తట్ట మట్టి కూడా వేయలేదని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి విషయంలోనూ తీవ్ర నిర్లక్ష్యం వహించారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మొదటి ఫైల్‌గా బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం చేపట్టానని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో రూ.4.50 కోట్లతో అత్యాధునిక వసతులతో 260 మంది విద్యార్థులకు సరిపడా బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. హాస్టల్ నుంచి ఉర్దూ బాలుర పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ వారితో మాట్లాడి బస్సు ఏర్పాటు చేయించానన్నారు. విద్యార్థులకు జామంట్రీ బాక్సులు లేవని చెప్పడంతో దాతలు మిర్చియార్డు డైరెక్టర్ కొనకళ్ల సత్యనారాయణ, కోట శేషగిరి సహకారంతో 135 మందికి అందించామని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ఈ కారణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫొటోలు పేపర్లలోని మొదటి పేజీల్లో ప్రచురితమయ్యే ఫలితాలు సాధించారన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలను సందర్శిస్తూ అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్స్ అందిస్తున్నామని తెలిపారు.

# పామాయిల్ రైతులతో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, ఎంపీ లావు సమావేశం



వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గం ఈపూరు మండలం బొమ్మరాజుపల్లి గ్రామంలో పామాయిల్ రైతులతో ప్రభుత్వ చీఫ్ విప్, జీవి ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పామాయిల్ సాగు అవగాహన స్టాల్స్‌ను వారు పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి పామాయిల్ మొక్కలను నాటారు. వారు మాట్లాడుతూ... రైతులు సాంప్రదాయ పంటలతో పాటు అధిక లాభాలు తెచ్చిపెట్టే పామాయిల్ వంటి వాణిజ్య పంటల సాగు వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున పామాయిల్ రైతులకు అవసరమైన రాయితీలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ సదుపాయాలు అందిస్తూ పూర్తి మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రాధాన్యం : వీరంకి వెంకట గురుమూర్తి



అవనిగడ్డ (చైతన్యరథం): కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తిగారు అవనిగడ్డలోని రెవెన్యూ కల్యాణ మండపంలో ప్రజదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతుల స్వీకరించి వారి సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు వారి సమస్యలను సత్వర పరిష్కారం చూపడం ప్రభుత్వ లక్ష్యమని గురుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజల పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ : పెడన ఎమ్మెల్యే కాగిత



పెడన (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం చేపడుతున్నామని పెడన నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ వ్యాఖ్యానించారు. శుక్రవారం నియోజకవర్గంలోని తోటముల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లో వివిధ సమస్యలు, రెవిన్యూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు నుండి వినతులును స్వీకరించిన ఆయన... ప్రజలు ఇస్తున్న వినతులపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా జవాబుదారీతనంగా ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలు గురించి సమాచారం తనకు చేరవేయాలని అధికారులను ఎమ్మెల్యే కాగిత ఆదేశించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ అధికారులు రైతులకు తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాబ్ మేళా పోస్టర్‌ను లాంచ్ చేసిన ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ( ఎంపీ కార్యాలయం) విజయవాడ గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో బి.ఎన్.ఐ విజయవాడ సభ్యులు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు ఈ భేటీలో బిఎన్ఐ విజయవాడ పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జాబ్ మేళాను ఏపీ స్కిల్ డెవలప్మెంట్ సహకారంతో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు జులై 12 ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సిద్ధార్థ కాలేజ్ మొగల్రాజపురంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ చిన్ని బి ఎన్ ఐ జాబ్ మేళా పోస్టర్ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ బి ఎన్ ఐ విజయవాడ పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముందుగా సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు స్కిల్ డెవలప్మెంట్ సహకారంతో ఇంత పెద్ద జాబ్ మేళా విజయవాడలో జరగడం గొప్ప విషయం అని తెలియజేశారు ఈ జాబ్ మేళాలో దాదాపు 100కు పైగా ప్రముఖమైన కంపెనీలు అనేక రకాల పరిశ్రమలు నేరుగా ఈ జాబ్ మేళాలో పాల్గొని నిరుద్యోగుల అందరిని నేరుగా రిక్రూట్ చేసుకోవడం శుభ పరిణామం అని తెలియజేశారు ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న బి ఎన్ ఐ విజయవాడ సభ్యులను అభినందించారు. యువత అందరూ ఈ జాబ్ మేళాను ఉపయోగించుకొని వారి వారి విద్యార్హతను బట్టి ప్రతి ఒక్కరు ఈ జాబ్ మేళాలో పాల్గొనాలని తెలియజేశారు.

# రూ.550 కోట్లతో సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

**●రూ.82 కోట్లతో 21 డివిజన్లకు శాశ్వత తాగునీటి ప్రాజెక్టు త్వరలో ప్రారంభం**

**● ప్రజలు సమస్య చెబితే వెంటనే పరిష్కారం : ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ (చైతన్యరథం): స్థానిక మహిళల విజ్ఞప్తికి వెంటనే స్పందించి రాధానగర్ పార్కు ను పరిశీలించి, అభివృద్ధి పనులకు కూడా పరిపాలనా అనుమతులు మంజూరు చేయించి, అతి త్వరలో పనులను ప్రారంభించి ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. 2014కు ముందు రాజీవ్ నగర్ ప్రాంతంలో కనీస మౌలిక వసతులు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, రోడ్లు అధ్వాన్నంగా ఉండటం, వర్షం వస్తే ఇళ్లలోకి మురుగునీరు చేరడం వంటి సమస్యలు నిత్యకృత్యంగా ఉండేవని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా ఈ సమస్యలపై అనేక ఆందోళనలు నిర్వహించామని తెలిపారు. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత రాజీవ్ నగర్‌ను అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని చెప్పారు. నాణ్యమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వాటర్ ట్యాంక్, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి కీలక మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఒకప్పుడు స్లమ్‌గా ఉన్న ప్రాంతం అభివృద్ధి చెందిన కాలనీలతో పోటీ పడే స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. 2024లో మరోసారి ప్రజలు ఆశీర్వదించిన అనంతరం సెంట్రల్ నియోజకవర్గంలో భారీ ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల రూ.98.68 కోట్లతో ఎల్‌సీ-316 రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, వచ్చే వారం నుంచి రూ.82 కోట్ల వ్యయంతో వాంబే కాలనీలో రా వాటర్ ఫిల్ట్రేషన్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసా : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు (చైతన్యరథం): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి 26వ విడత చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 20 మంది లబ్ధిదారులకు రూ.8.38 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మొత్తం 921 చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వాటి ద్వారా రూ.9.32 కోట్ల ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు.

## బీడీఎల్ రాకతో దొనకొండకు మహర్దశ : గొట్టిపాటి లక్ష్మీ హర్షం



దొనకొండ (చైతన్యరథం): జిల్లాలో వెనుకబడిన దొనకొండలో పారిశ్రామిక అభివృద్ధికి బీడీఎల్ ప్రాజెక్టు ఏర్పాటుకు చొరవ తీసుకోవడం హర్షణీయమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ వ్యాఖ్యానించారు. బీడీఎల్ రాకతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని లక్ష్మీ తెలిపారు. వందలాది మంది నిరుద్యోగులకు బీడీఎల్ పరిశ్రమ ద్వారా ఉపాధి లభిస్తుందన్నారు. అవసరమైన భూమిని ప్రభుత్వం అందించేందుకు జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని తొలి అడుగు వేయడం అభినందనీయమన్నారు. వెంటనే బీడీఎల్ పరిశ్రమకు అవసరమైన భూమిని అందించేందుకు అడ్డంకులు తొలగించి ముందుకు వెళ్లాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా దొనకొండలో వలసలు నివారించి అభివృద్ధి వైపు అడుగులు వేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు చేస్తున్న కృషిని అందరం అభినందించాలన్నారు. రాబోయే ఐదేళ్లలో దొనకొండ దశదిశ మార్చే లక్ష్యంగా బీడీఎల్ పరిశ్రమ ఏర్పాటు జరుగుతుందన్నారు. ఇందుకు సహకరిస్తున్న అధికార యంత్రాంగానికి ప్రజలకు లక్ష్మీ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ... ఐటీ విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధతో దొనకొండలో బీడీల్ ప్రాజెక్టుకు అవసరమైన స్థలాన్ని అందించాలని కోరడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే డి.ఆర్.డి.ఏ అధికారులతో స్థల పరిశీలన చేయడం జరిగిందని వెంటనే స్థలాన్ని వారికి ఇవ్వడం జరుగుతుందన్నారు. బీడీఎల్ ద్వారా ప్రత్యక్షంగా 500 మందికి పరోక్షంగా అనుబంధ పరిశ్రమల ద్వారా రెండు వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని తద్వారా ఉపాధి జరుగుతుందన్నారు. అందులో దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ కృషి కూడా ఉందని కలెక్టర్ తెలిపారు. వెంటనే స్థలాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను కోరారు.

## దళితుల సోదరుల పెన్నిధి కందుల నారాయణరెడ్డి



మార్కాపురం (చైతన్యరథం): ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలైన మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్, మహాజన సోషల్ పార్టీ, దళిత క్రిస్టియన్ ఐక్యవేదిక నాయకులు శుక్రవారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిని కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ... మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి దళిత క్రిస్టియన్ సోదరుల వెన్నంటే ఉండి వారికి ఏ కష్టం వచ్చినా తానున్నానని ఆదుకుంటున్నారని అడిగిన వెంటనే ఒక నిమిషం కూడా ఆలోచించకుండా దళిత మరియు క్రిస్టియన్ సోదరుల పని చేసి పెడుతున్నారని అన్నారు. దళిత మరియు క్రిస్టియన్ సోదరుల పట్ల అత్యంత ప్రేమ కలిగి ఉండి ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటున్నారని ఎప్పుడు ఏ పని వచ్చిన తనను ఏ సమయంలోనైనా కలవవచ్చుని అన్నారని ఇంతకుముందు ఏ ప్రజా ప్రతినిధి ఈ రకంగా దళితులను క్రిస్టియన్లను ప్రోత్సహించలేదన్నారు. దీనికి ఉదాహరణ 1.7.2026న తేదీన ఏబీఎం హైస్కూల్‌ను భూ బకాసురుల కొరల నుండి కాపాడి తిరిగి ఏబీఎం స్కూల్‌ను ప్రారంభించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, దళిత, క్రిస్టియన్ సంఘాల నాయకులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## చీరాల ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య

చీరాల (చైతన్యరథం): ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమం చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ప్రజల వద్ద నుండి వినతుల అర్జీలను స్వీకరించారు. మొత్తం 26 పైగా అర్జీలు రాగా వీటిలో ఇంటి నిర్మాణాల కోసం, ఇంటి స్థలాల కోసం 5, 15 పింఛన్లు , 2 సీఎంఆర్ఎఫ్ ఫైల్స్ , 4పలు సమస్యలపై అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చావీజ చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల మండల అధ్యక్షుడు గంజి పురుషోత్తం జనసేన నాయకులు గూడూరు శివరాం ప్రసాద్, కారంపూడి పద్మిని, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లలిత, పట్టణ అధ్యక్షులు సురేష్ , పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి నాగేంద్రమణి,



నాగలక్ష్మి, కూటమి నాయకులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి నారాయణ సేవా సంకల్పం

- ●నారాయణ ఆన్ వీల్స్‌తో పేదల ముంగిటకే కార్పొరేట్ వైద్యం
- ●నెల్లూరు 9వ డివిజన్‌లో మెగా హెల్త్ క్యాంప్.. బంగ్లాతోటలో ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన
- ●ఇప్పటి వరకు 9,300 మందికి కంటి పరీక్షలు, 150 మందికి ఉచిత ఆపరేషన్లు



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు నగరంలో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సేవా సంకల్పంతో నిరుపేద, మధ్యతరగతి ప్రజల కోసం నారాయణ నేత్ర జ్యోతి మరియు నారాయణ దంత సురక్ష ఉచిత మెగా హెల్త్ క్యాంప్ 9వ డివిజన్ బంగ్లాతోటలో జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ ఆధ్వర్యంలో అప్రతిహతంగా జరిగింది. ఈ సందర్భంగా కువ్వారపు బాలాజీ మాట్లాడుతూ.. కోట్ల రూపాయల భారీ వ్యయంతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని నిరుపేదల ముంగిటకే తెచ్చేందుకు 3 కోట్ల రూపాయలతో అత్యాధునిక నారాయణ ఆన్ వీల్స్ మొబైల్ క్లినిక్ వాహనాన్ని మంత్రి ఏర్పాటు చేశారని, ఈ సేవా యజ్ఞంలో భాగంగా ఇప్పటివరకు నెల్లూరు నగరంలో 9,300 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, 5,000 మందికి పైగా ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశామని వెల్లడించారు. అంతేకాకుండా తీవ్రమైన దృష్టి లోపాలతో బాధపడుతున్న 150 మందికి పైగా రోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి కంటిచూపును పునరుద్ధరించడం జరిగిందని, వైద్యుల ప్రత్యేక శ్రద్ధ కోసం ప్రతి క్యాంప్‌లో 60 మందికి మించకుండా నిశితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.. మంచి చేయాలనే తపన ఉన్న నాయకుడు ఎమ్మెల్యేగా ఉంటే నగరం ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంత్రి నారాయణ చొరవే నిదర్శనమని కొనియాడుతూ డివిజన్ ప్రజల తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సుధా ,రఫీ,9వ డివిజన్ అధ్యక్షులు పాకాల పెంచలయ్య, యూనిట్ ఇంచార్జ్ కొండ్రగుంట సురేష్, వెంగయ్య ఆటో యూనియన్ ప్రెసిడెంట్, చంద్రమౌళి బివిఎల్, కమల్, కో యూనిట్ ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరులో లెక్కలేనన్ని రెవెన్యూ సమస్యలు

● అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆగ్రహం



కందుకూరు (చైతన్యరథం): కందుకూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం శుక్రవారం జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, 147 అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ... లింగసముద్రంలో ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహిస్తే, 90 శాతం అర్జీలు రెవిన్యూ సమస్యలపై వచ్చాయని, నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి ఉండటం బాధాకరమన్నారు. పట్టా భూములు, అసైన్డ్ భూములు అన్న తేడా లేకుండా ఆన్లైన్‌లో అక్రమాలకు పాల్పడుతున్నారని, కిందిస్థాయి రెవిన్యూ సిబ్బంది ఇష్టం వచ్చినట్టు వ్యవహరించడం దారుణమన్నారు. రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పులకు రైతులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నా... ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములు, ఆన్లైన్‌లో వేరొకరి పేరుమీద ఉంటే, ఆ రైతుల ఆవేదన ఎలా ఉంటుందో ఆలోచించండి. బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. అధికారుల నిర్లక్ష్యానికి నాకు కోపం, బాధ రెండూ వస్తున్నాయి. ఎన్నిసార్లు చెప్పినా కొంతమంది అధికారుల తీరులో మార్పు రావడం లేదు. ఆ తప్పులన్నీ సరిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రౌండ్ లెవెల్ అధికారులు, వారి చేతుల్లో ఉన్నంతలో సమస్యలను పరిష్కరించండి. రైతులను పదేపదే తిప్పుకోవద్దు. అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## సిమెంట్ కంపెనీలు 6 శాతం ఆర్డీఎఫ్ వినియోగించాలి : పట్టాభిరాం

విజయవాడ (చైతన్యరథం): 2026 ఏప్రిల్ 1 జారీ అయిన స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం) తాజా నిబంధనల ప్రకారం సిమెంట్ కంపెనీలు తమ ఇంధన అవసరాల్లో కొంత భాగాన్ని రాష్ట్రంలో త్వరలో ప్రారంభమయ్యే ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాలు, ప్రస్తుత బయోమైనింగ్ లెగసీ వేస్ట్ ద్వారా వచ్చే రిఫ్యూజ్ డిరైవ్డ్ ఫ్యూయల్ (ఆర్డీఎఫ్)ను తప్పనిసరిగా వినియోగించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన సిమెంట్ కంపెనీల ప్రతినిధులతో విజయవాడ గురునానక్ కాలనీలోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) కార్యాలయం పర్యావరణ్ భవన్ లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెంట్ కంపెనీల వారు లెగసీ వేస్ట్, ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాలలో తయారయ్యే ఆర్డీఎఫ్ లో ఆరు శాతం తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ప్రతి కంపెనీ ఎస్‌బీఎం నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. సిమెంట్ కంపెనీల వారు ఆర్డీఎఫ్ వినియోగంపై ఖచ్చితమైన టైమ్ లైన్ అందజేయాలని కోరారు. సిమెంట్ కంపెనీల వారు ఆర్డీఎఫ్ వాడకానికి తగిన యంత్రాలను రిట్రోఫిటింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏ కంపెనీవారు ఎంత ఆర్డీఎఫ్ వినియోగిస్తున్నారో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారన్నారు. అలాగే, ఇందు కోసం ప్రత్యేకంగా ఒక మోనిటరింగ్ సెల్‌ని కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్‌బీఎం నిబంధనల ప్రకారం ఆర్డీఎఫ్ వినియోగించని కంపెనీలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య చెప్పారు.

జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపూరం, అనంతపురం, కడప)
చైతన్యరథం

# మంత్రి నారా లోకేష్‌ని అందుకునే స్థాయిలో నువ్వు లేవు

●ప్రకాష్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

●54 మందికి రూ.52 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

●క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం



రాప్తాడు (చైతన్యరథం): కారు బాంబు కేసులో 24 మందిని పొట్టన పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి లాంటివారికి మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడే స్థాయి ఏమాత్రం లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన 54 మంది లబ్ధిదారులకు 52 లక్షల రూపాయల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల టిడిపి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పేదవారికి ఆరోగ్య విషయంలో ఏ కష్టం వచ్చినా... ఈ ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్య సమస్యలతో చికిత్సలు పొందిన వారికి ఆర్థికంగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం చేస్తున్నట్లు చెప్పారు. గడిచిన రెండేళ్లలో 11.55కోట్ల రూపాయలు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం చేసినట్లు తెలిపారు. అలాగే మంత్రి నారా లోకేష్ ముందుచూపుతో కార్యకర్తలకు చేసిన ఇన్సూరెన్స్ వలన ఇప్పటివరకు ఎంతోమందికి సాయం అందిందన్నారు. అనుకోకుండా వారు చనిపోతే కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయల సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 2000 కోట్ల రూపాయల మేర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. మనం చేస్తున్న పనుల గురించి ప్రతి ఒక్కరు చర్చించుకునేలా నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే సునీత తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను ఓపికగా విన్నారు. కొన్ని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపించారు. మరికొన్నింటికి నిర్దేశిత సమయంలో పరిష్కారం అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ, విద్యుత్ సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపాలని ఆదేశించారు. ప్రజలను పదేపదే కార్యాలయాలు చుట్టూ తిప్పించుకోవద్దని సూచించారు.

**ప్రకాష్ రెడ్డి నీస్థాయి ఏంటో తెలుసుకో**

తనపై హత్యాయత్నం చేశారంటూ రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఆయన్ని చంపేది ఒకటే రోడ్డు మీద పిచ్చి పట్టి తిరుగుతున్న కుక్కని చంపేది కూడా ఒక్కటేనంటూ మండిపడ్డారు. ప్రకాష్ రెడ్డి నడిరోడ్లో ఒంటరిగా ఉన్నా కూడా ఎవరూ పలకరించే పరిస్థితి కూడా ఉండదని... అలాంటప్పుడు ఆయన్ను చంపే అవసరం ఎవరికి ఉందని నిలదీశారు. వాహనాన్ని రాంగ్ రూట్లో తీసుకువచ్చి టిప్పర్ తగిలిందని ఒక కొత్త డ్రామాలాడుతున్నారన్నారు. ఆయన వాహనానికి ఏదైనా డామేజ్ జరిగి ఉంటే ఎందుకు దానికి సంబంధించిన ఫోటోలు బయట పెట్టడం లేదన్నారు. అనుకోకుండా అక్కడ రోడ్డు పనులు చేస్తున్న ఎస్.ఆర్ కన్స్ట్రక్షన్‌కి సంబంధించిన టిప్పర్ రావడంతో అది కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు తాను కలిసి చేయించామని ఒక కొత్త నాటకం ఆడుతున్నారని విమర్శలు చేశారు. పైగా నారా లోకేష్ గురించి ప్రకాష్ రెడ్డి మాట్లాడటం పట్ల ఎమ్మెల్యే సునీత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ఆయన అహర్నిశలు కృషి చేస్తుంటే... ప్రకాష్ రెడ్డి ఇలాంటి వివాదాల్లోకి లాగుతున్నారన్నారు. నారా లోకేష్ ఊహించుకునే స్థాయి కూడా ప్రకాష్ రెడ్డికి లేదని స్పష్టం చేశారు. హత్యలు చేసే సంస్కృతి మీదని.. గతంలో కారు బాంబు పెట్టి 24 మందిని పొట్టన పెట్టుకున్న చరిత్ర మీదేనన్నారు. మీ స్వగ్రామానికి చెందిన మహేశ్వర్ రెడ్డి ఆత్మహత్యకు కూడా మీరే కారణమని సునీత అన్నారు. పరిటాల రవి చనిపోయి 21 ఏళ్లు గడిచినప్పటికీ కూడా నిద్రలో కూడా ప్రకాష్ రెడ్డికి ఆయన పేరు గుర్తుకొస్తోందన్నారు. ఇప్పటికైనా కనీస జ్ఞానం, సంస్కారంతో మాట్లాడటం నేర్చుకోవాలని ఎమ్మెల్యే సునీత హితవు పలికారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మన ప్రభుత్వ ధ్యేయం!

●కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్



కదిరి (చైతన్యరథం): కదిరి పట్టణం మున్సిపల్ 6వ వార్డు న్యూ అమీన్ నగర్, కందికుంట నారాయణమ్మ కాలనీల్లో 'ప్రజా దర్బార్' నిర్వహించారు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. హౌసింగ్ ,పెన్షన్లకు, రామాలయం గుడి నిర్మాణం, న్యూ అమీన్ నగర్ కాలనీ నందు కరెంట్ లో ఓల్టేజ్ సంబంధించిన పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలు సమర్పించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి మెజారిటీ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించాను. ప్రజల చెంతకే పాలనను తీసుకువెళ్లడమే లక్ష్యంగా, ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం చూపే వరకు నా కృషి కొనసాగుతుంది.

# తోపుదుర్తిని కొట్టినా, పిచ్చికుక్కను కొట్టినా ఒక్కటే

●చంద్రబాబుగారు, లోకేష్ గురించి మాట్లాడే ముందు ఒళ్లు దగ్గరపెట్టుకోవాలి

●లోకేష్ పేరు ఎత్తే నైతిక విలువ, అర్హత తోపుదుర్తికి లేవు

●అనంతపురంలో తోపుదుర్తి ఒక పులకేశి, సొంతపార్టీలో విలువలేని వ్యక్తి

●తోపుదుర్తి వివాదాస్పద వ్యాఖ్యలకు ఎం.ఎస్.రాజు, సురేంద్రబాబు, శ్రీరామ్ స్ట్రాంగ్ కౌంటర్



అనంతపురం (చైతన్యరథం): రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నారా లోకేష్, మాజీమంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుని ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలకు మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు మరియు శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ అనంతపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాను ఉద్దేశించి వారు ఈ క్రింది విధంగా మాట్లాడారు.

**ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ...** తోపుదుర్తి ఉత్తరకుమార ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదం. మీడియా సమావేశంలో తనను హత్య చేసేందుకు కుట్ర జరుగుతుందని పిచ్చి పిచ్చి ప్రేలాపనలు పేలాడు. తనను హత్య చేయడం కోసం నారా లోకేష్ అనంతపురంవచ్చి పథక రచన చేశారని, పరిటాల సునీత, సురేంద్రబాబుకి తనను చంపాలనే పని అప్పగించారని, తన టార్గెట్ లోకేష్ అని మతిభ్రమించిన మాటలు మాట్లాడాడు. తన ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం స్థాయిని మించిన మాటలు మాట్లాడాడు. అవకాశాలు కల్పించే స్థాయి లోకేష్‌ది, తోపుదుర్తిది యాచించే స్థాయి. కానీ లోకేష్ గురించి పెద్దపెద్ద మాటలు మాట్లాడడం శోచనీయం. తోపుదుర్తిలాంటి వ్యక్తులు, వైసీపీ నేతల మాదిరి హత్యా రాజకీయాలు మా పార్టీకి అలవాటు లేవు. తోపుదుర్తిపై ఎవరైనా దాడి చేస్తే...అది తోపుదుర్తి గతంలో ఎవరికో అన్యాయం చేస్తే ఆ బాధితులే చెయ్యాలి తప్ప... ఎవరికీ అంత అవసరం లేదు. ఒక పిచ్చికుక్కను చంపడం కోసం లోకేష్ హెలికాప్టర్‌లో అనంతపురం రావాల్సిన అవసరం ఉందా? తోపుదుర్తి అనే ఒక వ్యక్తి లోకేష్‌కి అసలు గుర్తుంటాడా? వైసీపీ నాయకులే తోపుదుర్తిని నాయకుడిగా గుర్తించే పరిస్థితి లేదు. వైసీపీ నేతలపైనే తోపుదుర్తి అక్రమ కేసులు పెట్టి వేధించి, ఆ నెపాన్ని టీడీపీ నేతలపైకి నెట్టిన నీచ చరిత్ర. ప్రకాష్‌రెడ్డి లాంటి వ్యక్తి 3నెలలకు ఒకసారి మీడియా ముందుకు వచ్చి సునీత, పరిటాల రవి, లోకేష్, చంద్రబాబు లాంటి వారిపై అడ్డగోలు కూతలు కూసి మళ్లీ ఎవరికీ కనిపించడు. ఈ రెండేళ్లలో తోపుదుర్తి ప్రజలకు ఉపయోగపడే ఒక్క పోరాటం అయినా చేశాడా? ప్రజాస్వామ్యబద్ధమైన ఏ విషయంలో తోపుదుర్తి ప్రభుత్వాన్ని నిలదీశాడు? తోపుదుర్తి గన్‌మెన్ల కోసం నీచమైన రాజకీయాలకు పాల్పడి తన పరువును పోగొట్టుకున్నాడు. అధికారంలోకి వస్తే ఏదో చేస్తానని అంటున్న తోపుదుర్తి... తాను అధికారంలో 5ఏళ్లు ఉన్నప్పుడు ఏమైనా పీకాడా? ఒక వ్యక్తిని బెదిరించి చనిపోయేలా చేసి, ఆ వ్యక్తి భార్యను సమాజంలో అవమానపర్చేలా నీచంగా మాట్లాడిన నీచమైన వ్యక్తి తోపుదుర్తి అని ఎం.ఎస్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ....** తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నోటికిష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. మా సంస్థ ఇతర రాష్ట్రాల్లోనూ మంచిపేరు సంపాదిస్తూ ముందుకు సాగింది. నేషనల్ హైవే ప్రాజెక్టులు బ్రహ్మాండంగా కొనసాగుతున్నాయి. సంస్థలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇస్తున్నాం. మా సంస్థలో అవినీతి, అక్రమాలు ఎక్కడా జరగలేదు. కొన్ని విషయాలను మేమే సీఐడీకి కేసును అప్పజెప్పాలని కోరాం. కానీ ఆ విషయాలను మాకు తోపుదుర్తి ఆపాదించడం సిగ్గుచేటు. మా టిప్పర్లు తోపుదుర్తిని గుద్దడానికి వచ్చిందని లేనిపోని ఆరోపణలు చేశాడు. ఈ ఆరోపణలు అన్నీ ఉద్దేశపూర్వకంగా చేసినవే. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన డ్రైవర్‌కు ప్రకాష్ రెడ్డి ఎవరో తెలుసా? మా టిప్పర్ డ్రైవర్‌ను తోపుదుర్తి కొట్టాడు, వాహనంపై రాళ్లదాడి చేశాడు. ఇవన్నీ చేసి నీచమైన రాజకీయాలకు తోపుదుర్తి తెరలేపడం సిగ్గుచేటు. మా సంస్థ, నేను ఏనాడూ హత్యారాజకీయాల్లోకి వెళ్లలేదు. తోపుదుర్తికి హత్యా రాజకీయాలు వెన్నతోపెట్టిన విద్య. తోపుదుర్తి హైదరాబాద్‌లో చక్రపాణి అనే వ్యక్తిని చంపేసి, తగులబెట్టాడని మాకు తెలిసింది. ఇలాంటి వ్యక్తి మాపై హత్యాయత్నం అంటూ నిందలు వేయడం దుర్మార్గం అని సురేంద్రబాబు అన్నారు.

**పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ...** తోపుదుర్తి గన్ మెన్లను తిరిగి తెచ్చుకునేందుకు డ్రామాలు ఆడుతున్నాడు. 2009 ఎన్నికల్లో తోపుదుర్తి రాప్తాడులో పోటీ చేసిన సమయంలో చిన్న గొడవను పెద్దది చేసి, ఆనాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కలిసి గన్‌మెన్లను తెచ్చుకున్నాడు. ఆ గన్ మెన్లను చూపించి ఎంతోమందిని తోపుదుర్తి బెరిస్తే, దాన్ని గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం గన్‌మెన్లను తొలగించింది. తాజాగా తోపుదుర్తి ఒక టిప్పర్‌కు తన కారుతో గుద్ది, తన ప్రాణాలకు ముప్పు ఉందని చెప్పి గన్‌మెన్లు కావాలని అడిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. హంద్రీనీవా కాలువ పనులను తోపుదుర్తి తీసుకుని, సకాలంలో చేయకుండా గాలికొదిలేయడం వల్ల ఉమ్మడి అనంతపురంజిల్లా చాలా నష్టపోయింది. ఆ సమయంలో సురేంద్రబాబు కంపెనీకి ఆ పనులు ఇవ్వడంతో పనులు త్వరగా పూర్తిచేయడంతో హంద్రీనీవా అందుబాటులోకి రావడంతో ఆయనకు చాలా మంచిపేరు వచ్చింది. దీంతో తోపుదుర్తి సురేంద్రబాబుపై కక్షపెంచుకున్నాడు.

# రెండు గుడిసెలు దగ్ధం... రూ.20 లక్షల ఆస్తి నష్టం

విడపనకల్లు (చైతన్యరథం): అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం ఆర్. కొట్టాల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు గుడిసెలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఓబులేసు, ఆనంద్కు చెందిన రెండు గుడిసెలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో పూర్తిగా కాలిపోయాయి. గుడిసెల్లో ఉన్న వారు మంటలను గమనించి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో బీరువాలో దాచిన 7 తులాల బంగారం, రూ.50 వేల నగదుతోపాటు ఓ ద్విచక్రవాహనం, సామగ్రి కాలిబూడిదయ్యాయి. మరోవైపు గుడిసెల్లో ఉన్న 10 గొర్రెలు, మేకలు, 30 కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



# మార్కాపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే కందుల శ్రీకారం

మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పాల్గొన్నారు. జవహర్ నగర్ కాలనీతో పాటు పలు వార్డుల్లో ఇటీవల సుమారు రూ.కోటికి పైగా వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించారు. వీటితోపాటు కొత్తగా నిర్మిస్తున్న రహదారులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎప్పుడూ లేనివిధంగా పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి పేర్కొన్నారు.






# అమెరికాలో మెరిసిన తెలుగు కుర్రాడు

## జాతీయ స్థాయి 'ఎఫ్‌బీఎల్‌ఏ' పోటీల్లో శౌర్య ప్రతిభ

### ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మనవడిగా గుర్తింపు

**టాంపా:** అమెరికాలోని టాంపా నగరానికి చెందిన తెలుగు విద్యార్థి శౌర్య తేజ సుద్దాల జాతీయ స్థాయి 'ఎఫ్‌బీఎల్‌ఏ' పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచాడు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 'ఎక్స్‌ప్లోరింగ్ బిజినెస్' విభాగంలో శౌర్య నాలుగో స్థానంలో నిలిచాడు. శౌర్య తల్లిదండ్రులు జ్వాలా చైతన్య సుద్దాల, హేమబిందు బొద్దున. ప్రముఖ సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ మనవడు కావడం విశేషం. విలియమ్స్ మిడిల్ మాగ్నెట్ స్కూల్లో ఇటీవల ఎనిమిదో తరగతి పూర్తి చేసి, ప్రస్తుతం తొమ్మిదో తరగతిలోకి అడుగుపెట్టిన శౌర్య ఈ ఘనత సాధించాడు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వ్యాపార అవగాహన, సాంకేతిక నైపుణ్యాలు, వృత్తి సామర్థ్యాలను పెంపొందించే అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థల్లో 'ఎఫ్‌బీఎల్‌ఏ' ఒకటి. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మొదట ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్హత సాధించి, ఆ తర్వాత జాతీయ స్థాయి పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులతో పోటీ పడాల్సి ఉంటుంది. అటువంటి కఠినమైన పోటీని తట్టుకుని శౌర్య జాతీయ



స్థాయిలో నాలుగో స్థానంలో నిలవడం శౌర్య ప్రతిభకు నిదర్శనం.

#### చిన్ననాటి నుంచే అసాధారణ ప్రతిభ...

శౌర్య బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తున్నాడు. గతంలో పర్ఫెక్ట్ స్కోర్ సాధించి 'ఫ్లోరిడా గవర్నర్ అవార్డు'ను రెండుసార్లు అందుకున్నాడు. క్లిష్టమైన పజిల్స్ పరిష్కరించడం, రూబిక్స్ క్యూబ్‌ను కేవలం 30 సెకన్లలో పూర్తి చేయడం అతని ప్రత్యేకత. సంగీతం లోనూ రాణిస్తున్నాడు. పియానో, వయోలిన్‌లను అద్భుతంగా వాయించ గలడు. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించి క్రీడల్లోనూ సత్తా చాటుతున్నాడు.

# 'తానా' ఛార్లెట్ నాయకుల దాతృత్వం

## పైన్‌విల్ చర్చికి నిత్యావసరాల పంపిణీ






**ఛార్లెట్:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఛార్లెట్ విభాగం ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలుగు కమ్యూనిటీతో పాటు అమెరికా కమ్యూనిటీకి కూడా తానా నాయకులు సేవలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఛార్లెట్‌లోని తానా నాయకులు పైన్‌విల్‌లోని చర్చికి ఫుడ్ డొనేషన్ చేశారు. నాగ పంచుమర్తి, ఠాగూర్ మల్లినేని, రవి (నాని) వడ్లముడి, మాధురి ఏలూరి, కిరణ్ కొత్తపల్లి... కలిసికట్టుగా 75 బ్యాగుల నిత్యావసర సరుకులను, 400 ఫుడ్ క్యాన్స్‌ను విరాళంగా సేకరించి అందించారు. ఈ సందర్భంగా తానా నాయకులకు చర్చి నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉదారమైన విరాళం ఎంతోమంది పేద కుటుంబాల ఆకలి తీర్చడానికి సహాయపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంతటి విజయవంతం చేసిన ఛార్లెట్‌లోని తానా బృందాన్ని 'తానా' అధ్యక్షుడు నరేన్ కొడాలి, ఈవీపీ శ్రీనివాస లావు అభినందించారు. ఛార్లెట్‌లోని తానా నాయకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన దాతలు, వలంటీర్లు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నీతా అంబానీకి 'హ్యూమానిటేరియన్' అవార్డు ప్రదానం



**టాంపా:** రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీకి అమెరికాలో అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయంగా ఆమె అందిస్తున్న సేవలను గుర్తిస్తూ అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ (AAPI) ఆమెకు ప్రతిష్టాత్మక 'హ్యూమానిటేరియన్ అవార్డు'ను ప్రదానం చేసింది. విద్య, ఆరోగ్యం, క్రీడలు, సంస్కృతి, సమాజాభివృద్ధి వంటి పలు రంగాల్లో నీతా అందిస్తున్న విశేష సేవలను గుర్తిస్తూ ఈ అవార్డు అందజేశారు. ఫ్లోరిడాలోని టాంపా నగరంలో అత్యంత వైభవంగా జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మేయర్ జేన్ కాస్టర్ నుంచి ఆమె ఈ అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారంతో పాటు అదే వేదికపై నీతా అంబానీకి 'కీ టు ది సిటీ ఆఫ్ టాంపా'ను మేయర్ బహూకరించారు. మానవతా దృక్పథం కలిగిన విశిష్ట వ్యక్తులకు టాంపా నగరం సాదర స్వాగతం పలుకుతోందనే గౌరవ సూచికంగా ఈ 'కీ'ని అందిస్తుంటారు. అమెరికాలో అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన పౌర పురస్కారాల్లో ఇది ఒకటి.

# రొమేనియాలో భారతీయ కార్మికుడి సాహసం

## ప్రాణాలకు తెగించి చిన్నారిని కాపాడిన విపిన్ కుమార్

### ఫిదా అయిన రొమేనియా ప్రభుత్వం... 'గౌరవ పౌరసత్వం'తో ఘన సత్కారం

**రొమేనియా:** దేశం కాని దేశంలో.. భాష కాని భాషలో.. మానవత్వానికి ఏ సరిహద్దులూ లేవని నిరూపించాడు ఒక భారతీయ శ్రామికుడు. రొమేనియాలో నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న విపిన్ కుమార్ అనే భారతీయుడు... తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఒక చిన్నారి ప్రాణాలను కాపాడి అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంటున్నాడు.





#### అసలేం జరిగిందంటే...

ఒకరోజు విపిన్ కుమార్ 'క్రియోవా' నగర సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఒక ఘోర ప్రమాదం అతని కంటపడింది. ఒక చిన్నారి నడుచుకుంటూ వెళ్తుండగా, అక్కడి చెరువుపై ఉన్న పల్చటి మంచు పొర ఒక్కసారిగా విరిగిపోయింది. దీంతో ఆ చిన్నారి గడ్డకట్టే చలి నీటిలో పడిపోయి ప్రాణాల కోసం కొట్టుమిట్టాడటం ప్రారంభించింది. అది గమనించిన ఆమె తండ్రి వెంటనే రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ, దురదృష్టవశాత్తూ మంచు విరిగిపోవడంతో ఆయన కూడా ఆ నీటిలోనే చిక్కుకుపోయాడు.

#### 30 నిమిషాలు మృత్యువుతో పోరాటం...

పరిస్థితి తీవ్రతను గమనించిన విపిన్ కుమార్ ఏమాత్రం ఆలస్యం చేయలేదు. తన వద్ద ఉన్న ఒక స్లెడ్ (మంచుపై ప్రయాణించే సాధనం) సహాయంతో మంచుపై నుంచి వారిని చేరుకోవడానికి ప్రయత్నించాడు. కానీ దురదృష్టవశాత్తూ అతను వారి దగ్గరకు వెళ్లేసరికి అతని కింద ఉన్న మంచు కూడా విరిగిపోవడంతో విపిన్ కూడా ఆ గడ్డకట్టే నీటిలో పడిపోయాడు. అయినా సరే విపిన్ అధైర్యపడలేదు. తన ప్రాణాల కంటే ఆ చిన్నారి ప్రాణం ముఖ్యమని భావించి ఆ గడ్డకట్టే నీటిలో నిలబడి, ఆ చిన్నారిని సుమారు 30 నిమిషాల పాటు నీటి పైభాగంలోనే ఎత్తిపట్టుకున్నాడు. చివరికి అత్యవసర రెస్క్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని వారు ముగ్గురినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

#### రొమేనియా ప్రభుత్వ అత్యున్నత గౌరవం

ఈ ప్రమాదంలో విపిన్ కుమార్, చిన్నారి తీవ్రమైన హైపోథెర్మియా (శరీర ఉష్ణోగ్రత ప్రమాదకరంగా పడిపోవడం)కు గురయ్యారు. రెస్క్యూ సిబ్బంది వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించారు. తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఒక అపరిచిత చిన్నారి ప్రాణాలను కాపాడిన విపిన్ కుమార్ వీరోచిత చర్యకు రొమేనియా ప్రభుత్వం సలాం చేసింది. అతని మానవత్వానికి, సాహసానికి గుర్తింపుగా రొమేనియా దేశం విపిన్ కుమార్‌కు 'గౌరవ పౌరసత్వాన్ని' ప్రదానం చేసి ఘనంగా గౌరవించింది.

# పవిత్ర అమర్‌నాథ్ యాత్ర గొప్ప భాగ్యం

## - యాత్రికులకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

జమ్మూ- కశ్మీర్‌లో ప్రారంభమైన వార్షిక అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ పీఎం మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.

'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం 'బాబా బర్ఫానీ' (మంచు లింగం)ని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు.





### భిన్నత్వంలో ఏకత్వం

ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండునెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు.

ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# దోషులను కఠినంగా శిక్షించాలి

## - అయోధ్య విరాళాల చోరీ ఘటనపై స్పందించిన ఆర్‌ఎస్‌ఎస్

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఘటనపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. రాముడి విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే విచారం వ్యక్తం చేశారు. తరతరాలుగా భక్తుల త్యాగాలు, అంకితభావం కారణంగా శ్రీరామ జన్మభూమిలోని ఈ భారీ ఆలయం రూపుదిద్దుకుంది న్నారు. ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





ఈ ఘటనను ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించి, ఆలయ నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టును హోసబలే కోరారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నందున నిందితులకు శిక్ష పడే వరకు సంయమనం పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను అవకాశంగా తీసుకొని కొందరు వ్యక్తులు హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

### సిట్ కీలక నిర్ణయం

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో దర్యాప్తు చేస్తున్న 'సిట్' కీలక నిర్ణయం తీసుకుంది. ట్రస్ట్ ఐదేళ్ల ఖాతాలను రీఆడిట్ చేసేందుకు సిద్ధమైంది. ప్రాథమిక దర్యాప్తులో భారీ అక్రమాలు వెలుగులోకి రావడంతో.. ఆలయ నిర్మాణ వ్యయాలు, నగలు, బంగారం, వెండి వస్తువులతో సహా అన్ని ఆర్థిక లావాదేవీల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, విరాళాల లెక్కింపు పనిలో పాల్గొన్న ప్రధాన నిందితుడు అవినాష్ శుక్లాను అయోధ్య పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ కేసులో శుక్లా వద్ద భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.



## సంతూర్ వాయించిన జపాన్ ప్రధాని

భారత పర్యటనలో ఉన్న జపాన్ ప్రధాని సనాయె తకాయిచి సంతూర్ వాయించారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత్-జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశానికి హాజరైన అనంతరం తకాయిచి గౌరవార్థం ప్రధాని మోదీ విందు ఇచ్చారు. అక్కడ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 'సంతూర్' వాయిద్యాన్ని వాయించాలని ఆమెను ప్రధాని మోదీ కోరారు. అందుకు మొదట ఆమె ఇబ్బంది పడగా.. ఆ వాయిద్యాన్ని ఎలా వాయించాలో మోదీ చూపించారు. అనంతరం ఆమె సరదాగా సంతూర్‌ను వాయించడంతో ప్రధాని సహా అక్కడున్న వారంతా అభినందించారు. ఈ వీడియోను మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## సీఎం విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు డీఎంకే ఎమ్మెల్యే అరెస్ట్




టీవీకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన డీఎంకే ఎమ్మెల్యే అనితా ఆర్. రాధాకృష్ణన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు బెయిల్ కోసం ఆయన చేసిన అభ్యర్ధనను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చడంతో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

జూన్ 20న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విజయ్‌పై రాధాకృష్ణన్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. చిత్ర పరిశ్రమ నుంచి ఆయన రాజకీయ అరంగేట్రాన్ని ఉద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడటంతో పాటు ఓ నటి ప్రస్తావన కూడా తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆయనపై కేసు నమోదైంది. తాజాగా హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో పోలీసులు సదరు ఎమ్మెల్యేను అరెస్టు చేశారు. ఈ అరెస్టును డీఎంకే ఎంపీ కనిమొళి ఖండించారు. ప్రతిపక్షాలపై రాష్ట్ర ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు.

# ప్రాంక్ వీడియోల కోసం ఈ-రిక్షాల షట్ డౌన్..

## చైనా యాప్‌ల తొలగింపు

ఫొటో: ఈ- రిక్షా




సోషల్ మీడియాలో 'ప్రాంక్ వీడియోల' కోసం కొందరు ఆకతాయిలు చేస్తున్న విపరీత చేష్టలకు ఫుల్ స్టాప్ పడింది. కొన్ని రోజులుగా ఢిల్లీ, తదితర ప్రాంతాల్లో ఈ-రిక్షా డ్రైవర్లను వేధింపులకు గురిచేస్తూ, ప్రయాణికుల భద్రతను ప్రమాదంలో పడేయడానికి కారణమవుతున్న 2 వివాదాస్పద చైనీస్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ యాప్స్‌పై కేంద్రం నిఘా పెట్టి, వాటిని డిలీట్ చేయించింది. 'దీూు-దీమీ', 'ఝజూశీఎష్త్ర ాఱ-ఱశీఱ' అనే ఈ రెండు యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ల నుంచి పూర్తిగా తొలగించినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ సెక్రటరీ ఎస్. కృష్ణన్ శుక్రవారం వెల్లడించారు.

చైనాకు చెందిన 'షెన్‌జెన్ గ్రీనర్జీ టెక్నాలజీ' అభివృద్ధి చేసిన 'దీూు-దీమీ' యాప్ నిజానికి లిథియం-అయాన్ బ్యాటరీల వోల్టేజ్, ఉష్ణోగ్రత, ఛార్జింగ్ సైకిల్స్, బ్యాటరీ ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి రూపొందించిన ఒక సాధారణ యాప్. ఈ యాప్‌లో బ్యాటరీ పవర్‌ను ఆన్ లేదా ఆఫ్ చేసుకునే 'డిశ్చార్జ్ కంట్రోల్' ఫీచర్ కూడా ఉంది.

భారతదేశంలో నడిచే చాలా బడ్జెట్ ఈ-రిక్షాలు, ఎలక్ట్రిక్ టూ-వీలర్లలో చైనా తయారీ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (దీమీ) వాడుతున్నారు. అయితే, ఈ సిస్టమ్స్‌కు ఎలాంటి పాస్‌వర్డ్ ప్రొటెక్షన్ ఉండదు. కంపెనీ ఇచ్చిన సాధారణ పాస్‌వర్డ్‌లతోనే ఇవి పనిచేస్తాయి. దీంతో బ్లూటూత్ రేంజ్లో ఉన్న వారు ఎవరైనా సరే ఆపరేట్ చేయొచ్చు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు ఆకతాయిలు సోషల్ మీడియాలో వ్యూస్ కోసం ఒక ట్రెండ్ మొదలుపెట్టారు. రోడ్డుపై ఈ-రిక్షా వెళ్తున్నప్పుడు.. దానికి 10 నుంచి 15 మీటర్ల బ్లూటూత్ పరిధిలో నిలబడి, ఈ యాప్‌ల ద్వారా సదరు రిక్షా బ్యాటరీకి కనెక్ట్ అవుతున్నారు. రిక్షా కదులుతుండగానే అకస్మాత్తుగా పవర్ కట్ చేసి వాహనాన్ని నిలిపివేస్తున్నారు. దీనివల్ల కదులుతున్న వాహనాలు అకస్మాత్తుగా ఆగిపోయి వెనుక వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం ఏర్పడటమే కాకుండా, రోజువారీ కూలీలైన ఈ-రిక్షా డ్రైవర్లు నడిరోడ్డుపై గంటల తరబడి చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### కేంద్ర మంత్రికి లేఖ..

ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ఈ-రిక్షా డ్రైవర్లను ముప్పుతిప్పలు పెడుతున్న ఈ వ్యవహారంపై బీజేపీ నేత తజిందర్ బగ్గా స్పందించారు. ప్రయాణికుల భద్రతను తీవ్రంగా ప్రమాదంలో పడేస్తున్న ఈ చైనీస్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ యాప్స్‌ను తక్షణమే నిషేధించాలంటూ ఆయన కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. దీనిపై ఐటీ మంత్రిత్వ శాఖ ప్రత్యేక విచారణ జరిపి, ఈ రెండు అప్లికేషన్లు దుర్వినియోగం అవుతున్నాయని నిర్ధారించుకుని గూగుల్, యాపిల్ సంస్థల సాయంతో వాటిని ప్లే స్టోర్ల నుండి తక్షణమే తొలగించింది.

# ఇరాన్ దౌత్య ప్రతినిధులను కాపాడిన అమెరికా

- ఇజ్రాయెల్ ప్లాన్‌ను పసిగట్టి అప్రమత్తం చేసిన అగ్రరాజ్యం
- పశ్చిమాసియా సంక్షోభంలో కొత్త కోణాలు



పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో అంతర్జాతీయ రాజకీయ సమీకరణాల్లో కొత్త మార్పులు వస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ మైత్రి బీటలు వారిందని చెప్పేలా కొన్ని కథనాలు వస్తున్నాయి. ఇరాన్ అగ్రనేతలు, శాంతి చర్చల ప్రతినిధులైన విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ గాలిబాఫ్‌లపై ఇజ్రాయెల్ వేసిన 'హత్య ప్రణాళిక' ను అమెరికా ముందే పసిగట్టి, ఇరాన్‌ను అప్రమత్తం చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్' ఈ రహస్యాలను బహిర్గతం చేసింది.

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీని ఈ ఏడాది ఫిబ్రవరి 28న వైమానిక దాడుల్లో హతమార్చిన తర్వాత, ఇరాన్ ఉన్నత స్థాయి నాయకత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని ఇజ్రాయెల్ వ్యూహం రచించింది. అయితే, ఏప్రిల్ 8న జరిగిన మొదటి తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత అమెరికాతో అణు, శాంతి చర్చలు జరపడానికి ఇరాన్ తరపున అరాగ్చీ, గాలిబాఫ్ బాధ్యతలు చేపట్టారు. ఇది ఇజ్రాయెల్‌కు ససేమిరా ఇష్టం లేదు.

న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 12న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌తో చర్చలు ముగించుకుని తిరిగి ఇరాన్‌కు విమానంలో ప్రయాణమయ్యారు. గాలిబాఫ్ ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చివేయడానికి ఇజ్రాయెల్‌కు చెందిన రెండు ఫైటర్ జెట్స్ ఇరాక్ మీదుగా ఇరాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించాయి. ఈ నిఘా సమాచారాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ ముందేగుర్తించి, ప్రాంతీయ దేశాల (పాకిస్థాన్, ఖతార్) మధ్యవర్తుల ద్వారా ఇరాన్ ప్రభుత్వానికి అత్యవసర హెచ్చరికలు పంపింది. సమాచారం అందిన వెంటనే ఇరాన్ రక్షణ దళాలు గాలిబాఫ్ విమానాన్ని టెహ్రాన్‌కు వెళ్లకుండా దారి మళ్లించి, ఈశాన్య ప్రాంతంలోని 'మషద్' నగరంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించాయి. ఆ తర్వాత గాలిబాఫ్ రోడ్డు మార్గంలో సురక్షితంగా టెహ్రాన్ చేరుకున్నారు.

ఇరాన్‌తో శాంతి చర్చలు జరుపుతున్న సమయంలో ఆ దేశ ప్రధాన దౌత్యవేత్తలను ఇజ్రాయెల్ హతమరిస్తే, చర్చలు పూర్తిగా దారితప్పి, అమెరికా కూడా నేరుగా ఇరాన్‌తో పెద్ద ఎత్తున యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని వాషింగ్టన్ భయపడింది.'వారినీ చంపేస్తే ఇక మనం శాంతి చర్చలు జరపటానికి ఇరాన్‌లో ఒక్క నేత కూడా మిగలడు' అని పాకిస్థాన్ దౌత్యవేత్తలు కూడా అమెరికాకు స్పష్టం చేశారు. దీంతో అమెరికా స్వయంగా రంగంలోకి దిగి ఇజ్రాయెల్‌ను వెనక్కి తగ్గాలని ఆదేశించిందని కూడా సదరు నివేదిక వెల్లడించింది.

ఇదిలా ఉంటే, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2025లో జరిగిన 12 రోజుల యుద్ధంలో, అలాగే ఈ ఏడాది జరిగిన ఘర్షణల్లో ఇరాన్ భూగర్భ బంకర్లపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల శిథిలాల నుంచి గాలిబాఫ్ రెండుసార్లు ప్రాణాలతో బయటపడ్డారు.

### పెరిగిన దూరం !

ఇక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు మధ్య ఇటీవల కాలంలో తీవ్రమైన విభేదాలు రావడానికి ఈ ఘటనే పునాది అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేకాదు, ఇజ్రాయెల్‌కు ఇష్టం లేకపోయినప్పటికీ, అమెరికా.. ఇరాన్‌తో విడిగా చర్చలు జరిపి 14 అంశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఒకే యుద్ధాన్ని పలుమార్లు ఆపిన ఘనుడు



- నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తున్నా
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై హంటర్ బైడెన్ వ్యంగ్యాస్త్రాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మాజీ అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇరాన్ యుద్ధాన్ని పదేపదే ముగించానంటూ ట్రంప్ చేస్తున్న ప్రకటనలను ఆయన విమర్శించారు. ఈ మేరకు నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్‌ను నామినేట్ చేస్తున్నానంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో హంటర్ బైడెన్ పోస్ట్ చేశారు. ఈ వ్యాఖ్యలు అమెరికా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### హంటర్ బైడెన్ ఎక్స్ పోస్టు..

'డొనాల్డ్ జె.ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి అధికారికంగా నామినేట్ చేస్తున్నాను. చరిత్రలో ఒకే యుద్ధాన్ని ఇన్ని సార్లు ఆపిన అధ్యక్షుడు ఎవరూ లేరు. సీఎన్ఎన్ లెక్కల ప్రకారం ఇరాన్ యుద్ధాన్ని ట్రంప్ కనీసం 38 సార్లు ముగించారు. ఇది నోబెల్ కమిటీ గుర్తించాల్సిన రికార్డు' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

ఈ పోస్ట్ కొద్ది సేపట్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొందరు హంటర్ వ్యాఖ్యలను చమత్కారంగా అభివర్ణించగా.. ట్రంప్ మద్దతుదారులు కూడా తమదైన శైలిలో ప్రతిస్పందించారు. ట్రంప్‌ను నిజంగానే నోబెల్ శాంతి బహుమతికి అర్హుడిగా పేర్కొంటూ పలువురు పోస్టులు చేయడంతో సామాజిక మాధ్యమాల్లో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. కాగా, ఇటీవలి కాలంలో హంటర్ బైడెన్ సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ ట్రంప్ మద్దతుదారులు, తన తండ్రిపై విమర్శలు చేసే వారిపై తరచూ స్పందిస్తున్నారు.

ఇదిలా ఉండగా విదేశాంగ విధానంలో తన కృషికి గానూ తాను నోబెల్ శాంతి బహుమతికి అర్హుడినని ట్రంప్ గతంలో పలుమార్లు వ్యాఖ్యానించారు. అమెరికా చరిత్రలో అధికారంలో ఉన్న సమయంలో నోబెల్ శాంతి బహుమతి అందుకున్న అధ్యక్షులు ఇద్దరే. వుడ్రో విల్సన్ 1920లో, బరాక్ ఒబామా 2009లో ఈ గౌరవాన్ని అందుకున్నారు. మరోవైపు, ఇరాన్ యుద్ధం విషయంలో ట్రంప్ భిన్నమైన వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ప్రారంభమైన ఈ ఉద్రిక్తతపై ఆయన పదేపదే తన వైఖరిని మార్చుకుంటున్నారని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.

# లోయలో పడ్డ బస్సు 40 మంది మృతి

**- పాక్‌లో ఘోర ప్రమాదం**

పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఖైబర్ పఖ్తుంఖ్వాలో బస్సులోయలో పడి 40మంది మృతి చెందారు. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో ఎక్కువమంది చిన్నారులు, మహిళలు ఉన్నారు. శుక్రవారం తెల్లవారుజామున బలోచిస్థాన్-ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల సరిహద్దులోని దారాసర్ ప్రాంతంలో బస్సు అదుపుతప్పి లోయలో పడినట్లు బలోచిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రింద్ తెలిపారు. బస్సు క్వెట్టా నుంచి ఇస్లామాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తుండగా..మార్గమధ్యంలో మరో బస్సు బ్రేక్ డౌన్ అయ్యింది. అందులోని ప్రయాణికులను కూడా ఈబస్సులో ఎక్కించుకున్నారని షాహిద్ తెలిపారు.సామర్థ్యానికిమించి బస్సుప్రయాణిస్తుండటంతో అదుపుతప్పి లోయలోకి పడిపోయినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు.





## ట్రక్కు ఢీకొని 9 మంది సాధువుల మృతి

ఈశాన్య థాయ్‌ల్యాండ్‌లో తీర్థయాత్రకు బయలుదేరి రహదారి వెంబడి నడుచుకొంటూ వెళుతున్న సాధువుల మీదకు 11 ఏళ్ల బాలుడు నడుపుతున్న పికప్ ట్రక్కు దూసుకురావడంతో 9మంది మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. బ్యాంకాక్‌కు 600కి.మీ.ల దూరంలోని ముక్డహాన్ ప్రావిన్సుకు చెందిన 35మంది సాధువుల బృందం రోడ్డుకు ఒక పక్కగా ఒకరి వెనుక మరొకరు వరుసగా నడిచి వెళుతుండగా శరవేగంతోవచ్చి అదుపు తప్పిన ట్రక్కు వారిని ఢీకొని క్షణాల్లో అందరినీ చెల్లాచెదురు చేసింది. ఈ ప్రమాదంలో అయిదుగురు సాధువులు అక్కడికక్కడే మృతిచెందగా,మరో నలుగురు ఆసుపత్రిలో కన్నుమూశారు. గాయాలతో చికిత్స పొందుతున్న 13మంది సాధువుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. బాలుణ్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మరణించిన స్థలానికి ఖమేనీ మృత దేహం



అమెరికా– ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమం గురువారం ప్రారంభమై కొన్ని రోజుల పాటు జరగనుంది. ఇందులో భాగంగా ఖమేనీ భౌతిక కాయాన్ని ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఆయన హత్యకుగురైన ప్రదేశానికి చేర్చారు. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా ఖమేనీ భౌతిక కాయాన్ని ఆయన అమరత్వం పొందిన ప్రదేశానికి తరలించారని ఇరాన్ మీడియా వెల్లడించింది. టెహ్రాన్‌లో జులై 4,5 తేదీల్లో జరగనున్న అంతిమయాత్రకు రికార్డు స్థాయిలో రెండుకోట్ల మంది వస్తారని ఐఆర్‌జీసీ అంచనావేస్తోంది. ఇక తొమ్మిదో తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో ఈ యాత్ర జరగనుంది. ఆ రోజున ఖమేనీ స్వస్థలం మషాద్‌లో ఖననంచేయనున్నారు.ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోర్డింగ్లు, బ్యానర్లు వెలిశాయి. ఈ అంత్యక్రియల కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇరాన్ నుంచి భారత ప్రధాని మోదీకి ఆహ్వానంవచ్చింది.మనదేశం తరపున కేంద్ర విదేశాంగ శాఖ సహాయమంత్రి పవిత్ర మార్గరిటా,బీహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్‌నైన్ హాజరుకానున్నట్లు తెలుస్తోంది.

## రూ.1.9 కోట్ల జీతగాడు..
## చాక్లెట్ కుకీ దొంగిలించాడని తొలగింపు!

**- చివరికి తప్పుడు ఆరోపణగా తేలిన వైనం**

చాక్లెట్ కుకీ దొంగలించాడనే కారణంతో అమెరికాలోని ప్రముఖవాహన తయారీసంస్థ ఫోర్డ్.. రూ.1.9కోట్ల జీతం తీసుకునే ఓఉద్యోగిని తొలగించింది. అయితే చివరికి సదరు ఉద్యోగి దానిని దొంగిలించలేదని, కొనుగోలు చేశాడని తేలింది. ఈ ఘటనపై బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కెంటకీలోని లూయిస్‌విల్లే లో ఉన్న ఫోర్డ్ ట్రక్ ఫ్యాక్టరీలో..60ఏళ్ల కర్ట్‌క్రోమ్ 11ఏళ్లుగా పని చేస్తున్నాడు. ఎంతో విధేయతగా సగటున వారానికి 60గంటలు పని చేసేవాడినని..అయినప్పటికీ తప్పుడు ఆరోపణలతో తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తంచేశాడు. తానుకంపెనీలో ఏడాదికి రూ.1.9కోట్లు(భారత కరెన్సీలో) సంపాదిస్తు న్నానని..గతేడాది ఆఫీస్‌క్యాంటీన్లో సుమారు రూ.1.14లక్షలు ఖర్చుచేశానని తెలిపాడు. ఇటీవల కంపెనీలో ఉన్న సమయంలో షుగర్ లెవల్స్ పడిపోతున్నట్లు అనిపించడంతో ఓ చాక్లెట్ కుకీ (రూ.186)ని కొనుగోలు చేశానని పేర్కొన్నాడు. కొద్ది రోజుల అనంతరం సూపర్‌వైజర్ తనను పిలిచి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు చెప్పాడని.. కారణమేంటని అడగ్గా కుకీని దొంగలించినందుకు జాబ్ నుంచి తీసేస్తున్నట్లు పేర్కొన్నాడని వెల్లడించాడు. తాను కుకీని దొంగలించలేదని.. దానిని కొనుగోలు చేసినట్లు తన వద్ద బిల్లు ఉందని చెప్పినప్పటికీ బలవంతంగా ఫ్యాక్టరీ ప్రాంగణం నుంచి బయటకు పంపేశారని ఆరోపించాడు. ఆబిల్లు స్క్రీన్‌షాట్ పంపించిన అనంతరం తానునిర్దోషిగా తేలడంతో ఉద్యోగానికి తిరిగిరావాలని యూనియన్ ప్రతినిధి పిలిచారని బాధితుడు వెల్లడించాడు. కానీ తనను అవమానించిన చోట పనిచేయకూడదని నిర్ణయించుకున్నట్లు అతడు వెల్లడించాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఉద్యోగి పట్ల ఫోర్డ్ అధికారుల తీరును నెటిజన్లు విమర్శిస్తున్నారు.

# నేడు ఇంగ్లాండ్‌తో రెండో టీ 20

**- సీనియర్లకు మద్దతుగా మేనేజ్‌మెంట్**

**- వైభవ్‌కు ఈ సారీ అవకాశం కష్టమే**



ఇంగ్లాండ్, భారత్ మధ్య రెండో టీ 20 శనివారం జరగనుంది. దీంతో యథా ప్రకారం ఈ మ్యాచ్‌లోనైనా టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం లభిస్తుందా అనే విషయమై జోరుగా చర్చ జరగుతోంది. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు ఐర్లాండ్‌తో ఆడిన టీమిండియా వరుసగా రెండు టీ20ల్లో ఓడిపోయి ఆ దేశానికి తొలిసారిగా సిరీస్ చేజార్చుకుంది. అనంతరం ఇంగ్లాండ్‌తో ఐదు టీ 20ల సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయన సంగతి తెలిసిందే. అయితే, ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆకట్టుకోగా.. సంజు శాంసన్, ఇషాన్ కిషన్ మరోసారి విఫలమయ్యారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఎట్టకేలకు ఫామ్ అందుకోవడం భారత్‌కు కలిసొచ్చే అంశమే. ఐర్లాండ్‌పై అతడు ఏమాత్రం ప్రభావం చూపించలేదు. కీలక సమయంలో వికెట్ కోల్పోయి విమర్శలు ఎదుర్కొన్నాడు. అయితే, ఇంగ్లాండ్‌పై హాఫ్ సెంచరీ చేసిన తొలి టీ 20 భారత కెప్టెన్‌గా రికార్డు నమోదు చేయడం గమనార్హం.

టీ20 ప్రపంచ కప్ నెగ్గి.. ఆ తర్వాత ఐపీఎల్లో ఆడి వచ్చిన భారత ప్లేయర్లకు ఆ తరువాత భంగపాటు ఎదురవుతోంది. మరీ ముఖ్యంగా ఓపెనర్ సంజు శాంసన్ అత్యంత దారుణమైన ప్రదర్శనతో నిరాశపరుస్తున్నాడు. వరుసగా మూడు మ్యాచుల్లోనూ సింగిల్ డిజిట్కే పరిమితమైన అతడు.. టెక్నిక్‌ను మార్చుకోలేక ఇబ్బందిపడుతున్నాడు. దీంతో వైభవ్ సూర్యవంశీని తుది జట్టులోకి తీసుకొనేందుకు ఇదే సరైన తరుణమని పలువురు మాజీలు సూచిస్తున్నారు. మేనేజ్మెంట్ మాత్రం సీనియర్లకు మద్దతుగా నిలుస్తామని చెబుతోంది. ఈ క్రమంలో ఇంగ్లాండ్‌తో రెండో టీ20లోనూ వైభవ్‌కు అవకాశం దక్కడం కష్టమేనని అనిపిస్తోంది.

**తిలక్ ఆటతీరుపై..**

ఐర్లాండ్‌పై రెండు మ్యాచుల్లోనూ తిలక్ వర్మ కీలక ఇన్నింగ్సులు ఆడాడు. కానీ, అతడి ఆటతీరే విమర్శలకు దారితీసింది. చాలా నెమ్మదిగా ఆడాడని.. ఛేదించాల్సిన రన్‌రేట్ పెరిగిపోవడానికి కారణమదేనని పలువురు వ్యాఖ్యానించారు. ఇక ఇంగ్లాండ్ తో తొలిమ్యాచ్‌లోనూ తిలక్ వర్మ పెద్దగా రాణించలేదు. దీంతో అతడి ఆటతీరు పై ఇప్పుడు అందరి దృష్టి పడింది. తన కోసం కాకుండా.. జట్టు ప్రయోజనాల కోసమే ఆడుతున్నానని నిరూపించుకోవాల్సిన బాధ్యత తిలక్‌పై ఉంది. ఫినిషర్ ప్లేస్‌లో మ్యాచ్ చివరి వరకూ ఉండి ముగించాల్సిన అవసరం ఉంది.

**బౌలింగ్ విభాగంపై..**

ఇంగ్లాండ్ బ్యాటర్లను వారి సొంత గడ్డపై అడ్డుకోవాలంటే భారత బౌలింగ్ విభాగం కష్టపడాల్సిందే. కెప్టెన్ హ్యారీ బ్రూక్, ఓపెనర్లు ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్లతో అత్యంత ప్రమాదకర బ్యాటింగ్ లైనప్ ఉంది. తొలి టీ20లో టీమ్ ఇండియా ఇద్దరు ప్రధాన స్పిన్నర్లు, ఒక స్పిన్ ఆల్రౌండర్, ఇద్దరు పేసర్లతో బరిలోకి దిగింది. శివమ్ దూబే రూపంలో ఎలానూ మీడియం ఫాస్ట్ బౌలర్ అందుబాటులో ఉన్నాడు. యువ పేసర్ ప్రిన్స్ యాదవ్ ఐర్లాండ్‌పై మంచి ప్రదర్శనే ఇచ్చాడు. అతడికి ఇంగ్లాండ్‌పై ఛాన్స్ ఇస్తే బాగుంటుందనేది కొందరి సూచన.

## ఫిఫా ప్రపంచ కప్ ప్రీ క్వార్టర్స్‌కు స్పెయిన్

**- గోల్ కీపర్ సైమన్ అరుదైన రికార్డ్**




ఫిఫా ప్రపంచ కప్‌లో స్పెయిన్ ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. రౌండ్ 32లో ఆస్ట్రియాను చిత్తు చేసింది. మైకెల్ (36వ నిమిషం, 89వ నిమిషం) రెండు గోల్స్, పెడ్రో పొర్రో (66వ నిమిషం) ఒక గోల్ చేయడంతో స్పెయిన్ 3–0 తేడాతో ఆస్ట్రియాపై విజయం సాధించింది. ఈ క్రమంలో స్పెయిన్ గోల్ కీపర్ ఉనై సైమన్ అరుదైన ఘనత సాధించాడు. 36 ఏళ్లనాటి ఓ రికార్డును బద్దలు కొట్టాడు. ప్రపంచ కప్ లో 519 నిమిషాలపాటు ప్రత్యర్థులను ఒక్క గోల్ కూడా చేయనీయకుండా స్పెయిన్ గోల్ కీపర్ ఉనై సైమన్ రికార్డు సృష్టించాడు. 1990 వరల్డ్ కప్ లో ఇటలీ ప్లేయర్ వాల్టెర్ జెంగా నమోదు చేసిన 517 నిమిషాల ఘనతను అధిగమించాడు. గత వరల్డ్ కప్ నుంచి ఈ స్పెయిన్ గోల్ కీపర్ అద్భుత ఆటతీరు కొనసాగుతోంది. 2022 ప్రపంచ కప్ గ్రూప్ స్టేజ్లో జపాన్ 51వ నిమిషంలో గోల్ చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు స్పెయిన్ తన ప్రత్యర్థికి ఒక్క గోల్ కూడా ఇవ్వలేదు. ఈసారి లీగ్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచుల్లో రెండు విజయాలు సాధించి ఒక డ్రా చేసుకుంది. గ్రూప్ హెచ్ నుంచి అగ్రస్థానం సొంతం చేసుకుంది. ఇప్పుడు ఆస్ట్రియాను కూడా గోల్ కొట్టనీయకుండా సైమన్ అడ్డుపడ్డాడు.

## తొందరపాటు నిర్ణయాలు తీసుకోను: రొనాల్డో



పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో రిటైర్‌మెంట్‌పై కొంతకాలంగా ఊహాగానాలు వస్తోన్న సంగతి తెలిసిందే. క్రొయేషియాతో మ్యాచ్ అనంతరం.. రొనాల్డో సోదరి కాటియా చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఈ ప్రపంచ కప్ టోర్నీనే అతడికి చివరిదంటూ ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన రిటైర్‌మెంట్‌పై వస్తోన్న వార్తలపై రొనాల్డో స్పందించాడు. ప్రపంచ కప్ ముగిసిన తర్వాతే తన భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశాడు. దీంతో రిటైర్‌మెంట్ వార్తలకు చెక్ పడినట్లు అయింది.

రౌండ్ ఆఫ్ 32లో క్రొయేషియాపై పోర్చుగల్ 2–1 తేడాతో విజయం సాధించి.. ప్రీక్వార్టర్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం రొనాల్డో మాట్లాడాడు. 'నేను ఎప్పుడూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోను. ప్రస్తుతం నా దృష్టి ప్రపంచ కప్ గెలవడంపైనే ఉంది. నా భవిష్యత్తు గురించి టోర్నీ ముగిసిన తర్వాతే నిర్ణయం తీసుకుంటా' అని స్పష్టం చేశాడు.

ఇదే మ్యాచ్‌లో రొనాల్డో మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో గోల్ చేసిన అత్యంత పెద్ద వయసు ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.

41 సంవత్సరాల 147 రోజుల వయసులో ఈ ఘనత సాధించి గత రికార్డును అధిగమించాడు. అంతేకాదు, తన కెరీర్‌లో ప్రపంచకప్ నాకౌట్ దశలో నమోదు చేసిన తొలి గోల్ కూడా ఇదే కావడం విశేషం. క్రొయేషియాపై అద్భుత ఆటతీరుకు రొనాల్డోకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు, క్రొయేషియా చేసిన రెండు గోల్స్ ఆఫ్‌సైడ్ కారణంగా రద్దు కావడం మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసింది.

## క్రొయేషియాపై పోర్చుగల్ విజయం




ఫిఫా ప్రపంచ కప్ రౌండ్ 32లో 2–1 తేడాతో క్రొయేషియాను ఓడించిన పోర్చుగల్ ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టింది.. తొలుత క్రొయేషియా ప్లేయర్ ఇవాన్ పెరిసిక్ (53వ నిమిషం) గోల్ చేయడంతో 1–0 లీడ్లోకి వెళ్లింది. అయితే, ఆ ఆనందం కాసేపు మాత్రమే ఉంది. పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో 68వ నిమిషంలో పెనాల్టీ కిక్ గోల్ సాధించి స్కోర్లను సమం చేశాడు. మరో ప్లేయర్ గొంకాలో రామోస్ 90.4వ నిమిషంలో గోల్ కొట్టి మ్యాచ్‌ను పోర్చుగల్ వైపు మళ్లించాడు. ఏడో తేదీన ప్రిక్వార్టర్స్ లో స్పెయిన్ తో పోర్చుగల్ తలపడనుంది. క్రొయేషియా పై గోల్ కొట్టిన రొనాల్డో (15).. ప్రపంచ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన నాలుగో ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. లియోనెల్ మెస్సీ (19), ఎంబాపె (18) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

## స్విస్ ముందంజ, అల్జీరియాపై 2-0తో గెలుపు




ఫిఫా ప్రపంచ కప్‌లో స్విట్జర్లాండ్ ముందంజ వేసింది. రౌండ్ 32 లో స్విస్ జట్టు 2–0 తేడాతో అల్జీరియాపై విజయం సాధించింది. బ్రీల్ ఎంబోలో 10వ నిమిషంలోనే గోల్ కొట్టి స్విట్జర్లాండ్‌కు ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత డాన్ ఎన్డీయే 46వ నిమిషంలో రెండో గోల్ చేయటంతో స్విస్ 2–0 లీడ్ సాధించింది. ఆ తర్వాత అల్జీరియా నుంచి స్విస్‌కు పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదు. అల్జీరియాకే బంతిపై నియంత్రణ ఎక్కువగా ఉన్నప్పటికీ.. గోల్స్‌గా మలచడంలో మాత్రం విఫలమై ఇంటిముఖం పట్టింది. కొలంబియా – ఘనా మ్యాచ్ విజేతతో స్విట్జర్లాండ్ ప్రిక్వార్టర్స్‌లో తలపడనుంది.

## భారత్‌పై గెలుపు మా ప్రతిష్టను పెంచింది

**- ఐర్లాండ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు**



భారత్ వంటి ప్రపంచ ఛాంపియన్ జట్టుపై చారిత్రక టీ20 సిరీస్ విజయం ఐర్లాండ్ క్రికెట్ ప్రతిష్ఠను పెంచిందని ఆ దేశ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు బ్రయాన్ ఓడొన్నెల్ పేర్కొన్నారు. భారత క్రికెట్ జట్టును ఐర్లాండ్ 2–0 తేడాతో క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. శ్రేయస్ అయ్యర్ నాయకత్వం చేపట్టిన తర్వాత ఆడిన తొలి సిరీస్‌లోనే టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ విజయం తరువాత ఐర్లాండ్‌ను ప్రపంచ క్రికెట్‌లో మరింత గౌరవంగా చూస్తారని బ్రయాన్ అభిప్రాయపడ్డారు. ఈ విజయం మాపై ప్రభావం చూపుతోంది. మా ప్లేయర్లకు భారత్‌పై గెలుపు భారీ ప్రోత్సాహంగా మారింది. దీంతో వారు ఇతర లీగ్‌లు, అవకాశాలకు కూడా చేరువవుతారు. ఇప్పటి వరకు ఐర్లాండ్ క్రికెట్ జట్టు అంటే చాలామందికి తెలియకపోవచ్చు. కానీ టీమిండియాను ఓడించిన తర్వాత మమ్మల్ని చూసే దృక్కోణం కూడా మారుతుంది. త్వరలోనే ప్రారంభం కానున్న యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ ఐర్లాండ్ క్రికెట్ అభివృద్ధికి దోహదపడుతుంది. స్టీవ్ వా, రాహుల్ ద్రవిడ్, రవిచంద్రన్ అశ్విన్ వంటి దిగ్గజాలు కూడా ఈ టోర్నీలో పాల్గొంటున్నారు. వారి అనుభవం ఐర్లాండ్ ప్లేయర్లకు ఉపయోగపడుతుందని బ్రయాన్ వెల్లడించారు.

**టెస్ట్‌లపై మరింత దృష్టి**

భారత్‌తో టీ20 సిరీస్ విజయంలో ఐర్లాండ్ బౌలర్ జై మూన్‌ద్రా కీలక పాత్ర పోషించాడు. అయితే అతడు భారత సంతతి ప్లేయర్ కావడం విశేషం. ఈ విషయంపై కూడా బ్రయాన్ స్పందించారు. 'ప్రతిభ ఉన్న ప్లేయర్లకు అవకాశం ఇవ్వడానికి మా బోర్డు సిద్ధంగా ఉంటుంది. అయితే టెస్టు క్రికెట్ విషయంలోనే నాకు ఆందోళన. ఆ ఫార్మాట్‌లో ఐర్లాండ్ క్రికెట్ జట్టుకు అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ఇది ఐర్లాండ్ క్రికెట్ అభివృద్ధికి అడ్డంకిగా మారుతోంది. ఇప్పటివరకు ఐర్లాండ్ కేవలం 13 టెస్టులు ఆడింది. అందులో 3 విజయాలు మాత్రమే సాధించింది. భవిష్యత్తులో మరిన్ని టెస్టు మ్యాచ్‌లు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. అవసరమైతే దేశీయ ఫస్ట్ క్లాస్ టోర్నీని తిరిగి ప్రారంభిసామని బ్రయాన్ వెల్లడించారు.

చైతన్య రథం

# సినిమా

శనివారం 4 జూలై 2026 X



# సమంతకు అఖిల్ కంగ్రాట్స్

'మా ఇంటి బంగారం' సూపర్ సక్సెస్‌పై సమంతకు హీరో అక్కినేని అఖిల్ అభినందనలు తెలిపారు. అఖిల్ ప్రస్తుతం తన తాజా చిత్రం 'లెనిన్' సినిమా ప్రచారంలో బిజీగా ఉన్నారు. జులై 10న ఇది విడుదల కానుంది. ఈ చిత్రం ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన రీసెంట్ భారీ హిట్ 'మా ఇంటి బంగారం' గురించి మాట్లాడారు. సినిమా చాలా కొత్త కాన్సెప్ట్‌తో వచ్చిందన్నారు. లెనిన్ ప్రమోషన్లలతో బిజీగా ఉండటంతో నేను ఇంకా మా ఇంటి బంగారం చూడలేదు. కానీ, ఆ చిత్ర ట్రైలర్ చూశాను. చాలా నచ్చింది. ఆ సినిమా వైబ్ అద్భుతంగా ఉంది. ఇది కచ్చితంగా హిట్ అవుతుందని అప్పుడే అనిపించింది. చిత్రం చాలా సహజంగా అనిపించింది. మంచి ఇంటికి కోడలిగా వెళ్లి.. వాళ్లందరితో బంగారం అనిపించుకోవాలనే అంశంతో పాటు, పవర్‌ఫుల్ యాక్షన్ చూపించడం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ముఖ్యంగా ఒక మహిళా పాత్రతో ఆ స్థాయి యాక్షన్ సీన్స్ చేయించడం నిజంగా అద్భుతం. సమంత చాలా బాగా నటించారు. కంగ్రాట్స్ సామ్'' అంటూ సమంతతో పాటు చిత్రబృందానికి కూడా అఖిల్ విషెస్ చెప్పారు.

**జూన్ ఓ గొప్ప నెల: సమంత**

ఇక జూన్ నెల తనకు ఎంతో నచ్చిందన్నారు సమంత. 'అద్భుతమైన కథ' అంటూ కొన్ని ఫొటోలను ఇన్‌స్టా వేదికగా పోస్ట్ చేశారు. ఆమె సుదీర్ఘ విరామం తర్వాత నటించిన 'మా ఇంటి బంగారం' జూన్‌లో విడుదలై మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంటోంది. ఈ టికెట్ సేల్స్‌కు సంబంధించిన ఫొటోలతో పాటు ప్రెగ్నెన్సీ సమయంలో వర్క్ ఫుట్లు చేస్తోన్న వీడియోను సమంత పంచుకున్నారు.

# రేపు ఆమిర్‌ఖాన్ వివాహం



బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్‌ఖాన్ జులై 5న వివాహం చేసుకోనున్నారు. తన ప్రియురాలు గౌరీ స్ప్రాట్‌ను ఆయన పెళ్లి చేసుకోనున్నారు. తాజాగా ఈ వేడుక వివరాలను ఆయన మీడియాతో పంచుకున్నారు. "జులై 5 నాకు ఎంతో ప్రత్యేకమైన రోజు. మా ఇంట్లోనే చిన్న వేడుకగా పెళ్లి చేసుకుంటున్నాం. ఇరు కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితులు, మిత్రులు మాత్రమే ఈ వేడుకలో పాల్గొంటారు. మీ అందరి ఆశీస్సులు మాకు కావాలి. మా వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని దీవించాలని ఆమిర్ ఖాన్ కోరారు.

ఈ విషయం చెప్పిన అనంతరం ప్రెస్‌మీట్‌లో ఆమిర్ పక్కనే ఉన్న దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ విషెస్ తెలిపారు. ఆమిర్ ఖాన్‌కు గతంలో రీనా దత్తా, కిరణ్ రావులతో వివాహం జరిగింది. ఆ తర్వాత వారు విడిపోయారు. ఇప్పుడు గౌరీ స్ప్రాట్‌తో ఆయన కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నారు. రెండేళ్లుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారు.

# 30న 'శ్రీనివాస మంగాపురం'




దివంగత సూపర్‌స్టార్, నటశేఖర కృష్ణ మూడోతరం వారసుడి సినిమా విడుదలకు ముహూర్తం ఖరారయింది. ఆర్‌ఎక్స్ 100', 'మంగళవారం' వంటి విభిన్న చిత్రాలతో క్రియేటివ్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందిన అజయ్ భూపతి దర్శకత్వంలో జయకృష్ణ ఘట్టమనేని హీరోగా రూపుదిద్దుకుంటోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమాతో హీరోగా పరిచయమవుతోన్న జయకృష్ణ.. ఇప్పటికే తన లుక్స్, ఆకట్టుకునే బేస్ వాయిస్‌తో మంచి ఇంప్రెషన్‌ని క్రియేట్ చేశారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడిగా, మహేష్ బాబు అన్న కొడుకుగా భారీ అంచనాల మధ్య ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్న జయకృష్ణ ఘట్టమనేని.. ఆ వారసత్వాన్ని సక్సెస్‌ఫుల్‌గా ముందుకు తీసుకెళతాడనే నమ్మకాన్ని ఘట్టమనేని అభిమానులకు ఇప్పటికే కల్పించాడు. ప్రేక్షకులలో కూడా ఆ నమ్మకాన్ని ఎంత వరకు నిలబెట్టుకుంటాడో తెలియాలంటే మాత్రం ఈ సినిమా విడుదల వరకు వెయిట్ చేయాల్సిందే. తాజాగా ఈ మూవీకి సంబంధించి రిలీజ్ డేట్‌ని అధికారికంగా ప్రకటించారు.

జూలై 30వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లుగా ప్రకటిస్తూ ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఇందులో హీరో జయకృష్ణ, హీరోయిన్ రాషా తడాని కనిపిస్తున్న తీరు చూస్తుంటే.. ఇందులో గొప్ప లవ్ స్టోరీని దర్శకుడు చూపించబోతున్నట్లుగా తెలుస్తోంది. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ సినిమాతో టాలీవుడ్‌కు హీరోయిన్‌గా పరిచయమవుతోన్న విషయం తెలిసిందే. వీరిద్దరి కెమిస్ట్రీ ఇప్పటికే వచ్చిన టీజర్‌లో మెప్పించింది.

లెజెండరీ నిర్మాత అశ్వినీ దత్ సమర్పణలో, జెమినీ కిరణ్ తన 'చందమామ కథలు' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సీనియర్ నటుడు, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు పవర్ ఫుల్ విలన్ పాత్రలో ఇందులో నటిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్ మంచి స్పందనను రాబట్టుకుని.. సినిమాపై భారీగా అంచనాలను పెంచేశాయి.

# నిర్మాతలతో సీబీఎఫ్‌సీ చైర్మన్ భేటీ




ఇటీవల సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ చైర్మన్‌గా తెలుగువారైన శశి శేఖర్ వెంపటి నియమితులయ్యారు. గతంలో ప్రసార భారతి సీఈఓగా ఉన్న సమయంలో దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో ఆధునీకరణలో భాగంగా కీలక సంస్కరణలను ఆయన తీసుకొచ్చారు. అలానే రాజ్యసభ టీవీని కూడా సమర్థంగా నిర్వహించారు. ఐఐటీ బాంబే పూర్వ విద్యార్థి అయిన శశి శేఖర్ మే తొలి వారంలో సీబీఎఫ్‌సీ చైర్మన్ గా నియమితులైన దగ్గర నుంచి ఈ శాఖలోనూ సంస్కరణలపై దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. గత కొంతకాలంగా సినిమా నిర్మాతలు సెన్సార్ బోర్డ్ వైఖరిపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలలో ఇది మరీ ప్రత్యేకంగా కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో నిర్మాతలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడానికి సెన్సార్ బోర్డ్ చైర్మన్ శశిశేఖర్ చొరవ చూపారు. ముంబై నుండి ఆయన హైదరాబాద్ వచ్చి, గురువారం ఎఫ్‌ఎన్‌సిసిలో తెలుగు నిర్మాతలను కలిసి వారితో చర్చించారు. తెలుగు సినిమా నిర్మాతలు పలువురు ఈ సమావేశానికి హాజరై... సెన్సార్ నుంచి తమకు ఎదురౌతున్న సమస్యలను చెప్పారని, దానిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలుస్తోంది. మొత్తం మీద తెలుగు వ్యక్తి తొలిసారి సెన్సార్ బోర్డ్ ఛైర్మన్ కావడం పట్ల నిర్మాతలు హర్షం వ్యక్తం చేశారని, తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని, అదే సమయంలో సెన్సార్ అధికారులు సైతం తమకు సహకరించాలని కోరినట్టు తెలుస్తోంది. ఛైర్మన్ హోదాలో ఉండి కూడా శశిశేఖర్ నిర్మాతలను స్వయంగా ఈ సమావేశానికి ఆహ్వానించి, తమ సమస్యలపై చర్చించడం పట్ల పలువురు నిర్మాతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీబీఎఫ్‌సీ ఛైర్మన్ శశి శేఖర్‌తో పాటు సీఈఓ రాజేంద్రసింగ్, సీబీఎఫ్‌సీ బోర్డ్ మెంబర్ జీవిత రాజశేఖర్, రీజనల్ ఆఫీసర్ రాహుల్ గౌలీకర్ పాల్గొన్నారు.

# చేతికి బ్యాండేజీతో నాని..



నేచురల్ స్టార్ హీరో నాని ప్రస్తుతం ప్యారడైజ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రానికి ఇంతకు ముందు దసరాతో నానికి మంచి హిట్ ఇచ్చిన శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో మరోసారి వస్తోన్న ఈ మూవీ కోసం నాని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రాన్ని 1940–1970 బ్యాక్ డ్రాప్‌లో సాగే ఒక పవర్‌ఫుల్ అండర్ వరల్డ్ మాఫియా స్టోరీగా రూపొందిస్తున్నారు.

ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ చివరిదశకు చేరుకుంది. త్వరలోనే షూటింగ్ పూర్తికానుంది. ఇదిలా ఉండగా హీరో నాని సోషల్ మీడియాలో షేర్ చేసిన చిత్రాలు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ఫోటోల్లో వింటేజ్ హెయిర్ లుక్‌లో సరికొత్త అవతారంలో కనిపించాడు. అయితే ఈ ఫోటోల్లో నాని ఎడమచేతికి బ్యాండేజ్ తో కనిపించారు. తన ఫోటోలకు హిందీలో క్యాప్షన్ రాసుకొచ్చారు. 'నేను గాయపడ్డా... అందుకే మరింత ప్రమాదకరంగా మారా' అంటూ ధురంధర్ డైలాగ్‌తో క్లారిటీ ఇచ్చారు. ప్యారడైజ్ మూవీ షూటింగ్‌లోనే నానికి గాయమైనట్లు తెలుస్తోంది. ఈ సినిమా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అవా యూ ట్యూబ్ చానల్లో 'కన్నప్ప'



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా వచ్చిన మూవీ 'కన్నప్ప'.. గతేడాది జూన్ 27న థియేటర్లలో రిలీజై బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్, మోహన్ బాబు, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ లాంటి స్టార్స్ నటించారు. ఈ సినిమాకు ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. గతంలో ఈ మూవీ ఓటీటీ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. గతేడాది సెప్టెంబర్ 4న ఓటీటీలోకి రానుందని అధికారికంగా ప్రకటించారు. కానీ అనుకున్న సమయానికి స్ట్రీమింగ్‌కు రాలేదు. అమెజాన్ ప్రైమ్‌లో కేవలం హిందీ వర్షన్ మాత్రమే అందుబాటులో ఉంది. అయితే దక్షిణాది భాషల్లో ఇప్పటి వరకు ఓటీటీలో స్ట్రీమింగ్ కాలేదు. తాజాగా కన్నప్ప సినిమాపై మంచు విష్ణు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ చిత్రాన్ని నేరుగా సొంత యూట్యూబ్ ఛానెల్లో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. జూలై 03 నుంచి అవా ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెల్లో స్ట్రీమింగ్ కానుందని ప్రకటించారు.